# భగవాన్ శ్రీరామకృష్ణ

## (జీవితం, ఉపదేశాలు)



# భగవాన్ శ్రీరామకృష్ణ
# జీవితం, ఉపదేశాలు


ఆంగ్లమూలం : స్వామి తపస్యానంద

అనుసృజన : బి.యస్.ఆర్. ఆంజనేయులు



రామకృష్ణ మఠం

దోమలగూడ హైదరాబాదు – 500 029

© 2018 Ramakrishna Math, Hyderabad INDIA. All rights reserved.

Published by:

Adhyaksha

Ramakrishna Math

Domalguda, Hyderabad – 29

rkmath.org

e–Book


004v1.1.0

Date: October 6, 2018

ISBN: 9789386857255

Created by: Sriranga Digital Software Technologies Private Limited

srirangadigital.com



భగవాన్ శ్రీరామకృష్ణ

# (జీవితం)

## బాల్యం

"శ్రీరామకృష్ణ పరమహంస జీవితచరిత్ర ఆచరణాత్మక మైన మత చరిత్ర. ఆయన జీవితం మనల్ని భగవంతుణ్ణి ముఖాముఖీ దర్శింప చేస్తుంది. ఆయన జీవిత చరిత్రను చదివిన వారెవరైనా 'భగవంతుడొక్కడే సత్యం, తక్కినదంతా మిథ్య' అనే విశ్వాసాన్ని పొందకుండా ఉండలేరు. శ్రీరామకృష్ణులు దైవత్వం మూర్తీభవించిన సజీవమూర్తి. ఆయన ఉపదేశాలు కేవల పండిత వాక్యాలు కావు, అవి జీవిత గ్రంథంలోని పుటలు, ఆయన స్వీయ అనుభూతులకు నిదర్శనాలు. అందుచేత అవి పాఠకుల మీద అప్రతిహత మైన ప్రభావం చూపిస్తాయి. సంశయాత్మకమైన నేటి తరానికి శ్రీరామకృష్ణులు ఒక ఉజ్జీవమైన విశ్వాసాన్ని ప్రదర్శిస్తున్నారు. అది ఆధ్యాత్మిక వికాసాన్ని కాంక్షిస్తున్న ఎంతోమందికి ఊరడింపును ఇస్తుంది. శ్రీరామకృష్ణుల జీవితం అహింసకు ఒక ప్రత్యక్ష దృష్టాంతం. ఆయన ప్రేమకు కుల, జాతి, మత, భౌగోళిక తదితర అవధులు లేవు. రాబోయే పుటలు చదివే వారందరికీ ఆయన దివ్యప్రేమ స్ఫూర్తిని, కలిగిస్తుంది గాక!"*

మహాత్మాగాంధీ ఏ మహానుభావుణ్ణి గురించి పై ప్రశంస చేశారో ఆయన జీవిత పుట్టుపూర్వోత్తరాలను తెలుసుకోవ డానికి మనం 1814 వ సంవత్సరానికి వెళ్ళాలి. పశ్చిమ బెంగాల్, హుగ్లీ జిల్లాలోని దేరే అనే గ్రామంలోని ఒక సద్బ్రాహ్మణుడు, ఆ గ్రామ జమీందారు ఆగ్రహానికి గురైయ్యాడు. ఆ గ్రామ నియంతకు అనుకూలంగా తప్పుడు సాక్ష్యం ఇవ్వటానికి ఆ సద్బ్రాహ్మణుడు నిరాకరించాడు. దాని ఫలితంగా అతడు తనవని చెప్పుకునే ఆస్తినంతా కోల్పోయి, తన స్వగ్రామం నుండి బైలుదేరి అదే జిల్లాలోని కామార్పుకూర్ అనే మరొక గ్రామానికి వలస వెళ్ళవలసి వచ్చింది. ధర్మపరాయణుడు, ధీరుడు అయిన ఈ సద్బ్రాహ్మణుడే

క్షుదీరాం ఛటోపాధ్యాయ. ఈయనే నేడు ప్రపంచమంతా అవతారమూర్తిగా కీర్తిస్తున్న శ్రీరామకృష్ణుల జనకుడు.

క్షుదీరాం కేవలం సత్యనిష్ఠాపరుడు మాత్రమే కాదు. సాహసికుడైన యాత్రీకుడు కూడ! ప్రయాణ సౌకర్యాలు ఏమీ లేని ఆ రోజుల్లో కాలినడకన అతి ప్రయాసకరమైన యాత్ర సాగించి, 1824 వ సంవత్సరంలో దక్షిణదేశంలో 1500 మైళ్ళ సుదూరంలో ఉన్న రామేశ్వరాన్ని దర్శించాడు. 1835 వ సంవత్సరంలో అతడు గయా క్షేత్రానికి మరొక యాత్ర చేశాడు. ఆ క్షేత్ర అధిదైవం, పరాత్పరుడైన విష్ణుమూర్తి, ఆయన కుమారుడుగా జన్మిస్తాడనే ఆదేశాన్ని పొందాడు. ఆయన భార్య అయిన చంద్రమణీదేవి కూడా ఒక మహాపురుషుడు తన గర్భవాసంలో ఉదయిస్తాడనే సూచన పొందింది. ఈ దివ్యావతరణ భూమ్మీద 1836, ఫిబ్రవరి 18 వ తేదీ ఉషోదయం 5 :15 గంటలకు జరిగింది. గయలోని విష్ణువు పేరైన గదాధరుడుగా ఈ బాలుడు పిలువబడ్డాడు. శ్రీరామకృష్ణ అనే ప్రఖ్యాత నామం ఏ కారణంగా ఈ అవతారమూర్తికి ఆపాదితమైందో తెలియటం అసాధ్యం. వేదాలు అపౌరుషాలైనట్లే ఈ పేరు అపౌరుషేయమే!

ఏ లక్షణాల చేత భావికాలంలో మానవోద్ధారకుడుగా అంగీకరింపబడ్డాడో, అవి గదాధరునిలో శైశవంలోనే అభివ్యక్తమైయ్యాయి. 'పూవు పుట్టగానే పరిమళిస్తుంది' అనే నానుడి గదాధరుని విషయంలో ఋజువైంది. శ్రీకృష్ణుని మాదిరి అద్భుతాకర్షణకు అతడు పేరు పడ్డాడు. పసివాడుగా గ్రామంలోని అందరికి, ముఖ్యంగా స్త్రీలకు ముద్దు బిడ్డడైనాడు. బాలుడుగా అతడు ఆరోగ్యంగా, ఉత్సాహంగా, అందంగా, అన్యోన్యంగా, చమత్కారంగా ఉంటూ తన ఈడు బాలబాలిక లందరికీ ఆకర్షణ కేంద్రమైయ్యాడు. చక్కగా పాడగలడు. వయస్సుతో క్రమవికాసం చెందుతూ అభినయంలో ప్రతిభావంతుడుగా ఒప్పారాడు. భక్తి నాటకాలు ఆడించే పిల్లల నాటక సంఘానికి నిర్వాహకుడు అయ్యాడు. అద్భుత జ్ఞాపకశక్తి ఉండటంతో ఆ గ్రామ ఉత్సవ సమయాల్లో సుప్రసిద్ధ కళాకారులు వేసే నాటకాల్లోని పాటలు ఒక్కసారి విన్నంత మాత్రాన్నే వాటిలో ప్రావీణ్యం గడించేవాడు. గ్రామ పాఠశాలలో ఇవ్వబడే లాంఛన ప్రాయమైన విద్య పట్ల,

ముఖ్యంగా గణితంలో ఆసక్తి చూపేవాడు కాడు. కాని వేదికా ప్రాసంగికులు కొందరు చిత్రించినట్లు, అతడు నిరక్షరాస్యుడు కాడు. గదాధర్ స్వదస్తూరితో చూసి రాసుకున్న కొన్ని పాఠాలు నేటికీ పదిలపరచబడి ఉన్నాయి. స్వాభావికంగా కళాత్మక మనస్కుడవటంతో భక్తిగీతాలు పాడటంలో, నాటకాలు ఆడటంలో, మట్టి బొమ్మల తయారీలో ఆసక్తి మొదలైన కారణాల వల్ల 'పొట్టకూటి చదువు' అని ముద్ర పడ్డ లౌకిక చదువు అతడికి అంతగా ఒంటపట్టలేదు.

# తొలి దివ్యానుభూతులు

ఆధ్యాత్మిక భావావేశాలు కలిగే స్వభావం, తీవ్రమైన భక్తి భావన అనేవి గదాధరుని బాల్యం నుండే మామూలు వారి కన్నా భిన్నంగా వ్యక్తమైయ్యాయి. అలాంటి భావావేశంలో మొదటిది అతనికి ఆరవ లేక ఏడవ ఏట కలిగింది. తినటానికి తన కిచ్చిన మరమరాలను నడుముకు కట్టుకున్న చిన్న బుట్టలో వేసుకుని, వాటిని నములుతూ ఒకరోజు అతడు వరిపొలం గట్టు మీద నడుస్తున్నాడు. అప్పుడే ఒక దట్టమైన నల్లని వర్షమేఘం ఆకాశాన్నంతా కమ్ముకోవటం, ఒక తెల్లని కొంగల బారు ఆ మేఘాల క్రింద నుండి వేగంగా ఎగురుకుంటూ పోవటం అతడికి కనిపించాయి. మనోహరమైన ఆ రంగుల్లోని వ్యత్యాసం, ఎవరి వైభవంలో ఈ ప్రకృతి ఒక అతిసామాన్య దర్పణమో అలాంటి ప్రకృతి సౌందర్యం, బాల గదాధర్‌లో భగవదనుభూతికి ప్రేరణను కలిగించింది. అతని ఎదుట గోచరమైన ఈ అతీంద్రియ నూతన దృశ్యంతో కలిగిన అవ్యక్తానందంలో మునిగి అతడు బాహ్యచైతన్యాన్ని కోల్పోయాడు. ఆయన తదుపరి జీవితంలో అధిక కాలం ఏ దివ్యచైతన్య స్థితిలో ఉండేవారో దాని ప్రథమ అనుభూతి ఇది. తరువాత వివిధ పరిస్థితులచే కలిగిన ప్రేరణతో అదే రకమైన అనుభూతులు వెంట వెంటనే తదుపరి సంవత్సరాల్లో ఆయనకు కలిగాయి. అలాంటి ఒక అనుభూతి కొన్ని నెలల తరువాతే కలిగింది. కొంతమంది స్త్రీ-యాత్రికులతో కలిసి దగ్గరలోని విశాలాక్షి దేవాలయానికి వెళుతున్నాడు. మనోహరమైన భక్తి గీతాలు పాడటం వల్ల, అనేక ప్రజ్ఞలతో ఆకర్షణీయంగా ఉండటంతో గదాధర్ లోగడే ఆ గ్రామ స్త్రీలకు ముద్దుబిడ్డడైనాడు. అందువల్ల స్త్రీ–యాత్రికులు తమతో పాటు విశాలాక్షి దేవాలయానికి గదాధర్‌ని కూడా తీసుకువెళ్లారు. అలా నడుస్తూన్నప్పుడు గదాధర్ భావావేశంతో అమ్మవారి మీద ఉత్తేజకరమైన పాటలు పాడుతూ, తన తోటివారి అలసటను మైమరపింప చేశాడు. ఆ సమయంలో ఆనందాశ్రువులు అతడి చెక్కిళ్ళ మీద స్రవించాయి. ఆ పాటలు అతడి ప్రగాఢ భక్తి స్వభావాన్ని ఎంతగా కదిలించాయంటే అప్పుడు అతడి ముందు కనిపించిన దివ్యచైతన్యంలో మునిగిపోయి బాహ్య స్మృతిని పూర్తిగా

కోల్పోయాడు. ఆ స్త్రీలు ఎంతో సేపు అతడి చెవుల్లో బిగ్గరగా విశాలాక్షి నామాన్ని ఉచ్చరిస్తే గాని, అతడికి బాహ్య స్మృతి కలుగలేదు. కాని పిల్లవాడికి ఈ దివ్యానుభూతి వల్ల ఏ విధమైన భౌతిక అలసట, అశక్తత కలుగక పోవటంతో ఈ యాత్రీకబృందం తమ పయనాన్ని కొనసాగించింది.

ఒకటి రెండేళ్ళ పిమ్మట ఇదే రకమైన మరో భావావేశం కలిగింది. ఆ సందర్భం శివరాత్రి. ఆనాటి ఆరాధ్య దైవం అయిన పరమశివుడి పరమైన ఒక నాటకాన్ని ఆ గ్రామస్థులు ఏర్పాటు చేశారు. శివుని పాత్రధారి అయిన ప్రధాన నటుడు అనివార్య కారణంగా నాటకంలో పాల్గొనలేకపోయాడు. గదాధర్‌లోని అభినయ ప్రతిభ గ్రామస్థులందరి అభిమానాన్ని చూరగొని ఉండటంతో, శివుని పాత్ర ధరించటానికి అతణ్ణి కష్టం మీద ఒప్పించారు. శివ పాత్రధారి అయిన గదాధర్ రంగస్థలం మీద ప్రవేశించగానే, అతడి భావావేశ తీవ్రత ప్రేక్షకుల్లో శివానుభూతిని రగిలించి, గొప్ప సంచలనాన్ని కలిగించింది. కాని శివ భంగిమలో నిలబడ్డ అతడు స్థాణువులా ఎంతో సేపు అలాగే ఉండిపోయాడు. ఆ భావావేశ స్థితి ఆ రాత్రంతా ఉండిపోయింది. ప్రేక్షకులు నిశ్శబ్దంగా అక్కణ్ణుంచి వెళ్ళిపోయారు.

గదాధర్‌కి తొమ్మిదవ ఏట ఉపనయనం జరిగింది. ఇంట్లో దేవతార్చన చేయడం మొదలిడినప్పటి నుండి అతడిలోని ఆధ్యాత్మిక ప్రవృత్తి తీవ్రతరం కాసాగింది. దీనికి తోడు 1843 వ సంవత్సరంలో ధర్మపరాయణుడైన తన తండ్రి ఆకస్మిక మరణం గదాధరుడి లేత మనస్సు మీద 'జనన మరణాలంటే ఏమిటి?' అనే లోతైన ప్రశ్నల తాకిడి కలిగి, అతడు మరీ అంతర్ముఖుడైనాడు. ఇలాంటి విషయాల వల్లా, భక్తి గీతాల్లోను, నాటకాల్లోను, నిమగ్నుడు అవటం, సన్న్యాసులను దర్శించటం, సమీపంలోని దేవాలయాలకు యాత్రలు చెయ్యటం వల్ల పాఠశాలకు పోవటంలోని శ్రద్ధ క్రమంగా సన్నగిల్లింది, లౌకిక విద్యను నిర్లక్ష్యం చేయసాగాడు. ఈ విధంగా గదాధర్‌కి పదిహేను ఏళ్ళు వచ్చాయి. అప్పుడు పెద్ద అన్నయ్య రామ్‌కుమార్ కలకత్తాలో ప్రారంభించిన సంస్కృత పాఠశాలలో అన్నకు సహాయంగా ఉండేటందుకు గదాధర్ అవసరమయ్యాడు. బహుశా చదువు పట్ల తమ్ముడి నిర్లక్ష్యం చూసి, దాని కారణంగా అతడి

భవిష్యత్తు ఏమవుతుందోనని రామ్‌కుమార్ బాగా యోచించటం కూడా దీనికి కారణమై ఉండవచ్చు. తన అవసరం, తమ్ముని పట్ల తనకున్న అక్కరల కారణంగా రామ్‌కుమార్ 1852 లో గదాధరుణ్ణి కలకత్తాకు తీసుకు వెళ్ళటానికి ఉన్ముఖుణ్ణి చేసి ఉండవచ్చు. దీనితో అతడి జీవితరంగంలోని మొదటి అధ్యాయం పూర్తి అయ్యింది.

# పొట్టకూటి చదువుకు ఉద్వాసన

అదనపు రాబడి నిమిత్తం రామ్‌కుమార్ కలకత్తాలో ఒక ఇంట్లో దేవతార్చన చేసేవాడు. ఇప్పుడు ఆ పనిని గదాధర్‌కి అప్పగించాడు. అంతేగాక గదాధర్ అన్నగారి సంస్కృత పాఠశాలకు కూడా హాజరు కావలసి ఉంది. కాని ఈ రెండు పనుల్లో మొదటిది గదాధర్‌కి చాలా ఇష్టమైపోయింది. అత్యంత భక్తిశ్రద్ధలతో ఒక మహిళా భక్త బృందాన్ని, మిత్ర బృందాన్ని తయారుచేశాడు. అతడు పాడే హృదయరంజక భక్తిగీతాలు వినటం కోసం ఆ భక్తులు ఆకర్షికమైన, స్ఫూర్తిదాయకమైన అతడి స్నేహాన్ని అభిలషించేవారు. దీని ఫలితంగా కామార్పుకూర్‌లో మాదిరే చదువుకునేందుకు సమయం దక్కక చదువును నిర్లక్ష్యం చేయసాగాడు. గదాధర్ తల్లి వద్ద నిశ్చింతగా గడిపే గ్రామీణ జీవితాన్ని విడిచి కలకత్తాకు రావడంతో, కొన్నిరోజుల పాటు అతని నిర్లక్ష్యాన్ని అన్నగారు సహించాడు. కాని తన పద్ధతులు మార్చుకోవాలనే ఆలోచన గదాధర్‌లో మచ్చుకైనా కనిపించక పోవటంతో, ఒకరోజు ఆ విషయాన్ని ఎత్తిచూపుతూ చదువు నిర్లక్ష్యం చేస్తూన్నందుకు తీవ్రంగా మందలించాడు. తన విధానాల్ని మార్చుకోవడం ఇష్టం లేని గదాధర్ తీక్షణమైన, నిశ్చలమైన జవాబు, నేడు ప్రఖ్యాతిగాంచిన ఈ కింది సమాధానంగా రూపుదాల్చింది “బియ్యం, అరటికాయలు మూటలు కట్టే (పొట్టకూటి) చదువు నాకు అక్కర్లేదు. ఏ విద్య హృదయవికాసాన్ని కలిగించి, వాంఛలన్నిటికీ అతీతమైన ఆధ్యాత్మిక సంతృప్తిని కలిగిస్తుందో, ఆ విద్యనే నేను అభ్యసిస్తాను.” గదాధర్ విద్యాభ్యాసం ఇంతటితో ఆగిపోయింది. అతడి జీవితం సాధారణ పంథా నుండి ఆధ్యాత్మిక శిఖరాలను అధిరోహించే గమ్యం కేసి మళ్లించబడింది.

# దక్షిణేశ్వరాలయం

1855 వ సంవత్సరంలో కలకత్తాకు నాలుగు మైళ్ళ దూరంలో దక్షిణేశ్వరం అనేచోట ఒక గొప్ప కాళికాలయం వెలసింది. గదాధర్‌లో గర్భితంగా ఉన్న అనంత ఆధ్యాత్మిక శక్తి వికాసానికి, ఆ శక్తి అభివ్యక్తమవడానికి ఈ దేవాలయం నిలయమై విరాజిల్లింది. దైవనిర్ణీతమైన ఆ ప్రదేశంలో సంపన్నురాలు, ధార్మికురాలు, దయాళువు అయిన రాణి రాస్మణి చేత ఆ దేవాలయం నిర్మించబడింది. రాణి కాశీయాత్రకు బయలుదేరినప్పుడు ఆమె పయనిస్తున్న పడవలు ఒకనాటి సాయంత్రం కలకత్తా పరిసరాల్లోని దక్షిణేశ్వరం అనే చోట ప్రతికూల వాతావరణం కారణంగా లంగరు దించబడ్డాయి. ఆనాటి రాత్రి రాణికి ఒక కల వచ్చింది. ఆ కలలో కాళీమాత ఆమెకు దర్శనం ఇచ్చి, ఆవలి తీరంలో ఒక దేవాలయాన్ని నిర్మించమని, ఆ పుణ్య కార్యం కాశీయాత్రతో సమానమైన ఫలితాన్ని ఇస్తుందని ఆదేశించింది. ఆ విధంగా నేటి విఖ్యాత దక్షిణేశ్వరాలయం వెలసింది. దేవాలయ ప్రతిష్ఠ జరిగిన 1855 వ సం ॥ లో గదాధరుడు కలకత్తా సంస్కృత పాఠశాల నుండి ఆ ప్రదేశానికి తరలి రావలసివచ్చింది. దైవ ప్రతిమను ప్రతిష్ఠించి, ప్రథమంలో ప్రధాన పూజారిగా నియుక్తుడైనది ఎవరో కాదు, గదాధర్ అన్న రామ్‌కుమారే. ఆ కారణంగా రామ్‌కుమార్, తాను జరిపిస్తున్న సంస్కృత పాఠశాలను మూసివేసి, దక్షిణేశ్వరంలో నివాసం ఏర్పరచుకున్నాడు. గదాధర్ కూడా అన్నగారిని అనుసరించి ఆలయ ప్రాంగణంలో స్థిరపడ్డాడు. 1886 వ సంవత్సరంలో తనకు దాపురించిన వ్యాధి కారణంగా చికిత్స నిమిత్తం కలకత్తాకు తరలించబడేంత వరకు, మూడు దశకాల కాలం వరకూ ఆ ఆలయం అతడి పుణ్యధామంగా విరాజిల్లింది.

గదాధర్ భక్తిపూరిత స్వభావం, కొట్టవచ్చినట్లుండే వ్యక్తిత్వం దేవాలయ యజమానురాలైన రాణి రాస్మణిని, ఆమె అల్లుడు అయిన మధురనాథ్ విశ్వాస్‌ను ఎంతగానో ఆకర్షించాయి. అందువల్ల వారు అతణ్ణి దేవాలయ అర్చకుల్లో ఒకరినిగా నియమించాలనుకున్నారు. కాని గదాధర్ సమ్మతిని పొందడానికి మధుర్ ఎంతో శ్రమ

తీసుకోవలసి వచ్చింది. మొదట్లో కాళికాలయ ప్రాంగణంలోని రాధాకాంతాలయ అర్చకుడిగా, తదుపరి కాళికాలయంలో రామ్‌కుమార్‌కి సహాయక అర్చకుడిగా నియమితుడైయ్యాడు. 1856 వ సం ॥ లో రామ్‌కుమార్ మరణానంతరం గదాధర్ కాళికాలయ ప్రధాన అర్చకుడిగా నియమించబడ్డాడు. ఆయన మేనల్లుడు హృదయ్‌రామ్ సహాయక అర్చకుడిగా నియమితుడైయ్యాడు.

# గదాధర్ పరివర్తనలోని తొలిదశ

కాళికాలయంలో అర్చకత్వం గదాధరుడి జీవితంలో ఒక మలుపు తిప్పింది. లోగడే వైదిక కర్మ చేయడానికి అర్హతను కలిగించే దేవీమంత్రాన్ని చెవిలో ఉపదేశించినప్పుడే, గదాధర్ తీవ్రధ్యాన స్థితిలోకి వెళ్లిపోయాడు. నిశ్చింతతో హాయిగా ఉండే అతడి స్వభావం ప్రస్తుతం గంభీరంగాను, అంతఃపరిశోధనగాను మారిపోయింది. భక్తి రాహిత్యంగా యాంత్రికంగా పూజా పురస్కారాలు నిర్వర్తించే సామాన్య అర్చకుల మాదిరి కాకుండా, గదాధరుడు అర్చనలో పూర్తిగా నిమగ్నమైపోయేవాడు. పూజానంతరం ఎవరిలోను కానరాని భక్త్యావేశంతో దేవీగానం చేస్తూ ఉత్తేజకరమైన పాటలు గంటల తరబడి పాడుతూండేవాడు. ఆలయంలో పూజాది కర్మలు లేని సమయంలో, ముఖ్యంగా రాత్రుళ్లు అతడు తన గది నుండి మాయమయ్యేవాడు. గదాధర్‌కు సహాయకుడుగా ఉన్న అతని మేనల్లుడు హృదయ్ దీని విషయంగా ప్రశ్నించినప్పుడు, తాను దేవాలయ ప్రాంగణంలోనే ప్రశాంత నిశీథిలో ఏకాంత ప్రదేశంలో దేవీ ధ్యానంలో నిమగ్నమయ్యానని చెప్పాడు. ఒకసారి హృదయ్ గదాధర్‌ని వెంబడించి పొదలాంటి ఆ ప్రదేశం జాడ కనుగొని, ఆయన్ను భయపెట్టటానికి దూరం నుండి రాళ్లు రువ్వాడు. కాని ఆ ప్రయత్నం విఫలమైంది. మరో రోజు ఆ చోటుకు వెళ్లి చూసి దిగ్భ్రాంతుడైయ్యాడు. తన మామ కట్టుగుడ్డలు మాత్రమే గాక యజ్ఞోపవీతాన్ని కూడా తీసివేసి, పూర్తి దిగంబరుడుగా కూర్చున్నాడు. గధాధర్‌కి ఏ మాత్రం బాహ్యస్మృతి లేనందున, ఈ విపరీత ప్రవర్తనకు కారణం ఏమిటో తెలుసుకోవడానికి హృదయ్ ఓర్పుతో ఎంతోసేపు వేచివుండవలసి వచ్చింది. ఆశ్చర్యం గొలిపే ఆ సమాధానం ఇది – "భక్తుడైన వాడు భగవంతుణ్ణి ఇలాగే ప్రార్థించాలి. పుట్టినప్పటి నుండి మనకు ద్వేషం, సిగ్గు, కులం, సంస్కారం, భయం, కీర్తి, గర్వం, అహంకారం అనే అష్ట పాశాలు ఉన్నాయి. ఈ యజ్ఞోపవీతం నేను బ్రాహ్మణుణ్ణని, అందరి కంటె అధికుణ్ణనే భావాన్ని కలిగిస్తుంది. అందుచేత దేవిని ధ్యానించేటప్పుడు దీన్ని తీసివేస్తాను. తరువాత ధరిస్తాను."

అలాంటి స్వభావం, అర్చన చేస్తున్నప్పుడు ఆయన ప్రవర్తించే తీరు హృదయ్‌లో

ఆందోళన కలిగించాయి. మితి మీరిన భక్తిభావనతో తన మామ మతిభ్రమణం తెచ్చి పెట్టుకుంటున్నాడేమో అని భావించసాగాడు.

గదాధర్ సాధారణ కర్మకలాప పద్ధతిని వదలిపెట్టి, దేవీ విగ్రహాన్ని సజీవమూర్తిగా భావించటం మొదలుపెట్టాడు. విగ్రహంతో మాట్లాడతాడు, అన్నం నోట్లో పెడతాడు. నిద్ర పొమ్మంటాడు. ఎంత సేపో చామరం వీస్తూంటాడు. కేవలం, పరిసరాలు మర్చిపోయి ఏదో తన స్వంత ప్రపంచంలో ఉన్నట్లు ఉపచారాలన్నీ చేస్తూంటాడు. ఈ తతంగమంతా దేవాలయ సిబ్బంది దృష్టిలో పడటానికి ఎంతో కాలం పట్టలేదు. పద్ధతికి విరుద్ధంగా అర్చన చేస్తూ, ఈ కొత్తపూజారి విగ్రహాన్ని అపవిత్రం గావిస్తున్నాడని వారు భావించారు. రాణి రాస్మణి అల్లుడు, ఆమె సహాయకుడు, ఆలయాధికారి అయిన మధుర్‌నాథ్‌కు వారు ఫిర్యాదు చేశారు. విషయాన్ని అక్కడికక్కడే తెలుసుకోవాలనే ఉద్దేశంతో, మధురనాథ్ ఒకరోజు అకస్మాత్తుగా తనిఖీ చెయ్యడానికి వచ్చాడు. అల్ప బుద్ధులైన దేవాలయ సిబ్బందికి భిన్నంగా మధుర్, ఈ యువపూజారి వింత ప్రవర్తనకు కారణం అతడి తీవ్ర భక్తి పారవశ్యంగా గ్రహించి, ఆ సిబ్బందికి నిరాశ కలిగేట్లు ఈ యువపూజారి విషయంలో దేన్నీ పట్టించుకోవద్దని ఆజ్ఞ జారీచేశాడు. ఈ పూజ చూసిన తరువాత గదాధర్ పట్ల మధుర్‌కి ఉన్న అభిమానం మరింత పెరిగింది.

కొద్దిరోజుల్లోనే గదాధర్ యొక్క విభ్రాంతికర చర్య దేవాలయంలో ఒక సంచలనం రేకెత్తించింది. దేవాలయ యజమాని అయిన రాణి రాస్మణి అర్చన నిమిత్తం కాళికాలయానికి వచ్చింది. ఆమె కోరిక మేరకు గదాధర్ కొన్ని భక్తి గీతాలు పాడాడు. అప్పుడామె దగ్గరలో కూర్చుని పరధ్యానంలో దేవికి పువ్వులమాల కడుతోంది. ఇంతలో హఠాత్తుగా గదాధర్ తటాలున ఆసనం మీద నుండి లేచి, అందరికీ విస్మయం గొలిపేట్లు రెండుసార్లు ఆమె చెంపలు వాయిస్తూ “ఇక్కడ కూడా అదే ఆలోచనల్లోనే మునిగి పోయావా?” అన్నాడు. నిజానికి రాస్మణి అప్పుడు న్యాయస్థానంలో నడుస్తూన్న కొన్ని వ్యాజ్యాలను గురించి ఆలోచిస్తూండటం గదాధర్ తన అంతర్దృష్టితో గ్రహించాడు. అతడిలోని జగద్గురువు అప్పుడు బయటికొచ్చాడు. అర్చన

సమయంలో కూడా లౌకికాలోచనల్లో మునిగి, ఆధ్యాత్మిక మార్గాన్ని తప్పుతూ శిక్షార్హురాలైన శిష్యురాలుగానో లేక కుమార్తెగానో ఆయన ఆమెను భావించాడు. ఆలయ అధికారిణి అయిన రాస్మణే స్వయంగా అతడి విపరీత ప్రవర్తనను కళ్లారా చూడ్డంతో కష్టాలు కొనితెచ్చే పూజారి పీడ విరగడవుతుందని ఆలయ సిబ్బంది సంతోషపడ్డారు. కాని దేవియే సాక్షాత్తు తనకు తగిన శిక్ష విధించినట్లుగా ఈ సంఘటనను భావించి ఆలయ నిర్వహణాధికారితో ఈ సంఘటనను విస్మరించమని రాస్మణి చెప్పింది. ఈ సంఘటన జరిగాక గదాధర్ మీద ఆమెకు ఉన్న గౌరవం మరింత ఇనుమడించింది.

# దేవితో ముఖాముఖి

గదాధర్‌లో కలుగుతున్న ఆంతరింగిక ఆధ్యాత్మిక అనుభూతులు, జీవిత దృక్పథం పట్ల అతడిలో క్రమంగా ఏర్పడుతున్న మహత్తరమైన మార్పులే ఈ విపరీత పరిణామాలకు కారణం. దేవాలయంలో చేస్తున్న నిత్య పూజ అతడి మనస్సులో నిగూఢమైన ప్రశ్నకు దారితీసింది. 'పూజించే విగ్రహాలు, అర్చించబడుతున్న దివ్యత్వం, నిజమైనదా? లేక కేవలం భ్రాంతి జనితమా?' అతని ఈ ప్రశ్న సామాన్యులు వేసేటటువంటిదీ కాదు, హేతువాది వేసే బౌద్ధికమైనటువంటిదీ కాదు. రోజులు గడిచేకొద్దీ అది అతనికి చావా, బ్రతుకా అనే ప్రశ్నగా అయిపోయింది. మనుష్యుల్లో మూడు రకాలైన తృష్ణలున్నాయి. అవి : కామేచ్ఛ, భోజనేచ్ఛ, హృదయేచ్ఛ. లౌకిక మానవుల్లో, జంతువుల్లో మాదిరి మొదటి రెండు తృష్ణలు పనిచేస్తాయి. మూడవది వారిలో మృగ్యమే! ఏ కొద్ది మందిలోనో ఇది తాత్కాలికంగా కనపడుతుంది. కాని గదాధర్ విషయంలో అది అనవరతమూ, ప్రధానమైన తృష్ణగా నిలిచిపోయింది. ఎంత ప్రధానమైనదంటే, ఈ తృష్ణ కాలాంతరంలో 'కామినీ కాంచనాలు' అని ఆయన పేర్కొన్న రెండు తృష్ణల్ని సమూలంగా నిర్మూలించి వేసింది. 'భగవంతుడు కనుక సత్యమే అయినట్లయితే, మనకు కనబడే వాటన్నింటి కంటే సుస్పష్టంగా కనబడాలి. ఆయన సచేతనమే అయినట్లయితే ఆయన భక్తుల వ్యాకులపూరిత ప్రార్థనలకు స్పందించాలి.' ఈ రకమైన ఆలోచన అతణ్ణి ఆవహించి తన జగజ్జనని కోసం ఎల్లప్పుడూ ఆరాటపడే స్థితికి కొనివచ్చింది. ఇతరుల కళ్లకు అది పిచ్చిగా అగపడింది. ఈలోపు అతడి పట్ల అత్యంత ప్రేమ గౌరవాలు కలిగిన మథురనాథ్, ఆ పరిస్థితుల్లో కర్మకలాపాలు నిర్వర్తిస్తూ అర్చన చెయ్యటంలో గదాధర్ ఎదుర్కొంటున్న ఇబ్బందిని గ్రహించి, అతనికి ఆధ్యాత్మిక వ్యావృత్తిని కొనసాగించటానికై విశ్రాంతి కల్పించాడు. కాళికాలయంలో ప్రధాన అర్చకుడిగా హృదయ్ నియమించబడ్డాడు.

రోజులు గడిచేకొద్దీ ఈ వ్యాకులత కనీవినీ ఎరుగనంత తీవ్రరూపం దాల్చింది. మనోవిహ్వలతతో రేయింబవళ్లు ఎలా గడిచాయో గదాధర్‌కు ఎరుక లేదు. సాయంత్రం గుళ్లో

గంటలు మోగినప్పుడు, "ఈ స్వల్ప జీవితంలో మరో రోజు గడిచిపోయింది. జీవిత లక్ష్యానికి ఏమాత్రం దరి దాపులకైనా రాలేకపోయానే" అనే తీవ్ర పరితాపంతోను, అసంతృప్తితోను, స్వీయశిక్షగా తలను నేలకేసి బాదుకొనే వాడు. "అమ్మా! ఈ స్వల్పజీవితంలో మరో రోజు గడిచి పోయింది. నాకు నీ దర్శనం లభించలేదు" అంటూ రోదించే వాడు. నీటిలో మునిగిన తలను అదిమిపెట్టబడినవాడు, ఊపిరి పీల్చటానికై ఎలా కొట్టుమిట్టాడతాడో, అలాంటి వ్యాకులత తాను అనుభవించానని నాటి తన స్థితిని కాలాతరంలో వర్ణించాడు. అది అతడిలో అంతర్గతమై పోయింది. తన తీవ్ర వ్యాకులతకు కాలాంతరంలో మరో సాదృశ్యమిచ్చాడు – "తానున్న గదికి పక్కగదిలో గొప్ప నిధి వుందనీ, జీవాత్మ పరమాత్మలను వేరుచేస్తున్న మాయాకుడ్యం వంటి అడ్డుగోడలో కన్నం వేస్తే అది లభిస్తుందని ఎరిగిన దొంగ స్థితి వంటిది అది!"

నిద్రాహారాలు మాని రేయింబవళ్లు ఇలా వ్యధ చెందుతూ జీవితం నిరర్థకమైపోయిందనే స్థితికి గదాధర్ వచ్చాడు. దివ్యోన్మాదంలో జగజ్జనని ఆలయంలో కర్మకలాపాలకు ఉపయోగించే కత్తితో తనను బలి చేసుకోబోయాడు. ఆ స్థితిలో తెర పైకెత్తబడింది. దాని మరుగున తనకు ఇంతకు క్రితం ఏది [దేశకాలాబాద్యమైన ప్రపంచంగా] అనుభూతం అయ్యిందో ఆ సచ్చిదానంద పరతత్వం లేక జగజ్జనని దర్శనం ఇచ్చింది. ఈ అనుభవార్థాన్ని కాలాంతరంలో ఆయన వాడుక మాటల్లో ఇలా చెప్పారు : "దివ్యజనని అనేకమంది పిల్లలను పెంచుతూన్న గృహిణిలాంటిది. ఆ గృహిణి పిల్లలను ఆటల్లో మరిపించి తన పని చేసుకోటానికి వెళ్లిపోతుంది. ఈ పిల్లలు బొమ్మలతో ఆడుకుంటూ, మిఠాయిలు తింటూ ఎంతోసేపు గడిపేస్తారు. ఆటలలో మునిగి అమ్మను మరచిపోతారు. చివరికి ఏదో ఒక బిడ్డకు ఆకలి వేసి, అమ్మ తలపుకు రావటంతో ఏడుస్తుంది. బిడ్డ ఆకలితో నిజంగా ఏడ్చిన ఏడ్పు తల్లికి తెలుసు. అలాంటి బిడ్డను ఆమె వదలివెయ్యలేదు. వెంటనే పరుగెత్తుకు వచ్చి చంక కెత్తుకుంటుంది. దివ్యజనని అటువంటిది."

కామినీ కాంచనాల పట్ల ఆసక్తిని వదలి హృదయ పరితాపంతో 'అమ్మ కోసం' భక్తుడు ఎప్పుడు విలపిస్తాడో అప్పుడు ఆమె దర్శనమిచ్చి ఓదారుస్తుంది. కంటికి జగత్తుగా గోచరిస్తున్న

ప్రకృతే – సాకార, నిరాకార సచ్చిదానందంగా సాక్షాత్కరిస్తుంది.

తనకు కలిగిన ఈ దేవీసాక్షాత్కారాన్ని తదనంతరం తన శిష్యులకు ఇలా వర్ణించారు – "ఇళ్ళు, వాకిళ్లు, దేవాలయాలు సమస్తం అదృశ్యమైనట్లు అనిపించింది. అన్నివైపులా శూన్యంగా గోచరించింది. నాకు కనిపించిన దేమిటి? నిరవధికమైన ఒక చైతన్య ప్రకాశ సాగరం. నేను ఏవైపు చూసినా, ఎంత దూరానికి చూసినా ఎడతెరపి లేని ప్రకాశవంతమైన తరంగ పంక్తి నాకేసి అత్యంతవేగంతో చెలరేగి పడుతున్నట్లు కనిపించింది. క్షణంలో అవి నా మీద పడి, నన్ను అనంతత్వపు అగాధాల్లోకి ముంచి వేశాయి. నేను ఉక్కిరిబిక్కిరై బాహ్యచైతన్యాన్ని పూర్తిగా కోల్పోయాను. బాహ్యప్రపంచంలో ఏం జరిగిందో, ఆ రోజు, మర్నాడు ఎలా గడిచాయో నాకు తెలియదు. కాని అంతకు ముందు ఎన్నడూ నేను అనుభవించని ఒక అతీతానంద ప్రవాహం నా అంతరాళంలో ప్రవహిస్తూన్నట్లు అనుభవమై, ఆ ప్రకాశమే దివ్యజనని అనే ప్రత్యక్షజ్ఞానం కలిగింది."

ఆ తీవ్రవ్యాకులత, అసాధారణ అనుభూతులు గొప్ప సాత్త్విక సంపద గల, మనశ్శరీరాలు ఉన్న గదాధర్ నరాలను కూడా చిందరవందర చేసేశాయి. ఈ అనుభూతులతో ఉద్భవమైన నూతన జీవితానికి అలవడటానికి ఆ మనశ్శరీరాలకు కొంతకాలం పట్టింది. అందరి కంటె విలక్షణంగా ఉండేవారిని మనుష్యులు పిచ్చివారుగా అనుకుంటారు. ఈ స్థితి సామాన్యస్థితి కంటె తక్కువ స్థితిలోనో, అసామాన్య స్థితిలోనో ఉండటం వల్ల కలుగు తుందనే మాట మరచిపోతారు. మొదటిరకం వారిలో వారి వ్యక్తిత్వం ముక్కలై, శిథిలమైపోతుంది. రెండవ వారిలో శక్తి, వివేకాల కేంద్రంగా పరిపూర్ణత్వం సాధింపబడుతుంది. ఈ రెండవదే గదాధర్ స్థితి. ఈ సూక్ష్మతర విషయాలను సామాన్యులు గుర్తించలేరు. గదాధర్ మేనల్లుడు హృదయ్ కూడా ఆయనకు మతిస్థిమితం తప్పుతోందని భావించాడు. ఆయన్ను అమితంగా అభిమానించి, అన్ని సందర్భాల్లోను ఆయనకు చేదోడు వాదోడుగా ఉన్న మథుర్ కూడా, ఆయనకు మితిమీరిన భక్తిసాధనలతో, శారీరక మానసిక భ్రమణలు కలుగుతున్నాయనే అభిప్రాయానికి రాసాగాడు.

మథుర్ ఆయన్ను సుప్రసిద్ధ ఆయుర్వేద వైద్యుల చికిత్సలో ఉంచాడు. కాని మందుల వల్ల ప్రయోజనమేమీ కనిపించ లేదు. ఈ వైద్యుల్లో ఒక్క దుర్గాప్రసాద్ సేన్ మాత్రమే ఈ లక్షణాలన్నీ, ఏదో ఒక ఆధ్యాత్మిక మనోస్థితి కారణంగా కలిగినవి అని, మందులు నిష్ప్రయోజనమని ప్రకటించాడు. ఇతరులకు విపరీతంగా తోచే గదాధర్ స్థితికి కారణం గుర్తించి నివారణ సూచించటం తదనంతర కాలంలో భైరవీబ్రాహ్మణి వంతే అయింది.

# గ్రామానికి పునరాగమనం – వివాహం

ఈలోపు గదాధర్‌కు వచ్చిన రుగ్మత గురించిన వార్త కామార్పుకూర్‌లో నివసిస్తున్న తల్లి చంద్రమణీదేవికి, చిన్న అన్న రామేశ్వర్‌కు తెలిసింది. అతడి ఆరోగ్యం పట్ల వారు ఆందోళన చెందారు. బహుశా వారి ఒత్తిడి వల్లనేమో గదాధర్ విశ్రాంతికి, స్వస్థతకు స్వగ్రామమైన కామార్పుకూర్ చేరుకున్నాడు. చిరపరిచితమైన గ్రామీణ వాతావరణం, దేవాలయ అర్చనా విధుల నుండి విరామంతో అతడి ఆధ్యాత్మిక భావావేశాల తీవ్రత తగ్గింది. అంతేగాక తీవ్ర దైవోన్మాదం స్థితిలో తప్ప, ఇతరుల పట్ల అతడి ప్రవర్తన ఇదివరకు మాదిరి ప్రియంగానూ, సౌహార్ధంతోను ఉండేది. ఇవన్నీ గదాధర్ కుటుంబ సభ్యులను, అతణ్ణి ఇంటి బాధ్యతలతో ముడివేస్తే తమ మాదిరిగా జీవితం గడుపుతా డనే అభిప్రాయానికి రావటానికి ప్రోత్సహించాయి. కాబట్టి అతడికి వివాహం చెయ్యటం మంచిదని వారి లౌక్యం సూచించింది. ఈ పెళ్లికొడుకు మానసిక రోగి అని జనానికి తెలియటంతో పెళ్లికూతురును వెతికే వారి ప్రయత్నాలన్నీ విఫలమైనాయి. ఈ సమస్య విచిత్రంగా పరిష్కారమైంది. గదాధర్ తీవ్రంగా అడ్డుకుంటాడనే భయంతో అతడి బంధువులు పెళ్లి ప్రయత్నాలు రహస్యంగా ఉంచారు. కాని ఏదోరకంగా అది తెలిసి గదాధరే భావావస్థలో వాళ్ళకు సరైన మార్గం చూపాడు. అతడిలా అన్నాడు– "ఇక్కడా అక్కడా వెదకటం నిష్ప్రయోజనం. జయరాంబాటిలోని రామచంద్ర ముఖోపాధ్యాయ ఇంటికి వెళ్ళండి. ముడుపు కట్టి భద్రంగా దాచిన వధువు ఉంది."

ఆ వధువే నేడు దివ్యజననిగా ప్రసిద్ధిగాంచిన శ్రీశారదాదేవి. అప్పుడు శారదకు ఐదేళ్ళ పసిప్రాయం. 1859 లో శారదకు, ఇరవై మూడేళ్ల గదాధర్‌తో వివాహం జరిగింది. వివాహమైనాక కామార్పుకూర్‌లో శారదకు భర్తను సేవించే అవకాశాలు 1866, 1867 సంవత్సరాల్లో రెండుసార్లు వచ్చినా, వారి యథార్థ సమాగమం 1874 లో దక్షిణేశ్వరంలో జరిగింది. అప్పటికి ఆమె యౌవనవతి అయింది.

# దక్షిణేశ్వరానికి పునరాగమనం – తదనంతరం

కామార్పుకూర్‌లో ఇలా రెండేళ్ళు గడిపి గదాధర్ దక్షిణేశ్వరానికి తిరిగి వచ్చి, దేవాలయంలో తన విధి నిర్వహణలో పడ్డాడు. ఆయనకు ఏ విధంగా ఏర్పడిందో ఎవరికీ తెలియని 'శ్రీరామకృష్ణ' అనే ప్రఖ్యాత నామంతో ఆయన వ్యవహరించబడ్డారు. దక్షిణేశ్వరం వచ్చాక, అంతకు ముందు తగ్గిపోయినట్లనిపించిన 'దైవోన్మాదం' మళ్లీ మరింత తీవ్రస్థాయిలో తిరగబెట్టింది. శ్రీరామకృష్ణులు తీవ్రతరమైన ప్రార్థనలతోను, అసాధారణ అనుభూతులతోను ఈ కాల ఘట్టాన్ని గడిపారు. లౌకిక మనస్కులు ఈ అనుభూతుల లోతులు తెలుసుకోలేరు.

భక్తిభావాలతోనే మునిగిపోవటంతో ఇంటివిషయం, బంధువుల సంగతి ఆయన మనస్సు నుండి పూర్తిగా మటుమాయమైనాయి. అందిరిలోను సదా దివ్యజననిని దర్శించడం ఎలాగన్నదే ఆయన ధ్యాస. నిర్విరామ జపం, ధ్యానం, భగవన్నామస్మరణ, మననం మొదలైనవాటితో ఆయన ఛాతీ కందిపోయింది. ప్రపంచమూ, ప్రాపంచిక విషయాలు ఆయనకు విషతుల్యాలైనాయి. భక్తితత్పరతతో ఒకప్పుడు ఆయన అనుభవించిన ఒళ్ళుమంటలు, నిద్రలేమి మళ్ళీ తిరగబెట్టాయి. ధ్యానానికి కూర్చున్నప్పుడు కీళ్ళన్నీ తాళాలు పడ్డట్లు లోపలి నుండి శబ్దాలు వినవచ్చేవి. చాలా సేపయ్యాక ఆ తాళాలు తీసిన శబ్దం వినిపిస్తే గాని కాళ్లు చేతులు కదిలేవి కావు. ఆ ధ్యాన సమయంలో చాలసేపు రాయిలాగా నిశ్చలంగా ఉండిపోవటంతో, జడలు కట్టిన ఆయన తలమీద చిన్నచిన్న పక్షులు వాలుతుండేవి.

అప్పటి ఆయన మానసిక స్థితిని వివరిస్తూ ఆయన శిష్యుడైన స్వామి శారదానంద తాను రచించిన 'శ్రీరామకృష్ణ పరమహంస' అనే గ్రంథంలో ఇలా వివరించారు– తాను అనుభవించిన భక్తితత్పరత పూర్వానుభవాలను గురించి గురుదేవులు అప్పుడప్పుడు ఇలా చెప్పేవారు : "ఆ స్థితి సామాన్యులకు ఎప్పుడూ కలుగదు. దాన్లో నాలుగోవంతు తీవ్రత కలిగినా వాళ్ల మనశ్శరీరాలు ఛిన్నాభిన్నం అయిపోతాయి. రేయింబవళ్ళు ఎంతోసేపు ఏదోరూపంలో జగజ్జనని దర్శనం

అవుతుండేది. అదే నా పరిస్థితిని కాపాడింది. లేకపోతే ఈ తొడుగు (శరీరాన్ని చూపిస్తూ) నిలిచి ఉండేది కాదు. ఆరు సంవత్సరాలు నిద్ర అనేది ఏమిటో నాకు తెలియదు. కళ్ళకు మూతలు పడే శక్తి క్షీణించింది. ఎంత ప్రయత్నించినా రెప్ప వాలేది కాదు. కాలం ఎలా గడిచిందనే స్పృహే లేదు. శరీర ధ్యాస అసలే లేదు. జగజ్జనని మీద నుండి నా దృష్టి ఈషణ్మాత్రమైనా శరీరం మీదికి వస్తే భయం వేసి ఇలా ప్రార్థించేవాణ్ణి : 'అమ్మా! నిన్ను ప్రార్థించినందుకు ఫలితం ఇదా? నీ మీద పూర్తిగా ఆధారపడినందుకే నాకీ రుగ్మత కలిగించావా తల్లీ?' మళ్ళీ మరుక్షణాన్నే ఇలా అనేవాణ్ణి : 'అమ్మా ఏం జరిగినా జరగనీ, అవసరమైతే ఈ శరీరం పతనం అయితే అవనీ, కాని నువ్వు మాత్రం నన్ను విడవవద్దు. నువ్వు కనిపించి నన్ను దయతో చూడమ్మా. అమ్మా! నిన్ను పూర్తిగా శరణు జొచ్చాను. నీకంటే అన్యమేదీ లేదు.' మళ్లీ నా మనస్సు అసాధారణమైన అనుభూతితో నిండినప్పుడు కొంతసేపు విలపించేవాణ్ణి. ఈ శరీరం ఏమాత్రం లెక్కచేయాల్సిన అవసరంలేని తృణప్రాయంగా తోచేది. అప్పుడు అమ్మ దర్శనమిచ్చి భయపడవద్దంటూ నన్ను ఓదార్చేది".

అందరూ శ్రీరామకృష్ణులకు నిజంగానే పిచ్చి ఎక్కు తోందని భావించారు. తన కుమారుడికి మానసిక రుగ్మత మళ్లీ తిరగబెట్టిందని చంద్రమణీదేవి దుఃఖించింది. ముకుందపూర్ శివాలయానికి వెళ్ళి ఈ వ్యాధిని నివారించ మని భగవంతుణ్ణి ప్రార్థిస్తూ ప్రాయోపవేశానికి కూర్చుంది. రెండు రోజులు ఉపవాసం, ప్రార్థనలు చేశాక శివుడు ఆమెకు కలలో కనిపించి ఇలా చెప్పాడు– "భయపడకు, నీ కుమారుడికి కలిగింది పిచ్చి కాదు, దివ్యశక్తి అతడిలో అపూర్వంగా జాగృతం అవటంతో అతడు ఆ స్థితిలో ఉన్నాడు."

# మథుర్ స్వీయానుభూతి

హృదయ్‌కీ, మధురనాథ్‌కూ కూడా ఆయన మానసిక స్థితి పట్ల అనుమానం కలిగింది. అందుచేత మధురనాథ్ ఆయనకు గంగాప్రసాద్ సేన్ అనే సుప్రసిద్ధ ఆయుర్వేద వైద్యుని వద్ద చికిత్స చేయించాడు. అతడి తమ్ముడు దుర్గాప్రసాద్ సేన్ కూడా వైద్యుడే. ఆయనే మొట్టమొదటి సారిగా శ్రీరామకృష్ణులు దైవోన్మాద స్థితిలో ఉన్నారని, అది మందులకు లొంగదనీ చెప్పాడు. కాని ఈ అభిప్రాయం నిజమని అందరూ అంగీకరించటానికి కొంత కాలం పట్టింది. ప్రాపంచికులు పిచ్చి లక్షణాలుగా నిర్ధారించిన శ్రీరామకృష్ణుల స్థితి అవతార పురుషులకు మాత్రమే కలిగే అత్యున్నతమైన మహాభావస్థితిగా శాస్త్ర ప్రమాణాల ఆధారంతో నిరూపించే అవకాశం ఆయన తాంత్రిక గురువైన భైరవీబ్రాహ్మణికే దక్కింది.

మొదటి పరిచయం అయినప్పటి నుండి మథుర్‌కు శ్రీరామకృష్ణుల పట్ల జనించిన అభిమానం రానురాను భక్తి గౌరవాలుగా మారిపోయింది. అందుచేత శ్రీరామకృష్ణులకు మానసిక చాంచల్యం కలుగుతోందనే భావన ఉన్నప్పటికీ అన్ని సమయాల్లోనూ మథుర్ ఆయనకు అండగా నిలిచాడు. ఒకసారి శ్రీరామకృష్ణుల విషయంలో ప్రత్యక్షంగా తనకు కలిగిన అనుభవంతో ఆ సందేహాలన్ని పటాపంచలు అయ్యాయి. ఒకరోజు దేవాలయ ప్రాంగణంలోనే ఉన్న ఆలయ యజమాని గదిలో నుండి చూస్తున్నప్పుడు, మథుర్ నాథ్‌కు ఎదురుగా కనిపిస్తున్న వసారాలో పచార్లు చేస్తూన్న శ్రీరామకృష్ణులు కనిపించారు. ఆయన ఒకవైపు నడుస్తున్న ప్పుడు జగజ్జనని గాను, రెండవ వైపు తిరిగి పచార్లు చేస్తున్నప్పుడు శివుడు గాను మథుర్‌కి కనబడటం జరిగింది. కళ్లు నులుముకుని ఎన్నిసార్లు చూసినా అలాగే కనిపించటంతో అది యథార్థమే అని అతడు అంగీకరించక తప్పలేదు. ఆ అనుభవం జాగ్రదావస్థలోనూ, అక్కడి పరిసరాలేవీ మారని స్థితిలోనూ కలగటంతో, అది దృష్టిలో కలిగిన భ్రమగా పరిగణించటానికి ఆస్కారమే లేదు.

శ్రీరామకృష్ణుల విశిష్టత్వంలో మధురనాథ్ విశ్వాసం స్థిరపరుస్తూ, మరో సంఘటన

జరిగింది. 'భగవంతుడు సృష్టి నియమాలను మార్చగలడా?' అనే విషయంలో వారిద్దరి మధ్య వాదన తల ఎత్తింది. వారిద్దరూ తోటలో వాహ్యాళి చేస్తూంటే మథుర్ ఈ విషయంగా శ్రీరామకృష్ణులను సవాలు చేశాడు. ఒక ఎఱ్ఱమందారం మొక్కను చూపిస్తూ, "భగవంతుడు తలచుకుంటే ఈ మొక్కకు తెల్లని పువ్వును పూయించగలడా?" అని అడిగాడు. శ్రీరామకృష్ణులు "అది సాధ్యమే!" అన్నారు. అదే మొక్కకు కొన్ని రోజుల తర్వాత ఒకే రెమ్మన రెండు పువ్వులు – ఒకటి ఎఱ్ఱనిది, ఒకటి తెల్లనిది పూయటంతో గురుదేవుడు విజయసూచకంగా వాటిని మథుర్‌కి చూపించారు.

శ్రీరామకృష్ణుల విషయంలో తన స్వీయ అనుభవాల వల్లా, ఆయనలో కానవచ్చే భక్తి తత్పరత వల్లా మథుర్ ఆయనకు శిష్యుడిగా మారి, ఆయనకు అన్నీ ఎల్లప్పుడూ సమయానుకూలంగా అందించటానికి సంసిద్ధుడైయ్యాడు. అలాంటి సంపన్నుడి మద్దతు, లోకజ్ఞానం గల హృదయ్ పరిచర్యలు, ప్రాపంచిక స్పృహ ఎంతమాత్రం లేకుండా భక్తి పరాకాష్ఠలో ఉన్న శ్రీరామకృష్ణులకు తమ సాధనాస్థితిలో ఆవశ్యకాలు అయ్యాయి.. కాబట్టి ఇది మథుర్ ద్వారాను, హృదయ్ ద్వారాను దైవికంగా ఏర్పాటైంది. జగజ్జనని తనకు ఏర్పాటు చేసిన 'సరఫరాదారు' ల్లో మథుర్ ప్రథముడని కాలాతరంలో శ్రీరామకృష్ణులు అన్నారు.

# భైరవీబ్రాహ్మణి రాక

దాదాపు అదే సమయంలో 1861లో శ్రీరామకృష్ణుల జీవితంలో అత్యంత ప్రాధాన్యత వహిస్తూ ఒక సంఘటన జరిగింది. అదే శ్రీరామకృష్ణుల తాంత్రిక గురువైన భైరవీ బ్రాహ్మణి రాక. ఆమె 'భైరవి' అనే పేరు సూచించినట్లుగానే సన్న్యాసిని, నడివయస్కురాలు. ఆమె పుట్టుపూర్వోత్తరాలు గురించి ఏమీ తెలియదు. దేవాలయ స్నానఘట్టం వద్ద ఆమె పడవలో నుండి దిగగానే, సమీపంలోని పూల తోటలో పూలు కోస్తున్న శ్రీరామకృష్ణులు ఆమె రాకను గుర్తించారు. మొదటి నుండి వారిద్దరి మధ్య ఆప్యాయమైన, సున్నితమైన అనుబంధం పెంపొందింది. శ్రీరామకృష్ణులను చూడగానే భైరవి ఉప్పొంగిపోయింది. దీనికి కారణం ఆమె తరువాత తెలియచేసింది. ప్రత్యేకంగా ముగ్గురు సాధకులకు ఆధ్యాత్మిక ఉపదేశం చెయ్యాలని ఆమెను జగజ్జనని ఆదేశించింది. ముగ్గురిలో ఇద్దరిని ఇంతకు ముందే తూర్పుబెంగాల్ ప్రాంతంలో కలుసుకుంది. శ్రీరామకృష్ణులలో ఆ మూడవ వ్యక్తిని గుర్తించింది. శ్రీరామకృష్ణులు ఆమెతో మాతృభావాన్ని కలిగి, తన ఆధ్యాత్మిక సాధనలను గురించి, అనుభవాలను గురించి అరమరికలు లేకుండా అంతా చెప్పేశారు. భైరవి దేవాలయ చుట్టుపట్లే ఉంటూ ప్రతిరోజూ ఆయన వద్దకు వచ్చేది. ఆధ్యాత్మిక విషయాలను ముచ్చటిస్తూ వారిద్దరూ ఎన్నో గంటలు గడిపేవారు. తాంత్రికమతంతో పాటు శాక్త, వైష్ణవ సంప్రదాయాల్లో కూడా నిష్ణాతురాలైన భైరవి, శాస్త్ర రీత్యా శ్రీరామకృష్ణుల శారీరక, మానసిక స్థితులను పరీక్షించి, తాము గొప్పగా తెలిసిన వారమనుకునే వారు నోరు వెళ్లబెట్టి ఆశ్చర్యపడేటటువంటి నిర్ణయానికి వచ్చింది. శ్రీరామకృష్ణుల శారీరక మానసిక స్థితులు మానసిక విపరీతాలు కావని, అవి అతీతమైన మహాభావ స్థితి వ్యక్తీకరణలు అని ప్రకటించింది. వైష్ణవ భక్తి శాస్త్రాల్లో 'మహాభావం' ఇలా వర్ణించబడింది. "భగవత్సంయోగం వల్ల కలిగే ఆనందం, ఆయన వియోగం వల్ల కలిగే దుఃఖంతో పోలిస్తే, అనంత కోటి విశ్వాలలో ఉండే ఆనందం, ఆ విశ్వాలన్నింటిలో ఉండే తేళ్లు పాములు కరిస్తే వచ్చే దుఃఖం, అనేవి సముద్రంలోని నీటిబొట్లు లాగా కనిపిస్తాయి. ఇలాంటి మహాభావ స్థితి అవతార

పురుషుల్లో మాత్రమే కనిపిస్తుంది గాని, అది సామాన్య మానవులలో కని పించదు.”

ఈ విధంగా ఆమె తెలియచెయ్యటంతో పిచ్చివాడుగా పరిగణింపబడుతున్న శ్రీరామకృష్ణులు ఒక్కసారిగా దివ్య అవతారస్థితికి ఎత్తబడ్డారు. మరో ముఖ్యవిషయం ఏమంటే, శరీరమంతా భరించ లేని మంటలు పుట్టటంతో శ్రీరామకృష్ణులు గంటల తరబడి నీళ్లలో మునిగి ఉండేవారు, చలువరాళ్ల మీద పొర్లాడేవారు. అప్పుడు భైరవి ఈ సమస్యకు వైష్ణవ శాస్త్రానుసారం ఒక పరిష్కారం తెలియ చేసింది – పగలంతా గంధం పూత పూసి, ఎన్నో పువ్వుల దండలు మెళ్లో వెయ్యడం. ఈ విధంగా మూడు రోజులు చెయ్యటంతో దుర్భరమైన మంట తగ్గిపోయింది. ఎంత తిన్నా తీరని విపరీతమైన ఆకలి మరో లక్షణం. ఈ సమస్యకు కూడా భైరవి చేసిన చికిత్స మొదటి దానిలా సులభమైనదే. తీపి పదార్థాలు, వివిధ రకాలైన ఇతర తినుబండారాలతో నింపిన గదిలో ఆయనను ఉంచటం. ఆయన ఏది కావాలంటే అది, ఎంత కావాలంటే అంత తినవచ్చు. ఈ మహాభోజనశాలలో మూడు రోజులు ఉండగానే ఆ బాధ తగ్గిపోయింది.

# శ్రీరామకృష్ణులను అవతారమూర్తిగా ప్రకటించటం

శాస్త్రాలతో సరిపోలుతున్న ఈ అనుభవాలను చూసి అందరూ భైరవి మాటల్ని యథార్థం అని గ్రహించారు. భైరవి తన నిర్ణయాలను నిరూపించటానికి, మథుర్ ఒక పండిత సభ ఏర్పాటు చెయ్యటానికి నిశ్చయించాడు. ఆ రోజుల్లో సుప్రసిద్ధ వైష్ణవ పండితుడైన వైష్ణవచరణ్, మరికొందరు పండితులు భైరవితో చర్చలో వాదించటానికి ఆహ్వానించబడ్డారు. శ్రీరామకృష్ణులను ఆమె వర్ణించిన విధం, ప్రత్యక్షంగా కానవస్తున్న ఆయన అతీంద్రియస్థితి –అది మహాభావస్థితి అని – దానిలోని 19 లక్షణాలు ఇతఃపూర్వం శ్రీరాధాదేవిలో, శ్రీచైతన్యునిలో మాత్రమే కనిపించాయని వైష్ణవచరణ్‌ను అంగీకరింపచేసింది. శ్రీరామకృష్ణులలో అభివ్యక్తమవుతున్న మహాభావ లక్షణాలు విస్పష్టమైనవని, ఆయన అవతారపురుషుడని, వైష్ణవచరణ్ ప్రకటించాడు. తదనంతరకాలంలో వైష్ణవచరణ్‌తో ఈ విషయంగా వాదించడానికి మథుర్ గొప్ప విద్వాంసుడు, తాంత్రిక సాధనాదక్షుడూ అయిన గౌరి పండితుణ్ణి ఆహ్వానించాడు. గౌరిపండితుడు ఇందేష్‌కు చెందినవాడు. అతడు వైష్ణవచరన్ అభిప్రాయాలు అంగీకరించటమే కాకుండా దక్షిణేశ్వరంలో ఉండి గురుదేవుడికి శిష్యుడిగా మారిపోయాడు. శ్రీరామకృష్ణుల ఆశీర్వాదం పొంది, సన్న్యసించాలని ఇల్లూ వాకిలి విడిచి వెళ్లిపోయాడు. శ్రీరామకృష్ణులు అవతారపురుషుడని అంగీకరించిన మూడవ పండితుడు బర్ద్వాన్ సంస్థాన పండితుడైన పద్మలోచన్. రాజపుత్ర స్థానానికి చెందిన నారాయణశాస్త్రి అనే పండిత సాధకుడు తదనంతర కాలంలో శ్రీరామకృష్ణుల దివ్యత్వాన్ని గుర్తించాడు. నవద్వీపంలో న్యాయశాస్త్ర అధ్యయనం పూర్తిచేసుకుని ఇంటికి మరలిపోతూ దారిలో దక్షిణేశ్వరానికి వచ్చాడు. ఆయన బహుముఖ ప్రతిభాశాలి. కాని శ్రీరామకృష్ణుల సాహచర్య ప్రభావంతో పాండిత్య తృష్ణ సమసిపోయి బ్రహ్మసాక్షాత్కారమే ఆయన జీవిత ప్రధాన లక్ష్యం అయిపోయింది. శ్రీరామకృష్ణులను శరణుజొచ్చి, సన్న్యసించి తపస్సు నిమిత్తం వశిష్ఠాశ్రమానికి వెళ్లిపోయాడు.

శ్రీరామకృష్ణుల దివ్యత్వాన్ని గురించి భైరవీ బ్రాహ్మణి చేసిన ప్రతిపాదనను సుప్రసిద్ధులైన

పండితులు, సాధకులు కూడా గుర్తించటం అనేది శ్రీరామకృష్ణ జీవితాధ్యయనంలో ఎంతో ప్రాముఖ్యత వహిస్తోంది. [జగద్విఖ్యాతి చెందిన ఆయన దివ్యత్వం, నేటి రామకృష్ణ ఉద్యమస్థాపకులైన ఆయన శిష్యులు కల్పించిన సిద్ధాంతం ఎంత మాత్రమూ కాదు.] ఈ ఉద్యమాన్ని ప్రారంభించిన ఆధునిక విద్యాధికు లైన వీరు, శ్రీరామకృష్ణులను చేరటానికి ఎంతో పూర్వమే; ఈ ఉద్యమంతో ఏమాత్రం సంబంధంలేని సనాతనులైన ప్రఖ్యాత పండిత సాధకులు, శాస్త్రీయ దృక్పథంతో ఈ సమస్యను కూలంకషంగా చర్చించి, శ్రీరామకృష్ణుల దివ్యత్వాన్ని అంగీకరించారు. విమర్శనాత్మకంగా అధ్యయనం చేసేవారు అధునాతన కాలంలో శ్రీరామకృష్ణుల ఆవశ్యాన్ని అంచనా వెయ్యడానికి ఈ పండితుల సాక్ష్యం ఎంతగానో ఉపకరిస్తుంది.

# తాంత్రిక సాధన, సిద్ధి

ఆధ్యాత్మిక దృష్టిపరంగా భైరవీబ్రాహ్మణి వచ్చిన తదనంతర కాలం శ్రీరామకృష్ణుల జీవితంలో అత్యంత ప్రధానమైనది. శ్రీరామకృష్ణులు అప్పటిదాకా ఏ సాయం లేకుండా స్వశక్తి మీదే ఆధారపడి ఆధ్యాత్మిక శిఖరాలను అందుకోవాలని ఆశించి, కొంత విజయాన్ని కూడా పొందారు. కాని సామాన్యులైన ఇతర ఆధ్యాత్మిక సాధకుల మాదిరి ఆయన జీవితం స్వీయ ప్రయోజనానికి మాత్రమే కాదు. మానవులంతా ధర్మార్థ కామ మోక్షాలనే చతుర్విధ పురుషార్థాల కోసం జీవిస్తూ ఆర్థిక సంక్షేమానికి, మోక్షానికి యత్నిస్తారు. కాని అవతారపురుషులకు అలాంటి స్వప్రయోజనాలు ఉండవు కాబట్టి వారు చేసే పనులు సరిగా అర్థం చేసుకుంటే, విశ్వవ్యాప్తమైన ప్రయోజనాన్ని కలిగి ఉంటాయి. భైరవీ బ్రాహ్మణి దర్శకత్వంలో శ్రీరామకృష్ణులు చేసిన సాధనలన్నీ అలాంటివే. స్వశక్తి మీద ఆధారంతోనే, సాధకుడు ఆధ్యాత్మిక శిఖరాలను అందుకోగలడు, అని మొట్టమొదట ఆయన నిరూపించారు. ప్రస్తుతం భైరవీ బ్రాహ్మణి, ఆమె తరువాత ఒకరి ననుసరించి మరొకరుగా వచ్చిన గురువుల సహాయంతో, శాస్త్రాల్లో నిర్దేశించిన సాధనా మార్గాలనన్నింటి యాథార్థ్యాన్ని ఆయన ఆచరించి సిద్ధి పొంది చూపించారు.

దేవీ సంప్రదాయంలోని వివిధ తాంత్రిక సాధనల్లోనూ భైరవీ నిష్ణాతురాలు. సిద్ధాంతంలో ఈ సంప్రదాయం అద్వైత్వానికి చెందిందే! కాని, అది జగత్తు మిథ్య అని కొట్టి పారవెయ్యదు. బ్రహ్మం యొక్క శక్తి వల్లే ఈ బ్రహ్మాండం ఉద్భవించింది. ఆ సాధనల ద్వారా సిద్ధి పొందడం అంటే మంచి చెడ్డలు, సౌమ్యం, భయానకాలు, సుఖ దుఃఖాలు, సౌందర్య వికారాలు, వృద్ధి క్షయాలు మొదలైన జీవితానుభవ ద్వంద్వాలన్నిటిలోనూ — దివ్యత్వాన్ని దర్శించటమే. శక్తి ఉపాసనలో నిర్దేశించిన అరవైనాలుగు తంత్రసాధనలను శ్రీరామకృష్ణుల చేత భైరవీ బ్రాహ్మణి చేయించింది.

శ్రీరామకృష్ణులు ఉత్తమ అధికారి అయిన సాధకుడు కావటంతో ఈ తంత్ర సాధనల్లోని

ప్రతీ ప్రధాన లక్షణాన్ని జపధ్యానాలతోను, బాహ్యారాధనతోను, ఆచరించి సిద్ధి పొందటానికి ఆయనకు మూడు రోజుల కన్నా ఎక్కువ పట్టలేదు. మట్టితో రెండు చోట్ల అరుగులు కట్టబడ్డాయి. వాటిలో సాధన కోసం మనిషి పుర్రెతో సహా ఐదు జంతువుల తలలు పూడ్చబడ్డాయి. ఈ సాధనల గురించి స్వామి శారదానంద ఇలా వ్రాశారు – "శ్రీరామకృష్ణులు ఇలా చెప్పారు : పగటి పూట భైరవీ బ్రాహ్మణి అనేక చోట్లకు వెళ్లి అరుదైన అనేక తంత్రసాధనా సామాగ్రిని సేకరించేది. రాత్రిపూట వాటిని బిల్వవృక్షం కింద గాని, పంచవటి వద్ద గాని ఉంచి, ఆమె నన్ను పిలిచి ఆ వస్తువులను ఎలా ఉపయోగించాలో నేర్పేది. నేను అదే ప్రకారం ఆచరించే వాణ్ణి. కాని జపమాల పట్టుకుని ఒకసారి తిప్పేలోపే సమాధి కలిగి, ఆ సాధనా ఫలితాలు వస్తూ ఉండటంతో, నేను జపం చెయ్యనక్కర్లేక పోయేది. ఆ విధంగా నాకు కలిగిన అత్యద్భుతమైన అనుభవాలకు, దృశ్యాలకు అంతే లేదు. సామాన్య సాధకులు ప్రయత్నం చెయ్యాలని మొదలుపెట్టి దారి తప్పి పతనం కూడా చెందే అతికష్టసాధ్యమైన తంత్రశాస్త్ర నిర్దిష్టమైన అరవైనాలుగు తంత్రసాధనలను ఒక్కొక్కటిగా నాచేత చేయించింది."

రెండు చేతులు మొదలుకుని, పది చేతులు వరకు గల లెక్కలేనన్ని దేవ, దేవీ దర్శనాలు శ్రీరామకృష్ణులకు కలిగాయి. ఆ దేవతల్లో కొందరు, ఆయనతో ముఖాముఖీ మాట్లాడి అనేక విషయాలు బోధించారు. ఆయనకు దర్శన మిచ్చిన అమ్మవారి రూపాలన్నీ అత్యంత సౌందర్యంగా ఉన్నా అవి 'షోడశి' అని చెప్పబడే రాజరాజేశ్వరీదేవి సౌందర్యంతో పోల్చడానికి తగినవి కావు, అని శ్రీరామకృష్ణులు అనేవారు. ఆ దేవిని వర్ణిస్తూ శ్రీరామకృష్ణులు, "నాకొక దృశ్యంలో 'షోడశి' దర్శనమిచ్చింది. ఆమె సౌందర్యం ద్రవించి అన్ని వైపులా వ్యాపించి దిక్కులన్నింటిని ప్రకాశవంతం గావించింది." భైరవుడు ఆదిగా గల పురుషాకృతి గల దేవతలు కూడా ఆయనకు దర్శనమిచ్చారు. అంతే లేని అనాహత ప్రణవనాదాన్ని ఆయన విని దాని వల్ల జంతువుల ధ్వనులతో సహా అన్ని శబ్దాల్లో ఉన్న అర్థాన్ని గ్రహించారు.

తన శరీరాన్ని, మనస్సును, హృదయాన్ని జగజ్జననికి సంపూర్ణంగా అర్పించి తనకు

బాహ్య అంతరాలలో జ్ఞానాగ్ని ఆవరించినట్లుగా కనుగొన్నారు. సుషుమ్నా మార్గం గుండా కుండలినీ శక్తి జాగృతమై ఊర్ధ్వముఖంగా పయనిస్తున్నట్లు గుర్తించారు. ఆ శక్తి, పద్మాల వంటి చక్రాల ద్వారా మూలాధారం నుండి సహస్రారం వరకు వ్యాపిస్తూంటే, సహస్రారం వికసించటం వల్ల, అక్కడ ఉన్నత స్థితుల్లో ఉన్న దివ్యపురుషుల అద్భుతానుభవాలు తాను పొందే అవకాశం కలిగింది. సుషుమ్నా ద్వారం తెరవబడ్డప్పటి నుండి, ఆయన స్వభావం ఒక పసిపిల్లవాడి స్వభావంలాగా మారిపోయింది. శరీరస్మృతి లేకపోతుండటంతో ఆయన ఎంత ప్రయత్నించినా వస్త్రాలు శరీరం మీద నిలిచేవి కావు. ద్వంద్వాతీత స్థితి ఆయనలో ఎంత వృద్ధి చెందిందంటే, పవిత్రతకు, అపవిత్రతకు మధ్య ఉన్న తేడా నశించి తులసి దళాలు, మునగ ఆకులు కూడా ఒకే రకంగా పవిత్రంగా కనిపించాయి. శరీర సౌందర్యం పెరిగి పోవటంతో అందరి దృష్టి ఆయనపై కేంద్రీకృతమై ఉండేది. జగజ్జననిని ఎంతో ప్రార్థించిన తరువాత, ఆ సౌందర్యమంతా (అంతర్గతం అయింది) లోపలికి వెళ్లిపోయింది. పతిత స్త్రీలో గానీ, పవిత్ర స్త్రీలో గానీ జగజ్జననియే ఉన్నట్లుగా ఆయనుకు అనుభూత మైయ్యింది. అష్టసిద్ధులు ఆయనకు కలిగాయి. కాని జగజ్జనని వాటిని నీచమైన అశుద్ధంగా చూపించటంతో ఆయన వాటిని అసహ్యంతో తిరస్కరించారు.

శాక్తసిద్ధాంత సాధనా విధానాలు, సాధకుని సౌమ్యస్థితి, నిబ్బరత, హెచ్చు తగ్గులలోను, ఉచ్ఛనీచాల్లోను దివ్యత్వాన్ని దర్శించటానికి తీవ్రపరీక్షకు గురిచేస్తాయి. శ్రీరామకృష్ణుల జీవితంలో స్వామి శారదానంద వర్ణించిన కొన్ని విషయాలను ఇక్కడ చూద్దాం–

అమ్మవారు కొన్నిసార్లు నక్క రూపాన్ని ధరిస్తుందని, కుక్కలు భైరవుని వాహనాలవుతాయని ఆయనకు ఉపదేశింప బడటంతో, శ్రీరామకృష్ణులు కుక్కలు తిన్న ఎంగిలి మెతుకులను పవిత్రమైన ప్రసాదంలాగా స్వీకరించారు.

తన సాధనలో వివిధ సమయాల్లో తనకు కలిగిన అనుభవాలను వర్ణిస్తూ శ్రీరామకృష్ణులు ఇలా చెప్పారు : “ఒకసారి భైరవి రాత్రిపూట ఎక్కడ నుండి వెంటబెట్టుకు వచ్చిందో తెలియదు,

ఒక అందమైన యువతిని తీసుకొచ్చి నాతో 'నాయనా, ఈమెను దేవిలా ఆరాధించు' అంది. పూజ పూర్తి కాగానే ఆమె నాతో 'ఆమె ఒడిలో కూర్చుని జపం చెయ్యి' అంది. నాకు భయం వేసింది. దీనంగా ఏడ్చాను. 'నిన్ను పూర్తిగా శరణుజొచ్చిన నాకు ఇదేమి ఆజ్ఞ తల్లీ, ఇలా అమర్యాదగా ప్రవర్తించే శక్తి నీ బిడ్డకు ఉందా అమ్మా!' అన్నాను. నేనిలా చెబుతూండగానే నాకు తెలియని శక్తి ఏదో నన్ను ఆవహించి, ఒక గొప్పబలం నాలో ప్రవేశించి నట్లు తోచింది. అందుచేత మంత్రాన్ని జపిస్తూ మంత్ర ముగ్ధుడిలాగా నేనేమి చేస్తున్నానో తెలియకుండానే ఆమె ఒడిలో కూర్చుని సమాధిమగ్నుడిని అయ్యాను."

మరొకసారి ఒకచేపను పుర్రెలో ఉడికించి తర్పణం చేసింది. నాచేత కూడా అలాగే చేయించింది. ఆ చేపను నన్ను తినమంది. అలాగే చేశాను. అయితే నాకేమీ ఏవగింపు కలుగలేదు. కాని భైరవి మరోరోజు కుళ్లిన మనిషిమాంసాన్ని తెచ్చి తర్పణం అయ్యాక నాలుకతో దాన్ని తాకమంది. నాకు అసహ్యం వేసి "అలా చెయ్యవచ్చా?" అన్నాను ఆమెతో. ఆమె వెంటనే "నాయనా, దాన్లో ఏముంది? చూడు నేనెలా చేస్తానో" అంటూ ఒక ముక్క నోట్లో వేసుకుని "అసహ్యమనేది ఉండకూడదు" అని నా ముందొక ముక్క పెట్టింది. ఆమె అలా చెయ్యడం చూడగానే నా మనస్సులో భీకరరూపిణి అయిన చండికా భావన కలిగి అమ్మా, అమ్మా అంటూ భావ సమాధి పొందాను. అప్పుడు భైరవి దాన్ని నా నోట్లో పెట్టినా కూడా నాకు అసహ్యం వెయ్యలేదు.

భైరవీ బ్రాహ్మణి నన్ను పూర్ణాభిషిక్తుణ్ణి చేసి లెక్కలేనన్ని తాంత్రిక సాధనలు నిత్యమూ నా చేత చేయించింది. ఆ వివరాలన్నీ నాకు జ్ఞాపకం లేవు. కాని ఒక విషయం మాత్రం జ్ఞాపకం ఉంది. ఒక ప్రేమికుల జంట పరమా నందాన్ని అనుభవించటం తల్లి అనుగ్రహంతో ఒకరోజు ప్రశాంత చిత్తంతో తిలకించాను. దాన్లో దివ్య క్రీడ కంటె వేరుగా నాకేమీ కనిపించలేదు. మానవులకు కలిగే భావాల దాపుకు కూడ నా మనస్సు దిగజారక పైపైకి లేచి చివరకు సమాధిలో లీనం అయిపోయింది. మామూలు స్థితికి రాగానే "అత్యంత కష్టసాధ్యమైన తాంత్రిక

సాధనలో నువ్వు సిద్ధి పొంది దివ్యస్థితిలో నిలిచిపోయావు. వీర సాధనలో ఇది తొలిమెట్టు" అని బ్రాహ్మణి చెప్పింది.

ఉపనిషత్తు "ఈశావాస్య మిదం సర్వం." అంటుంది. అంటే సర్వం భగవంతుడిచే వ్యాప్తం అయింది. శక్తి ఉపాసకుడు తు.చ. తప్పకుండా దీన్ని సాధించితీరాలి. మన అజ్ఞాన దృష్టిలో ఇంద్రియార్థాలను మనం ఆత్మరక్షణకు సుఖానికి అనువైన దృష్టితో చూస్తూ, ఉత్తమమైనవి, లేక నీచమైనవి, ఆకర్షణీయమైనవి లేక ఏవగింపు కలిగించేవి, సంతోషకరమైనవి లేక భయానక మైనవి అనే ముద్ర వాటమీద వేస్తాం. కాని శ్రీరామకృష్ణులు ఈ సాధనలు చెయ్యటం ద్వారా పరిపూర్ణమైన దివ్యస్థితికి ఎదిగిపోయారు. ఆ స్థితిలో ప్రతిదీ ఒక ప్రతీక అవుతుంది. ద్వంద్వాలతోను – వైవిధ్యాల తోను కూడిన ఈ జగజ్జాలం ఏ దివ్యశక్తితో రూపొందిందో ఆ దివ్యత్వం నిరంతరం, అన్ని విషయాలలోనూ ప్రదర్శిత మవుతుంది.

ఈ దృక్పథంతో విషయాలను దర్శించటానికి భైరవీ బ్రాహ్మణి రాకపూర్వమే శ్రీరామకృష్ణులు కొన్ని సాధనలు చేశారు. ఉచ్ఛ, నీచ అనే భావాలకు అతీతమవడానికి ఆయన అస్పృశ్యుల మరుగుదొడ్లను ఊడ్చి, బిచ్చగాళ్ల ఎంగిళ్లు తిన్నారు. ధన కాంక్షను జయించటానికి ఒక చేతిలో ఒక నాణాన్ని, రెండవ చేతిలో ఒక మట్టిపెళ్లను తీసుకుని, భగవత్సాక్షాత్కార విషయంలో ఈ రెండూ ఒకటేనని వివేచిస్తూ దానికి గుర్తుగా రెంటినీ గంగలో విసిరివేశాడు. ఆ అభ్యాసంతో దాచుకున్న వాటిని త్యాగం చెయ్యటం ఆయన నరనరాల్లో జీర్ణించుకుపోయింది. ఆయన డబ్బును తాకితే ఏదో కుట్టినంత బాధ అనుభవించేవారు. మధుర్, లక్ష్మీనారాయణ వంటి భక్తులు ఆయన వ్యక్తిగత ఖర్చుల నిమిత్తం మాన్యం ఏర్పాటు చేస్తామన్నప్పుడు ఆయన తల మీద దెబ్బలు కొట్టినంత బాధపడటమే గాక తీవ్రమైన మందలింపుతో ఆయన ఆ ధనాన్ని తిరస్కరించారు. కామాన్ని జయించటానికి ప్రతీకగా స్త్రీలందరిలోనూ – పతివ్రతలైనా, పతితలైనా సరే జగజ్జననిని గాంచే స్వభావం ఆయనలో పెంపొందింది. ఈ అనుభవాన్ని ఆయన తన అర్ధాంగినే పూజాపీఠం మీద ఆసీనురాలిని చేసి ఆరాధించి తన సర్వస్వాన్ని ఆమె

పాదారవిందాల చెంత అర్పించటం ద్వారా నిరూపించారు. ఈ సంగతి ముందు ముందు వివరంగా చూద్దాం.

# సాధనలోని అసామాన్య ప్రత్యేకతలు

సామాన్య సాధకులకూ శ్రీరామకృష్ణులకూ ఉన్న గొప్ప వ్యత్యాసం ఆయన వివిధ మత, శాఖల సంప్రదాయాలను సమధికోత్సాహ వ్యామోహంతో ఆచరించటంలోనే ఉంది. సామాన్యంగా సాధువులుగా పరిగణింపబడే వారంతా ఏదో ఒక్క సంపద్రాయాన్ని అనుసరించి దానితో సిద్ధిపొందిన వారే! కాని శ్రీరామకృష్ణులు అవతార పురుషుడవటంతో, ఇతరుల నిమిత్తమే ఆయన జీవించటం వల్ల సామాన్యుల నియమం వారికి అనువర్తించదు. ఈ కారణంగానే ఆయన సాధనలో మూడు అతి ప్రత్యేక విలక్షణాలు పరిశీలింప బడతాయి. ఒక సాధనా సంప్రదాయం నుండి మరొకదాన్ని అనుసరించాలనే ఆయన ఆతురత మొదటిది. తనను గురించి ముచ్చటిస్తూ శ్రీరామకృష్ణులు ఆధ్యాత్మిక ప్రపంచంలో తానొక తిండిపోతునని చెప్పుకున్నారు. వంటకాన్ని కలగలిపి, తరిగి, వేయించి నానారకాలుగా వండితే తినటానికి ఇష్టపడతారు, కాని ఒకేరకమైన వంటకాన్ని తినటానికి ఇష్టం చూపించరు. అందువల్ల ఆయన మానవాళికి అందుబాటులో ఉన్న మార్గాలన్నింటి ద్వారా భగవంతుణ్ణి దర్శించాలని తపించి ఒకే దైవాన్ని అన్ని విధానాల ద్వారా ప్రత్యక్షం చేసుకొన్నారు. సాక్షాత్కారం పొందటంలో కనబరచిన అత్యంత వేగం (తీవ్ర వ్యాకులత) ఆయనలోని రెండవ అతి ప్రత్యేక విలక్షణత. సామాన్యుడు సిద్ధిపొందటానికి అనేక జన్మలు పట్టే ఏ సాధన అయినా సరే ఆయన విషయంలో మూడు రోజులకన్నా పట్టేదికాదు!

దేవిని సాక్షాత్కరించుకోకుండా జీవించటం కంటె మరణమే మేలనే తీవ్రమైన ఆవేదనా పటిమతో, కాళికాలయంలోనే సమాధి కలగటం, ఆ సమాధిలో సర్వోత్కృష్టమైన అనుభూతి ఆయనకు జనించటం మూడవ కారణం. ఈ తీవ్రత అనేది మొదటి కారణానికి అనుగుణ్యమైనదే! శాస్త్ర ప్రతిపాదితమైన ఇతర మార్గాల్లో కూడ సత్యం ఉందని నిరూపించటానికే భైరవీ బ్రాహ్మణి వద్దా, తదుపరి వచ్చిన గురువుల వద్దా ఆయన సాధనలు గావించారు. 'గుమ్మడి మొదలైన మొక్కల్లో ముందు పిందె వచ్చి తర్వాత పువ్వులు వికసించినట్లు అవతారపురుషుల

విషయంలో సాధనకు ముందే సిద్ధి కలుగుతుంది' అనే ఉపదేశం చేసి స్వకీయ జీవితంలోనే శ్రీరామకృష్ణులు తేటతెల్లం చేశారు. అప్పటివరకు ఉన్న తన స్వభావానికి పూర్తిగా వ్యతిరేకమైన దృక్పథాన్ని చాలా సులువుగా అలవరచుకోవటం ఆయన సాధనలో కొట్టొచ్చినట్లు కనిపించే మరో విశేషం. సాధారణంగా ఒక విధానానికి అలవడ్డ మనస్తత్వాన్ని సహజంగా వదలివెయ్యటం చాలా కష్టం. కాని శ్రీరామకృష్ణుల జీవితాన్ని అధ్యయనం చేస్తు న్నప్పుడు, ఆయన దేవీ సాకారోపాసన నుండి, సాకారాన్ని నిరసించే అద్వైత సాధనకు; హిందూమతంలోని విగ్రహారాధనలో నుండి విగ్రహాలను ధ్వంసం చేసే ఇస్లాం సాధనకు; హిందూమతంలోని సర్వవ్యాపకత్వంలో నుండి పిడివాద క్రైస్తవ సాధనకు; ఏ విధంగా మారుతూ వచ్చారో తెలుస్తుంది. ఆయన మనస్సు అసాధారణమైనందు వల్లే ఇది ఆయనకు సాధ్యపడిందనే సంగతి ''భావముఖ' మనే భావనా విషయాన్ని వర్ణించినప్పుడు తెలుస్తుంది.

# వాత్సల్యభావ సాధన

గురుదేవులు ఆధ్యాత్మిక ప్రజ్ఞ వికాసం చెందటంలో తమ తమ పాత్రలు నిర్వహించడానికి భైరవీ బ్రాహ్మణి తరువాత ఆధ్యాత్మిక రీతుల్లో ఆరితేరిన గురువులు ఒకరి తర్వాత ఒకరు దక్షిణేశ్వరానికి వచ్చారు. ఇది భగవంతుని ఆదేశమే అనిపిస్తుంది. వారిలో మొదటి వ్యక్తి జటాధారి. ఇతడు వైష్ణవ సన్న్యాసి, శ్రీరామభక్తుడు. శ్రీరామకృష్ణుల ఇలవేల్పు, జటాధారి ఆదర్శం కూడా రాముడే కావటంతో వారి మధ్య అనురాగం ఏర్పడింది. అంతేగాక మొదటిరోజుల్లోనే శ్రీరామకృష్ణులు రామభక్తుడైన హనుమంతుడి వేషం ధరించి రామభక్తిని సిద్ధించుకున్నారు. హనుమంతుడిలా దివ్య భావాన్ని పూని మామూలు జాగ్రదావస్థలోనే, తన చుట్టూ ఉన్న సాధారణ పరిసరాల్లోనే ఆయన సీతా దేవిని దర్శించారు. ఆ సీతాదేవి రూపం ఆయనలో లీనమై పోయింది. ఈ వైష్ణవ సంస్కారాలతో ప్రేరేపింపబడి ఆయన సాధువైన జటాధారితో సాహచర్యం ఏర్పరచుకుని, ఆయన భక్తితత్పరతలోని రహస్యాన్ని తెలుసుకున్నారు. జటాధారి ఒక చిన్న 'రామలాలా' విగ్రహాన్ని దగ్గర ఉంచుకొని ఆ సేవలోనే కాలమంతా గడిపేవాడు. బాలరాముడు అతడికి కనిపించటం, అతని వెంటబడటం, అతని చుట్టూ తిరుగుతూ ఆడుకోవటం అతనికి అనుభవమయ్యేవి. శ్రీరామకృష్ణులకి సాధువుతో సాహచర్యం అధికరించే కొద్దీ రామలాలాకు కూడా శ్రీరామకృష్ణులతో సాన్నిహిత్యం వృద్ధి చెందింది.

తరచు రామలాలా, సాధువును విడిచి శ్రీరామకృష్ణుల వెంట వెళుతూ అనుబంధాన్ని పెంచుకున్నాడు. అనతి కాలంలోనే నివేదన చెయ్యవలసి వచ్చినప్పుడు, సాధువు రామలాలాను పిలవటానికి శ్రీరామకృష్ణుల వద్దకు రావలసిన పరిస్థితి ఏర్పడింది. గురుదేవుల సాహచర్యంలో జటాధారికి సాధనా సిద్ధి ఏర్పడి, అన్ని జీవరాసుల్లోను రామలాలా దర్శనం కలిగి, విగ్రహాల్లోనే భగవంతుణ్ణి అర్చించవలసిన అవసరం లేకపోయింది. ప్రతిదాన్లోను రాముడి సజీవ ఉనికిని గ్రహించినవాడై సాధువు రామలాలా విగ్రహాన్ని శ్రీరామకృష్ణులకే సమర్పించి, సెలవు తీసుకున్నాడు. భగవంతుణ్ణి స్వంత బిడ్డలా చూసుకునే వాత్సల్య భావంలో శ్రీరామకృష్ణులకు సిద్ధి

కలగటం రామలాలా ఉదంతం స్పష్టీకరిస్తుంది.

# మధురభావ సాధన

గోపికలు బృందావన కృష్ణుణ్ణి చూసినట్లు భగవంతుణ్ణి ప్రియుడిగా దర్శించే సాధనను మధురభావం అంటారు. శ్రీరామకృష్ణులు చేసిన ఈ సాధనకు వద్దాం. బాల్యంలోనే ఆయన ఆ భావాన్ని రుచి చూశారు. కృష్ణుడి రాకకై వేచి వుండే బాలవితంతువులాగా తానుంటే బాగుండేదని ఆయన భావించేవారు. జన్మతః మొలకెత్తి ఉండటం వల్ల ఇప్పుడు ఈ భావాన్ని, పూర్వకాలపు బృందావన గోపికలు జగత్ప్రభువైన కృష్ణుణ్ణి ప్రియుడిగాను, భర్తగాను భావించినట్టి భావాన్ని ఇటీవలి కాలంలో గౌరాంగుడు అనుసరించిన ఇదే భావాన్ని, శ్రీరామకృష్ణులు ప్రస్తుతం పరిపూర్ణంగా సాధించటానికి ప్రారంభించారు. ఈ మధురభావ సిద్ధాంతం ప్రకారం కృష్ణుడే పరమ పురుషుడు. జీవులంతా ప్రేమ బంధనలో ఆయనకు కట్టుబడి ఉంటారు. వీరందరికి ప్రతినిధి రాధ. రాధ, కృష్ణుడి అంతర్గతమైన స్వరూపశక్తి. ప్రేమ అనేది ఏ భావాన్నైనా స్వీకరించవచ్చు. అది దాస్య భావం కావచ్చు (ప్రభువుకు దాసుడికి ఉన్న సంబంధం), అపత్యభావం (బిడ్డకు తల్లికి లేక తండ్రికి ఉన్న సంబంధం) కావచ్చు. సఖ్యభావం (స్నేహం) కావచ్చు. లేక మధురభావం (భార్యాభర్తల మధ్య ఉన్న సంబంధం) కావచ్చు. ఈ భావాలన్నీ భక్తుణ్ణి భగవంతుని వద్దకు చేర్చే శక్తిగలవి. అయినప్పటికీ మధురభావం ఆధ్యాత్మిక ప్రేమయొక్క పరాకాష్ఠ. దీన్లో అన్ని రకాల ప్రేమ బంధాలు మరింత సన్నిహితమైనవిగా కనిపిస్తాయి. వెలయాలు స్త్రీకి తన విటుని మీద ఉన్న (కేవలం కామసంబంధమైన) ప్రేమ లాంటి భావం భగవంతుని పట్ల ఏర్పడితే, అది ప్రేమకు పరాకాష్ఠ. ఈ ప్రేమ భావనలో భక్తుడు సహజపరమైన గౌరవాన్ని, పదవిని, మర్యాదను, సంపదను, కుటుంబ బాంధవ్యాలను, తనకు సంబంధించిన సమస్త విషయాలను పూర్తిగా త్యజించి భగవంతుడికి పరిపూర్ణంగా శరణాగతుడు అవుతాడు. రూపుదాల్చిన ఈ భావమే కృష్ణుడి స్వరూపశక్తి అయిన రాధ, ఆమె అనుగ్రహం వల్ల జీవుడు ఆ ప్రేమను లవలేశమైనా చూరగొనగలుగుతాడు.

అందువల్ల శ్రీరామకృష్ణులు మొట్టమొదట రాధను గురించి ధ్యానం చేశారు. రాధ

సాకారంగా దర్శనమిచ్చి ఆయనలో లీనమైపోయింది. అప్పటి నుండి ఆయన మనస్సులో తాను కృష్ణుడి చెలికత్తెననే భావన చేస్తూ ఉండటంతో ఆయన స్వభావం స్త్రీ స్వభావంలోకి మారి పోయింది. ఈ భావనను శరీరానికి కూడా వర్తింపచేశారు. దానికై ఆయన చీరలు కట్టుకుని, రవికెలు ధరించి మథురనాథ్ ఇచ్చిన నగలు కూడా వేసుకొన్నారు. అంతేగాక మథుర్ ఇంట్లోని స్త్రీల మధ్య ఎక్కువ కాలం గడిపేవాడు. ఆయన స్త్రీ స్వభావం ఎంత సహజమైనదంటే, ఆయనగాని, ఆ స్త్రీలుగాని అరమరికలు లేకుండా మసలుకోగలిగారు. రాధాదేవి దర్శనం అయ్యాక ఆయన వ్యక్తిత్వం ఆమెతో తాదాత్మ్యం చెంది, ఆయన మనస్సు కృష్ణుడి దర్శనానికై ఆరాటపడసాగింది. రాధాదేవిలోను, గౌరాంగుడిలోను కనిపించే మధురభావంలోని పందొమ్మిది మధురభావ విరహలక్షణాలు ఆయనలో అగపడి, వైష్ణవాచార్యుడైన వైష్ణవ చరణ్‌కి, భైరవీ బ్రాహ్మణికి ఆశ్చర్యం కలిగించాయి. ఎంతో ఉత్తమ సాధకుల్లో కూడా ఒకటి రెండు కంటె ఆ లక్షణాలు కానరావు. రాత్రి ఎలా గడిచిందో, పగలు ఎలా గడిచిందో కూడ తెలియకుండా, శ్రీరామకృష్ణులు ఎడతెరపి లేకుండా ప్రార్థించారు. ప్రాణధారణకు అవసరమైన ఆహారపానీయాలు గాని, నిద్రను గాని లెక్కించక ప్రియుని కోసం ఆయన పడే విరహవేదన ధారలుగా కన్నీళ్ల రూపం లోనూ, వ్యాకులతలోనూ అభివ్యక్తమైంది. ఆహ్లాదకరమైన ఆ విరహ బాధలో... ఒకసారి ఆత్మకు సమాగమం వల్ల కలిగే అత్యంతానందం, ఎడబాటువల్ల కలిగే విపరీత వేదన, హృదయాన్ని కలతపెట్టి మనస్సును బీభత్సపరచి శరీరాన్ని ఇంద్రియాల్ని చిందరవందర చేస్తుంది. అలాంటి విరహ వేదనా స్థితిని శ్రీరామకృష్ణులు అనుభవించారు. ఆ మానసికస్థితి శరీరంలో దుర్భర పరిస్థితులను కూడా కలిగిస్తుంది. శరీరంలో భరించలేని మంటలు పుట్టి రోమకూపాల్లో నుండి చిన్న చిన్న రక్తబిందువులు కూడా వస్తాయి. నరాలు పట్టు తప్పి కీళ్లు తొలగినట్లు ఉంటాయి. ఇంద్రియాలు పని చెయ్యటం మానేస్తాయి. కొన్నిసార్లు శరీరం శవంలాగా పడివుంటుంది. అనేక నెలలు మధుర భావంలో రాధా తాదాత్మ్యంలో గడిచాక, సచ్చిదానంద ఘనీభవ సారమైన కృష్ణుడి దర్శనం ఆయనకు కలిగింది. కృష్ణచైతన్యంతో వివశులైనారు. తానే కృష్ణుడననే భావాన్ని పొంది, సర్వజీవులు కృష్ణుడిచే పరివ్యాప్తమైనట్లు అనుభవాన్ని పొందాడు. కాలాంతరంలో ఈ అనుభవాన్ని ప్రస్తావిస్తూ, రాధాదేవి మేనిచ్ఛాయ

నాగకేసరాల పుప్పొడిలాగా ప్రకాశ మానమైన పసుపుపచ్చగా ఉంటుందని, కృష్ణుడి మేనిచ్ఛాయ తాను నడిచేటప్పుడు దారిలో కనిపించిన గడ్డిపువ్వు రంగులో ఉంటుందని ఆయన వర్ణించారు. ఈ సాధనాభావాన్ని ఆయనకు కలిగిన ఒక అద్భుత అనుభవంతో ముగిద్దాం. ఒకరోజు భాగవత శ్రవణం చేస్తున్నప్పుడు శ్రీరామకృష్ణులు సమాధిమగ్నులయ్యారు. దాన్లో దేదీప్యమానమైన కృష్ణుడి దర్శనమై కృష్ణుడి పాదాల నుండి ఒక కాంతిపుంజం బైటికి వచ్చి, కృష్ణుణ్ణి, తనను, భాగవత గ్రంథాన్ని కలుపుతూ, 'భాగవతం, భక్తుడు, భగవంతుడు అనేవి ఒకదాన్లోనే మూడు ఉన్నాయి. మూడింటిలోను ఒకటే ఉంది' అనే శ్రీరామకృష్ణుల ఉపదేశాన్ని ఋజువు చేసింది.

# తోతాపురివద్ద అద్వైత సాధన

శ్రీరామకృష్ణులు మధురభావ సాధన ముగించిన మూడు నాలుగు నెలల పిమ్మట 1863వ సంవత్సరాంతంలో ఆయన జీవితంలో ప్రముఖపాత్ర వహించిన మరొక మహనీయుడు దక్షిణేశ్వరం వచ్చాడు. ఆయన నాగ సంప్రదాయానికి చెందిన సన్న్యాసి తోతాపురి. అద్వైతంలో ఆరితేరినవాడు. శరీర స్పృహను జయించాడనే దానికి సూచనగా ఆయన దిగంబరుడుగానే సంచరించేవాడు. గురుదేవుడు ఆయన్ను 'నాంగ్టా' (దిగంబరుడు) అనేవారు. ఆయన నర్మదానదీ తీరంలో నలభై సంవత్సరాలు అద్వైత సాధన చేసి నిర్వికల్ప సమాధిస్థితి పొందారని చెబుతారు. అప్పటి నుండి ఆరుబయటే నివసిస్తూ, ఎక్కడా మూడు రోజుల కంటె ఎక్కువ కాలం గడప కుండా సంచరించటం ఆయనకు రివాజు. రాణి రాస్మణి దేవాలయం సాధువులకు చక్కని వసతులు కల్పించటంతో తోతాపురి కూడా గంగాసాగర్ నుండి తిరుగుప్రయాణంలో అక్కడ మజిలీ చేశాడు. అనతికాలంలోనే శ్రీరామకృష్ణులకు ఆయనతో పరిచయం ఏర్పడింది. తోతాపురి కూడా శ్రీరామకృష్ణులను ఉత్తమాధికారిగా గుర్తించి తాను ప్రాప్తించుకున్న ఆధ్యాత్మిక సిద్ధి ఆయనకు అందించాలనుకున్నాడు. శ్రీరామకృష్ణుల జీవితంతో పెనవేసుకుపోయిన జగజ్జననికి అంటే సాకార దైవానికి తోతాపురి బోధించే అద్వైతంలో స్థానం లేదు. ఈ సందర్భంలో తోతాపురి వైఖరిని తెలిపే ఒక సంఘటన జరిగింది. ఒకరోజు తోతాపురి సమక్షంలో శ్రీరామకృష్ణులు ఉండగా, ఆయన యథాప్రకారం సాయంత్రం కాగానే చప్పట్లు చరుస్తూ జగజ్జనని నామాన్ని ఉచ్చరించసాగారు. ఈ రీతి భక్తి విధానాలు నచ్చని తోతాపురి "ఏం, చపాతీలు చేస్తున్నావా?" అని వ్యంగ్యంగా అన్నాడు. అంతే కాకుండా శ్రీరామకృష్ణులకు సన్న్యాసం ఇప్పించి అద్వైతాన్ని బోధిస్తా నన్నాడు. తన తల్లి అనుమతి ఇస్తే ఈ ప్రతిపాదనకు తను అంగీకరిస్తానన్నారు శ్రీరామకృష్ణులు. తోతాపురి తల్లి అంటే జన్మనిచ్చిన తల్లిగా భావించి తన రంధ్రాన్వేషణ స్వభావాన్ని అణచుకుంటూ, ఆ అనుమతి త్వరగా పొంది రమ్మన్నాడు. శ్రీరామకృష్ణులు ఆలయంలోని జగజ్జనని వద్దకెళ్ళి భావావేశంలో తనకు సరైన తోవ చూపమని

ప్రార్థించారు. వెంటనే జగజ్జనని "ఆయన వద్ద ఉపదేశం పొందు. ఆ కార్యార్థమే తోతాపురి ఇక్కడకు రావించబడ్డాడు" అంటూ ఆదేశాన్ని ఇచ్చింది. ఆ ప్రకారంగానే ఉపదేశానికి ముహూర్తం నిర్ణయం అయింది. దేవాలయ ఆవరణలోనే బిల్వవృక్షం నీడలోని కుటీరంలో ఉపదేశతతంగం జరిగింది. సన్న్యాసదీక్ష అయ్యాక తోతాపురి అద్వైత వేదాంతం బోధించాడు. "బ్రహ్మసత్యం జగన్మిథ్య జీవోబ్రహ్మైవనాపర" 'ఈ జగత్తు అజ్ఞానం వల్ల కల్పితమైందని వస్తుత లేనిదని, జీవుడు తత్వతః బ్రహ్మమే' అనేది అద్వైత సారం. ఈ విధానంలో సాధన చెయ్యమని మనస్సును నిర్వికారమైన ఆత్మజ్ఞాన స్థితికి మళ్ళించమని నాంగ్టా శ్రీరామకృష్ణులకు బోధించాడు. శ్రీరామకృష్ణులు అలా చెయ్యటానికి ప్రయత్నిం చగానే జగజ్జనని ఆయన ముందు సాక్షాత్కరించేది. తోతాపురి నిర్బంధంతో ఆయన భ్రూమధ్యంలో కనుబొమల మధ్య దృష్టిని నిలిపి జగజ్జనని రూపం కనిపించగానే, జ్ఞానాన్ని కత్తిగా భావించి దానితో ఆ రూపాన్ని ఖండించి, మనస్సును ఆ విధంగా శుద్ధచైతన్యంలో లీనం చేశారు. తదుపరి ఆయన మనస్సు అద్వైత సాధనలోని అత్యున్నత శిఖరమైన నిర్వికల్ప సమాధిస్థితిని పొందింది. ఆ శిఖరాగ్ర చైతన్య స్థితిలో ఆయన మూడురోజులు ఉండి పోయారు. తనకు అనితర సాధ్యంగా దీర్ఘకాల సాధన వల్ల లభించిన ఆ నిర్వికల్ప సమాధి స్థితిని తన శిష్యుడు అవలీలగా, అంత త్వరగా పొందటం తోతాపురిని దిగ్భ్రాంతుణ్ణి చేసింది.

శ్రీరామకృష్ణులకు బోధించటానికి వచ్చిన వాళ్ళందరకీ ఆయన సాహచర్యంలో వారికి రావలసిన ఆయా ప్రతిఫలం ముట్టింది. అది వారివారి సాధనలో మిగిలిన లోటు పరిపూర్ణత్వం చెందటమే! శ్రీరామకృష్ణుల సాహచర్యంలో జటాధారి తన ఇష్టదైవమైన రామలాలా విగ్రహంలో మాత్రమే కాకుండా విశ్వమంతటా వ్యాప్తిచెందిన విశ్వేశ్వరుడుగా సాక్షాత్కరించుకున్నాడు. అలాగే భైరవీ బ్రాహ్మణి కూడా శ్రీరామకృష్ణుల సాంగత్యంలో తన జ్ఞానానికి పరిపూర్ణత సంతరించుకుంది. ఇక తోతాపురి విషయంలో ఒక అద్భుత సంఘటనతో అతనిలో పరివర్తన వచ్చింది. తోతాపురికి సాకారదైవం అంటే చులకన భావన ఉండేది. ఆయన వేదాంతులు చెప్పే నిరాకార బ్రహ్మన్నే అంగీకరించి, సృష్టి స్థితి లయ కారణమై భక్తులను అనుగ్రహించే

సాకారదైవాన్ని, ద్వంద్వ ప్రపంచం ఏ విధంగా భ్రాంతి జన్యమైనదో, అదే విధమైన ఊహాకవిత్వమని భావించాడు. కుదురుపాటు లేని అతివాద అద్వైత దృఢవిశ్వాసం శ్రీరామకృష్ణుల సాంగత్యంలో సరిదిద్దబడింది. అది ఇలా జరిగింది : సహజంగా బసచేసే మూడు రోజులే కాక తోతాపురి దక్షిణేశ్వరంలో కొన్ని నెలలున్నాడు. ఆ కాలంలో అతిసారవ్యాధికి గురైయ్యాడు. మందులు పనిచెయ్యలేదు. ఆ దుర్భరబాధకు తోతాపురి లాంటి స్థితప్రజ్ఞుడు కూడా శరీరబాధను విస్మరించి బ్రహ్మంలో నిమగ్నుడవలేక పోయాడు. అందుచేత తనకు అడ్డంకిగా ఉన్న ఈ శరీరాన్ని అంతం చెయ్యటం మంచిద నుకున్నాడు. ఇలా తలచి గంగానది లోతుల్లోకి మునిగి పోదామని నడవసాగాడు. కాని పోయిపోయి ఆవలిగట్టు చేరినా నీళ్ళు మోకాలు లోతు లేవు. ఆ స్థితిలో ఆశ్చర్యచకితుడైన తోతా పురి మనస్సులో ఒక కొత్త అనుభవం కలిగింది. అద్వైత బ్రహ్మమే సత్యమనే ఆయన విశ్వాసం, ఇప్పుడు కలిగిన ఈ కొత్త అనుభవంతో ఆ బ్రహ్మమే ఆద్యాశక్తి అని తెలుసుకున్నాడు. ఈ పరబ్రహ్మశక్తినే శ్రీరామకృష్ణులు జగజ్జనని అని చెప్పారు. ఆ శక్తినే ఇంత వరకు తోతాపురి నిరసించాడు. స్వయంగా మరణించాలని యత్నించినా వీలుకాలేని ఈ సంఘటనతో సత్యస్య సత్యమైన ఈ దివ్య సంకల్పం యొక్క ఇచ్ఛ లేకుండా ఈ లోకంలో ఒక ఆకు కూడా కదలదు. జగజ్జనని వైభవాన్ని అన్నింట్లోను ఆయన దర్శించి పరివర్తన చెందాడు. శ్రీరామకృష్ణుల అనుగ్రహంతో తోతాపురి జ్ఞానం పరిపూర్ణం చెంది బ్రహ్మమే సాకార— నిరాకారమని; శక్తి—బ్రహ్మమని అవగాహన చేసుకున్నాడు.

# అద్వైత చైతన్యంలో విలీనం

తోతాపురి దక్షిణేశ్వరం విడిచిపెట్టి వెళ్ళిపోయాక శ్రీరామకృష్ణులు ఆరునెలలు నిర్వికల్ప సమాధిలో ఉండిపోయారు. ఆ సమయంలో దేహస్మృతిగాని, బైటి ప్రపంచంగాని తెలియకుండా అవిచ్ఛిన్నంగా సమాధిలో మునిగిపోయారు. ఈ స్థితిని గురించి స్వామి శారదానంద తన 'శ్రీరామకృష్ణ పరమహంసలో' ఇలా వ్రాశారు : "శ్రీరామకృష్ణులు ఆ నిర్వికల్పసమాధిలోనే ఆరునెలల పాటు ఉండిపోయారు. కాలాంతరంలో శ్రీరామకృష్ణులు ఆ విషయాన్ని ప్రస్తావిస్తూ – 'ఆ స్థితిలో నేను ఆరు నెలలు ఉన్నాను. సామాన్యజీవులు దాన్లో నుండి తిరిగి రారు. కారణమేమంటే ఇరవై ఒక్క రోజుల తర్వాత శరీరం నిలవదు. చెట్టు నుండి ఎండిన ఆకు రాలినట్లు రాలి పోతుంది. ఆ సమయంలో రేయింబవళ్లు ఎలా గడుస్తాయో అనే కాల స్పృహే ఉండదు. మరణించిన వ్యక్తి ముక్కు రంధ్రాల్లోకి, నోట్లోకి ఈగలు ఎలా పోతాయో ఆ విధంగా నా నోట్లోకి, ముక్కులోకి ఈగలు ప్రవేశించాయి. దుమ్ము కొట్టుకు పోవటం వల్ల నా జుట్టు జడలు కట్టింది. నా ఎరుక లేకుండానే మలమూత్ర విసర్జన జరిగేది. ఈ శరీరంలో ప్రాణం ఎలా నిలిచిందనేది ఆశ్చర్యమే. అక్కడే పతన మవ్వాల్సింది. కాని ఒక సాధువు దాన్ని కాపాడటానికి వచ్చాడు. నన్ను చూడగానే నా స్థితిని గుర్తించి, ఈ శరీరం ద్వారా జగన్మాత కార్యం జరగాల్సి ఉందని ఆయన తెలుసుకున్నాడు. అందువల్ల సమయానికి ఆహారం తెచ్చి, మళ్లీమళ్లీ శరీరాన్ని కొట్టి బాహ్యస్మృతి కలిగించటానికి ప్రయత్నించేవాడు. శరీరంలో కాస్త స్పృహ వచ్చే జాడ కనిపించగానే కొంచెం ఆహారం నోట్లో కుక్కేవాడు. ఆ విధంగా కొన్ని రోజులు కొంత ఆహారం కడుపులోకి పోయేది. తక్కిన రోజుల్లో అదీ లేదు. ఆ విధంగా ఆరు నెలలు గడిచాయి. తర్వాత 'భావముఖంలో ఉండు, మానవుడికి ఆత్మోన్నతి కలిగించటానికే భావ ముఖంలో ఉండు.' అని అమ్మ ఆదేశం వినవచ్చింది. దీని తరువాత రక్తవిరేచనాలు పట్టుకుని పేగుల్లో భరించరాని నొప్పి, బాధ కలిగాయి. ఇలా ఆరునెలలు వరుసగా బాధపడ్డాక మనస్సు మామూలుగా దేహచైతన్యంలోకి వచ్చింది. అంతకు ముందు సదా నిర్వికల్ప సమాధిలో మునిగి ఉండేది."

# భావముఖం అంటే?

'భావముఖం' లో ఉండమన్న ఆదేశం శ్రీరామకృష్ణుల జీవితంలో మనలను ఒక ముఖ్యఘట్టానికి తీసుకుపోతోంది. భావముఖం అనే మాట సంస్కృత మత గ్రంథాల్లో కనిపించని ఒక కొత్త పదం. జగజ్జనని ఆదేశం విన్నాక శ్రీరామకృష్ణులే దాన్ని మొట్టమొదటిసారి ఇతరులకు తెలిపారు. భావముఖం అనే మాటకు గుమ్మం అని వాచ్యార్థం. దాని భావన ఏమంటే ఒక భవనం యొక్క గుమ్మంలో ఉన్న వ్యక్తి లోపలికి, బైటికి ఎటు కావాలంటే అటు పోగలిగి గుమ్మానికి రెండువైపులా ఉన్న విషయాలతో సన్నిహిత సంబంధం కలిగి ఉన్నట్లుగా, మానవుడి ప్రజ్ఞలో ఒక చేతనాస్థితి ఉంది. అది 'కేవల' ము (బ్రహ్మం) 'వ్యావహారి' క జగత్తులకూ, సవికల్ప నిర్వికల్ప చైతన్య స్థితులకు మధ్య ఒకరకమైన కూడలి స్థానం వంటిది.

'బావముఖం' అనేది ఒక నూతన భావన అవటంతో ఆ స్థితిని పొందటంలోని సాధక బాధకాలను తెలుసు కోవటానికి శ్రీరామకృష్ణుల ఉపదేశాల ద్వారానే వివరించాల్సి ఉంది. 'భావముఖం' అనేది వేదాంతానికి శ్రీరామకృష్ణులు ఇచ్చిన ఒక కానుక. ఆయన సిద్ధాంతం ప్రకారం జీవుడు నిజంగా నిర్వికల్ప సమాధిని పొందితే మళ్ళీ మామూలు వ్యావహారిక స్థితికి రాలేడు. అతడి శరీరం ఇరవైఒక్క రోజులలో శిథిలమైపోతుంది. ఆ నిర్వికల్ప స్థితి నుండి అధికారిక పురుషులు (దివ్యాదేశం పొందినవారు), అవతార పురుషులు మాత్రమే, మళ్లీ వ్యావహారిక చేతనా స్థితిలోకి రాగలరు. అజ్ఞానంలో కొట్టుమిట్టాడే జీవుల పట్ల కరుణ చేత, వారు వ్యావహారిక జగత్తులో అవతరిస్తారు. వారు జీవులను ఉద్ధరించాలనే భగవత్ప్రేమకు చిహ్నాలు. శ్రీరామకృష్ణులు దీన్ని ఒక ఉపమానం ద్వారా వివరించారు. ఒక విశాలమైన ఆవరణ చుట్టూ ఎత్తైన గోడలున్నాయి. దాన్నుండి మధురస్వరాలు, పరిమళాలు వస్తున్నాయి. దాని చుట్టూ ఉన్న బాట మీద అనేకులు నడయాడుతున్నారు. వాళ్ళలో కొందరు ఆ మధురస్వరాలకు ముగ్ధులై కష్టం మీద ఆ ఎత్తైనగోడనెక్కి ఆ ఆవరణలోని మనోజ్ఞ మధుర దృశ్యాలను చూస్తున్నారు. దాన్ని చూసి వివశులవటంతో లోపలికి దూకి, సర్వాన్ని, విస్మరించి బైటికే తిరిగిరారు. కాని వారిలో కొందరు,

ఆ ఆవరణ చుట్టూ నిర్లక్ష్యంగా పోతూన్న అసంఖ్యాకుల దుఃస్థితి తలచుకుని, ఆ ఆవరణలో జరుగుతున్న మంచి విషయాలను చెప్పి వారిని ఉన్నత స్థితులకు కొనిపోవటానికి ఆ బాట మీదికి దిగివస్తారు. అందుచేత వారు భగవంతుడి ఉద్ధారకశక్తి రూపుదాలుస్తారు. కాబట్టి 'భావముఖ' స్థితిలో ఆరూఢుడైన వ్యక్తికి స్వీయ ప్రయోజనం గాని, స్వీయముక్తి కోసం ప్రయత్నం గాని ఉండదు. అతుడు సంసారంలో బాధ చెందే వారందరి సంక్షేమానికి పూర్తిగా అంకితమౌతాడు.

పరతత్త్వం శక్తి–బ్రహ్మమే (Being will) గాని, శాస్త్రీయ వేదాంతం నిర్ధారణ చేసినట్లు, బ్రహ్మం మాత్రమే కాదు అనే సిద్ధాంతాన్ని మరోరకంగా నిరూపించారు. నిర్వికల్ప సమాధిని గురించి శ్రీరామకృష్ణుల సిద్ధాంతం మాదిరి గాక శాస్త్రీయ వేదాంతం, 'జీవులు నిర్వికల్ప సమాధిని పొంది నప్పటికీ శరీరాన్ని నిలుపుకునే ఉంటారు' అని చెబుతుంది. అలాంటి వారిని జీవన్ముక్తులంటారు. వేదాంతం దీన్ని కర్మ సిద్ధాంతం ద్వారా వివరిస్తుంది. సంచితకర్మ (ఎన్నో జన్మలుగా పేరుకున్న కర్మ)లో నుండి అనుభవానికి వచ్చే (ప్రారబ్ధ) కర్మ ఈ శరీరాన్ని నిలుపు తుంది. సంచితకర్మ, ఆగామకర్మ (ఖర్చు కాని) జ్ఞానాగ్ని చేత దగ్ధమైపోయినా, ప్రారబ్ధకర్మ దాని వేగగతి పూర్తి అయ్యేవరకు నశించదని ఈ సిద్ధాంతం నిర్వివాదంగా చెబుతుంది. ధనుస్సు నుండి విడువబడ్డ బాణం దాని లక్ష్యాన్ని కొట్టకుండా ఆగదు, అనే సామ్యాన్ని తప్పితే మరో ఏ వాదాన్ని ప్రతిపాదించదు. శ్రీరామకృష్ణులు ఈ సిద్ధాంతాన్ని అధిక్షేపిస్తున్నారు. ప్రారబ్ధ కర్మ నిర్వికల్ప సమాధి పొందాక కూడా నిలిచి ఉండే టట్లయితే, జగజ్జనని లేక సాకారదైవం అనేది, వేదాంతం ప్రకారం జడమైన కర్మను అనుభవించేటట్లు చెయ్యాల్సి ఉంది. అందువల్ల సాకారదైవం ప్రారబ్ధకర్మ కంటె మరింత నిత్యమైనది కావాలి. ఈ విషయాన్ని సంప్రదాయ వేదాంతం అంగీకరించటానికి ఇష్టపడదు. వేదాంత బోధ ప్రకారం నిర్వికల్ప సమాధిలో భగవంతుడు కూడా నిషేధింపబడి అద్వయ బ్రహ్మమే నిలిచి ఉంటుంది. ఆ అద్వయ బ్రహ్మం వేదాంతం ప్రకారం 'శుద్ధ బుద్ధం' గాని శ్రీరామకృష్ణుల సిద్ధాంతం ప్రకారం 'శక్తి–బ్రహ్మం' కాదు. ఆయన సిద్ధాంతం ప్రకారం నిర్వికల్ప సమాధిలో జగజ్జనని నిషేధం కాకుండా, సాకారాన్ని తనలో ఇముడ్చుకుని, తాను నిరాకారంగా వ్యక్తమౌతుంది. నిత్యసత్యమనేది శక్తి–బ్రహ్మం. సృష్టి

కాలంలో శక్తి, ప్రాధాన్యత వహించి బ్రహ్మం ఉపాదాన కారణంగా లోన ఇమిడి ఉంటుంది. సృష్టి అంతమైనప్పుడు 'శుద్దబ్రహ్మం' నిలిచి ఉంటుంది. శక్తి నిషేధం కాకుండా అవ్యక్తంగా ఉంటుంది. శ్రీరామకృష్ణులు ఈ విషయాన్ని 'చుట్టచుట్టుకుని ఉన్న పాము – సరసర పాకుతున్న పాము' అనే సాదృశ్యంతో వివరించారు. చుట్టచుట్టుకుని ఉండటం, సరసర పాకడం అనేవి పాముకున్న రెండు అవస్థలు. అందువల్ల సాకార నిరాకారలు ఒకే శక్తి–బ్రహ్మం యొక్క రెండు అవస్థలు. అంతేగాని వాటితో ఏ ఒక్కటి నిషేధం అవటంలేదు.

వ్యక్తిగతమైన అహంకారం, దానికి కారణమైన సమస్త కర్మ నశించినప్పుడు గాని 'నిరాకార స్థితి' సాక్షాత్కరించదు. వ్యక్తిత్వం పునరుత్థానం కావాలంటే (మళ్లీ కనిపించాలంటే) కార్యాకారణాలతో సంబంధమున్న కర్మ సిద్ధాంతానికి వెలుపల ఉన్న దాని వల్లనే కావాలి. అందువల్ల నిర్వికల్ప సమాధిలో స్థితమైనవాడు తిరిగి లేస్తున్నాడంటే, అది ఆద్యాశక్తి ఇచ్ఛ చేత మాత్రమే గాని, ప్రారబ్ధకర్మ వల్ల మాత్రం కాదని శ్రీరామకృష్ణుల అభిప్రాయం. అలా తిరిగి వచ్చిన వ్యక్తిత్వం పాత వ్యక్తిత్వం మాత్రం కాదు. అది మార్పు చెందిన వ్యక్తిత్వం. అది దేవీ కేంద్రమైనది కాని, శరీర కేంద్రమైనది కాదు. జగజ్జనని ఇచ్ఛచేత నిర్వికల్ప సమాధి నుండి మార్పు చెందిన వ్యక్తిత్వం – ఒక సచ్చిదానందం – జీవజగత్తులుగా (చేతనమైన జీవులు – అచేతనమైన ప్రపంచంగా) క్రీడిస్తున్నట్లు అభివ్యక్తమౌతోంది. అజ్ఞాన దృష్టిలో జీవుడు, జగత్తు అనేవి శక్తికి భిన్నంగా వైవిధ్యాన్ని (రకరకాలు అయినవిగా) దాలుస్తున్నాయి. కాని జ్ఞానస్థితి కలిగాక 'శక్తి – బ్రహ్మ' మైన సచ్చిదానందం తాను ఏవిధమైన పరిణామం (మార్పు) చెందకుండా తానే జీవజగత్తుగా మారుతుంది. జీవజగత్తు సచ్చిదానందానికి అభిన్నంగానే ఉంటూ ఉంటుంది. సృష్టి చేసే స్థితిలో ఆయనే జీవ జగత్తులతో కూడిన సాకారదైవం. సృష్టి అంతంలో ఆయనే కేవలం నిరాకారం. సాకార నిరాకారాలు ఒకే నాణేనికి ఉన్న రెండు వైపుల వంటివి. అది సమకాలీన అద్వయస్థితి (ఒకే కాలంలో ఒకటిగా ఉన్న స్థితి). ఈ విషయాన్ని శ్రీరామకృష్ణులు 'మేడ, దానిపైకి చేర్చే మెట్లు' అనే సాదృశ్యంతో వివరించారు. మేడపైకి వచ్చే వరకు మెట్లు మేడ కంటే వేరుగానే ఉంటాయి. కాని మేడ ఎక్కాక మేడ ఏ వస్తువులతో (సున్నం,

ఇటుక మొదలైనవి) కట్టబడిందో వాటితోనే మెట్లు కూడా కట్టబడ్డాయని తెలుస్తుంది.

జ్ఞానంలో ఈ విధంగా ఆరూఢుడైన వ్యక్తిని విజ్ఞానిగా శ్రీరామకృష్ణులు పేర్కొంటారు. జీవజగత్తులను భ్రాంతిగా నిరాకరిస్తూ, వాటికి అతీతమైన బ్రహ్మాన్నే అన్వేషించే జ్ఞానితో పోలిస్తే, ఈ విజ్ఞాని వేరు. విజ్ఞాని దేన్నీ నిషేధించడు. అతడు ఈ విశ్వాన్నంతా మాయగా కాకుండా, సాకార నిరాకార దైవంగా శక్తి–బ్రహ్మం యొక్క శక్తిగా దర్శిస్తాడు. అతడు మేడను మెట్లను రెండింటిని సత్యం అయినవిగానే అంగీకరిస్తాడు. పండు అంటే పండు మొత్తాన్ని, దాన్లోని గింజలు, గుజ్జు, బెరడు మొదలైన వాటి నన్నింటిని గణనలోకి తీసుకుంటాడు. అన్నింటిని అంగీకరిస్తే గాని, పండు యొక్క పరిపూర్ణ జ్ఞానం కలగదు కదా! కాని ఈ పరిపూర్ణజ్ఞానం మాటలతో గాని, వేదాంత చర్చలతో గాని అబ్బదు. జగజ్జనని అనుగ్రహంతోనే కలుగుతుంది. దాని నిమిత్తం వ్యాకులచిత్తంతో పరితపించాలి. దివ్యత్వం కోసం పడే ఈ వ్యాకులత, తపన, అనేవి ఉత్తమోత్తమ సాధనలని, యోగశాస్త్రంలోను తంత్రశాస్త్రంలోను చెప్పబడ్డ సాధనలన్నీ సాధకుడి మనస్సులో వ్యాకులతను కలిగించటానికి మార్గాలు మాత్రమేననీ, శ్రీరామకృష్ణుల అభిప్రాయం. ఈ భావన పరిణతి చెందటానికి ఐహిక బంధాలన్నిటినీ త్యాగం చెయ్యటం అవసరం. ఈ బంధాలనే ఆయన 'కామినీ – కాంచనా' లని పేర్కొన్నారు. వీటిని త్యజించినప్పుడే అమ్మ అనుగ్రహం కలుగుతుంది. ఈ విషయంగా శ్రీరామకృష్ణులు చెప్పిన సాదృశ్యంలో తల్లి తన పిల్లలను ఆటపాటల్లో మరిపించి, వాళ్లు ఆకలిదప్పులని ఏడ్చే వరకు దగ్గరకు పోదు. లోగడే ఈ విషయం ఉదహరించబడింది.

నిర్వికల్ప సమాధి నుండి సాధారణ జగత్తుకు వచ్చాక విజ్ఞానికి అహంకారం మళ్లీ తల ఎత్తుతుందని సూచించ బడింది. కాని ఈ అహం, ఈ వ్యక్తిత్వం, అజ్ఞాని అహం వ్యక్తిత్వం కంటే గుణంలో పూర్తిగా మార్పుచెందినట్టిది. క్లుప్తంగా చెప్పాలంటే సామాన్యుడి అహం దేహకేంద్రీకృతం; విజ్ఞానిది దైవకేంద్రీకృతం. దేహకేంద్రీకృతమైన అహం బేధబుద్ధితో చూసేదంతా సత్యంగా భావిస్తుంది. వస్తు వాహనాలను, వ్యక్తులను 'నేను', 'నాది' అంటూ

వ్యవహరిస్తూ ప్రతి ఒక్కరు, ప్రతి వస్తువు తన సుఖానికి, తన మనుగడకు సాయపడటాన్ని బట్టి విలువ కడుతుంది. అహంకారాన్ని కేంద్రంగా చేసుకున్న వ్యక్తి ఇతరులను ప్రేమిస్తాడు. కానీ ఆ ప్రేమ సంకుచితమైన దవటంతో దాన్ని తాను సుఖపడేటంత వరకే ఉపయోగించుకుంటాడు. విజ్ఞానికి ఉన్న అహంకారం దీనికి విరుద్ధం. అది దైవంతో ఉన్న సన్నిహిత సంబంధం మీద ఆధారపడి ఉంటుంది. భగవంతుడితో అతడు తన సంబంధాన్ని బిడ్డగానో, దాసుడుగానో, మిత్రుడుగానో, ప్రియురాలుగానో ఏర్పరుచు కుంటాడు. జీవులందరినీ, అన్ని వస్తువులను – అవి తనకు అనుకూలంగా ఉన్నా లేక ప్రతికూలంగా ఉన్నా లేక తటస్థంగా ఉన్నా – తన సుఖ సంతోషాలకు ఉపయోగించే వాటిగా కాకుండా, తాను ప్రేమించి సేవించ వలసిన భగవిద్విభూతులుగా పరిగణిస్తాడు.

ఈ నైతిక లక్షణాలతో పాటు మానసిక విశిష్టత కూడా విజ్ఞానిస్థితిలో ఉంటుంది. విజ్ఞాని మానసిక స్థితిని 'భావ ముఖం' అంటారు. అజ్ఞాని యొక్క మనస్సు అతడి వ్యక్తిత్వంతో ముడిపడి ఉంటుంది. అతడు ప్రతి పదార్థాన్ని తన కంటే వేరుగా చూస్తాడు. ఇతరులను కూడా వేర్వేరు రూపాలు, వ్యక్తిత్వాలు గలవారిగా చూస్తుంటాడు. దేని నుండి జగత్తు అనే భావన భాసిస్తోందో; దేన్లో సమస్త జీవరాసులు, వస్తుజాలం సముద్ర ఉపరితలం మీది తరంగాలలాగా, బుడగల్లాగా ఉన్నాయో; అవి వేరు వ్యక్తిత్వాలు కలవిగా వున్నా, ఒకే పదార్థానికి చెందినవో; ఆ పదార్థం వీటి కంటే వేరు కాదో; అలాంటి అఖండ రూపం, అఖండ మనస్సుల ప్రజ్ఞ – విజ్ఞానికి ఉంటాయి. అతడు ఆ ప్రజ్ఞను కలిగి ఉండటం మాత్రమే కాక, తాను దాన్లో భాగమనో, అదే తాననో భావిస్తాడు. 'భావముఖం' అనేది విజ్ఞాని మానసిక స్థితి అనేట్లయితే విజ్ఞానికి తాను అఖండాకారం అనే జ్ఞానం ఉంటుంది. దీని పర్యవసానం ఏమంటే 'భావముఖం' స్థితిలో ఉన్నవారికి విశ్వాకార దృక్పథం ఉంటుంది. గూడు మధ్యలో కూర్చున్న సాలె పురుగు ఆ గూటిలో ఏ భాగానికైనా సులభంగా వెళ్ళ గలిగినట్లు, విజ్ఞాని ఇచ్ఛామాత్రంగా విశ్వంలోని ఏ హద్దుల కైనా పారవశ్యకత అనే రెక్కల మీద ఎగిరిపోగలడు. సంకల్ప మాత్రంతోనే సాధారణ స్థితి నుండి అత్యున్నత స్థితి వరకు చేతనత్వంలోని ఏ భూమికలతోనైనా శృతి కలిపి, ఆయా

ఆనందాలను చవిచూడగలడు. ఈ విధంగా 'భావముఖం' స్థితిలో ఉన్న విజ్ఞాని 'అందరిలోను అన్ని విధాలుగా ఉండ గలడు.' విశ్వచైతన్యంతో ఐక్యత వల్ల, ప్రకృతిలో ఆ శక్తుల ప్రకటనకు తాను ఒక ఉపకరణంగా వర్తిస్తాడు. విజ్ఞాని, చైతన్య వ్యక్తీకరణలోని అన్ని మార్గాల్లోనూ పయనించగలడు కాబట్టి, అతడు భక్తుడి స్థితిలో ఉన్నప్పుడు దాసానుదాసుడు కాగలడు. కాని, అనంత విశ్వాకార వృత్తితో తన వ్యక్తిత్వం శృతి చెయ్యబడినప్పుడు, అతడి ప్రవర్తన వేరుగా ఉంటుంది. విశ్వాత్మశక్తి అభివ్యక్తమెయ్యే వాహకంగా ఉంటాడు. కాబట్టి విస్తృతమైన ఆధ్యాత్మిక శక్తికి కేంద్రమై, ఇచ్ఛామాత్రంగానే అతడు పాపాత్ముణ్ణి పరమసాధువుగా గావిస్తాడు. ఇతర అవతారాల విషయంలో మరి నిర్యాణానంతరం ఎంతో కాలానికి కవులు తత్త్వవేత్తలు మహత్తులతో వారి జీవితాలను స్తుతించినట్లు కాకుండా, విశ్వగురువైన శ్రీరామకృష్ణుల విషయంలో ఆయన అధునాతనుడవటం వల్లా, ఆయన్ను అతి సన్నిహితంగా దర్శించి, పరిశీలించి, పరీక్షించి గ్రంథస్థం చేయబడటం వల్లా, భక్తుడి స్థితి ఉద్ధారకుడి స్థితుల మధ్య మారుతుండటంవల్లా ఆయన భావన నిస్సంశయంగా నిరూపణ గావించబడింది. ఇతర అవతార పురుషుల జీవితాల విషయంలో ఈ విధంగా మార్పులు చెయ్యటం అనేది, వారి అనుయాయులు, ఆ మహాపురుషుల్లోని మానవత్వాన్ని మరుగుపరచటానికి ప్రయత్నించటం కొంత కారణమై ఉంటుంది. వారి జీవిత చరిత్రలోకి మానవత్వ లక్షణాలు దొర్లినట్లయితే వారి దివ్యశోభ కుంటుపడుతుందని ఆ అనుయాయులు భావించి ఉండొచ్చు. కాని అవతార పురుషుడనే వ్యక్తి మానవత్వం, దైవత్వం అనే రెంటిని కలిపి ఒకటిగా మలచబడ్డ వ్యక్తిగా ఉన్నాడు. ఆ అవతారపురుషుణ్ణి దేవుణ్ణి చేస్తే ఈ అవగాహన లక్ష్యం పూర్తిగా నశిస్తుంది. అవతారమంటే ఏమిటో సరైన అవగాహన కలగటానికి శ్రీరామకృష్ణుల జీవితం ఎంతగానో తోడ్పడుతుంది.

ఇంతదాకా మనం ఏ మహత్తరమైన ఆత్మను (విశ్వ వ్యాప్తమైన అఖండాన్ని) గురించి చర్చిస్తున్నామో అది 'శక్తి – బ్రహ్మ' మైన జగజ్జనని యొక్క కేవలం వ్యావహారిక, సాకార–నిరాకార, సగుణ – నిర్గుణ స్థితులకు కూడలి స్థానం. ఆ స్థితిలో నెలకొనడమంటే – 'కేవల'

'వ్యావహారిక' స్థితులు రెంటిలోను ఉండ గల 'భావముఖం' లో నిలవటమే. ఈ కూడలిస్థానం, కేవల వ్యావహారికాల మధ్య గుమ్మం వంటి స్థితి. దాన్నుండి మనస్సు ఏమాత్రం జారిపోకుండా, సక్రమంగా నిత్యవ్యవహారాలను కూడా నిర్వహించగలదు. శ్రీరామకృష్ణులు ఆ స్థితిలో నెలకొని, బాహ్యప్రపంచ పరిణామాలన్నింటితోనూ సంబంధం పెట్టుకొని, వాటి అన్నింటి ఐక్యతను జగజ్జననిలో దర్శిస్తూండే వారు. 'భావముఖం' లో ఉన్న వ్యక్తి (బాహ్య వ్యవహారమైన) లీలలో మాత్రమే గాక, అవ్యక్తమైన అఖండం, నిర్గుణంతో కూడా సంబంధం కలిగి ఉంటాడు. ఈ రెండిటినీ శ్రీరామకృష్ణులు 'నిత్యం—లీల' అని వ్యవహరించారు. ఆయన 'నిత్యం' గురించిన ప్రజ్ఞలో ఉన్నప్పుడు, 'లీలలో' ఉన్న జడత్వం యొక్క సంబంధం, పూర్తిగా ఆ నిత్యం గురించిన ప్రజ్ఞలో ఇమిడి ఉంటుంది. 'లీల' లో ఉన్న సమయం అంతట్లోనూ ఆయన 'నిత్యం' తో సంబంధం కలిగి ఉన్నారు. అదే 'భావముఖం' లేక గుమ్మంలో ఉండే స్థితి అనేదాని అర్థం. ఆయన 'నిత్యం' లో (అంటే అఖండ పరబ్రహ్మంలో) పూర్తిగా నిమగ్నమయ్యే నిర్వికల్ప స్థితిలో కూడా ఉండగలరు. ఆ స్థితిలో 'శక్తి' అనేది నిషేధం కాదని, ఆ స్థితిలోనే అవ్యక్తంగా ఉంటుందని శ్రీరామకృష్ణులు చెప్పారు. ఈ విషయంలో శ్రీరామకృష్ణుల సిద్ధాంతానికి తోతాపురి అనుసరించిన సాంప్రదాయక అద్వైత సిద్ధాంతానికి తేడా ఉంది. ఈ విషయంలో శ్రీరామకృష్ణుల సాహచర్యంలో తోతాపురి సరిదిద్దబడ్డాడు. నిర్వికల్ప స్థితిలో 'లీల' నిషేధింపబడలేదు. నిర్వికల్పస్థితిలోనే అది అవ్యక్తంగా, అంతర్గతంగా ఉంటుంది. అందువల్ల 'విజ్ఞాని' ఇచ్ఛా మాత్రంగానే 'లీల' తో సంబంధం లేకుండా 'నిత్యం' లో సంలీనం కాగలడు. ఇదే నిర్వికల్ప స్థితి. ఈ స్థితిని పొందిన జీవుడికి మరలిరావటం అనేది లేదు. అవతార పురుషులు మాత్రమే ఒక స్థితి నుండి మరోస్థితిలోకి మారతారని, రెండు స్థితులతోను వారికి సంబంధం ఉంటుందని శ్రీరామకృష్ణులు నొక్కివక్కాణిం చారు. అదే ఆయన ప్రత్యేకత. ఒకే సమయంలో ఆయనలో విశిష్ట జ్ఞానం, భక్తి ప్రకటితమవుతాయి. సాధారణ జీవుడు ఒకే స్థితిలో రెంటిని సాధించలేడు. ఇది అసందిగ్ధంగా కనబడవచ్చు. కాని పరతత్త్వాన్ని మాటల్లో వివరించలేం. దాన్ని విరుద్ధ వచనాల్లోనే వెల్లడించగలం.

ఈ విషయంలో శ్రీరామకృష్ణులు స్వవిషయంగా తన మానసికస్థితి నిర్వికల్పం వైపే మొగ్గుతుందని, అప్పుడు వైవిధ్యం, 'నేను' అనే భావన తుడిచివెయ్య బడతాయని చెప్పారు. ఆ స్థితిలో మానవుడు, సమస్త మానవాళితో ఒకటై పోతాడు. అతడికి ఏ విధమైన వ్యవహారం ఉండదు. నిర్వికల్ప సమాధిలో కూడా జగజ్జనని 'కేవలంగా' సాక్షాత్కరిస్తుంది. అవతారపురుషుణ్ణి ఆ స్థితిలో ఉండ నివ్వదు. ఈ విషయాన్ని సంప్రదాయ వేదాంత బోధ అంగీకరించదు. సంసారంలోని జీవుల పట్ల ప్రేమ చేత భగవత్కరుణ 'అవతార పురుషుని' రూపంలో దర్శన మవుతుంది. అందువల్లనే శ్రీరామకృష్ణులు బాహ్య ప్రపంచంతో సంబంధం నిలుపుకోటానికి, చిన్నచిన్న కోర్కెలు కల్పించుకునేవారు. 'ఫలానా చోటికి వెళ్లాలి, ఫలానా వ్యక్తిని కలుసుకోవాలి, ఫలానా వస్తువులు కావాలి' అనే కోర్కెల ద్వారా ప్రపంచ వ్యవహారం నడపటానికి 'భావముఖ' స్థితిలోకి తన మనస్సును లాగుతూండేవారు. కాని నిర్వికల్ప స్థితిలో సంబంధాన్ని మాత్రం వదులుకునే వారు కాదు. 'భావముఖ' స్థితిలో జగజ్జనని సంకల్పం తప్ప తన సంకల్ప మనేది ఆయనకు లేదు. జీవులను ఉద్ధరించే శక్తిని ప్రదర్శించినప్పుడు గాని, తోటి మానవుల కష్టాల్లో పాలుపంచుకుంటూ, దేవీ విగ్రహాన్ని అర్చించేటప్పుడుగానీ, ఆ జగజ్జనని సంకల్పంతో తాదాత్మ్యం చెంది, అది నడిపినట్లు నడిచేవారు.

తీవ్రమైన శారీరక బాధలు అనుభవించేటప్పుడు కూడా, ఒక్క జీవునికైనా, బాధలను అంతరింప చేసి, విముక్తిని కలిగింపగలిగితే ఎన్ని జన్మల్లోనైనా అలాంటి శరీరాన్ని ధరించటానికి సంసిద్ధతను తెలిపారు అని అంటారు. హద్దులు లేని ఈ విశ్వప్రేమ ఆయనలో అభివ్యక్తం కావటమే, ఆయన్ను 'భావముఖం' లో ఉండమనే జగజ్జనని ఇచ్చిన దివ్యాదేశ ప్రత్యేకత. నిర్వికల్ప సమాధిస్థితిలో ఉండి, ఆనందాన్ని అనుభవించాలనేటటువంటి సహజ స్వభావం, మానవోద్ధరణకై శారీరక స్మృతికి దిగి వచ్చి, సుఖదుఃఖా లన్నింటికి ఆలవాలమైన ఈ నికృష్ట శరీరంలోకి వచ్చిందంటే; అది మురికివాడల్లో నివసించే ప్రజలకు సేవ చెయ్యటానికి 'చక్రవర్తి' తన రాజప్రాసాదాన్ని విడిచి, ఆ ప్రజలతో పాటు, ఆ దుర్గంధపూరితమైన మురికివాడలో నివసించే దానికంటే, ఎన్నో రెట్లు అధికమైన దాక్షిణ్యం. అది మన ఊహకు అందదు.

ఆధునికయుగంలో ఉద్భవించి మానవాళిని ప్రేమించే శ్రీరామకృష్ణులనే వ్యక్తి గావించిన మహత్కార్యం ఇదే! నిర్వికల్ప సమాధిలో శాశ్వతంగా నిలిచి ఉండాలనే స్వభావం గల తన మనస్సును, ఆయన మానవ సముద్ధరణకై 'భావముఖం' స్థితిలోనే ఉండే విధంగా నిర్బంధించారు. ఆ రీతిగా ఆయన మానవోద్ధరణకై ఆవిర్భవించిన భగవత్ శక్తిరూపం. ఆయన్ను అవతార పురుషుడు అని అనడంలోని అంతరార్థం ఇదే!

# అన్యమత సాధనలు

శ్రీరామకృష్ణుల జీవితంలో మరో అపూర్వ ఉదంతాన్ని చూద్దాం. అది హిందూమతానికి అన్యమైన ఇస్లాం, క్రైస్తవ మత సంప్రదాయాల్లో ఆయన గావించిన సాహసం. 1866 లో ఆయన ఇస్లాంలోని 'సూఫీ' సంప్రదాయానికి చెందిన గోవింద అనే వ్యక్తి వద్ద ఉపదేశం పొందారు. హిందువే అయిన గోవింద మహమ్మదీయుడిగా మారాడు. శ్రీరామకృష్ణులు హైందవ సంప్రదాయాల సాధనలో ఎంత ఉత్సుకత కనబరిచారో, అంతే ఉత్సుకత ఇస్లాం మత సాధనలోనూ చూపించారు. మహమ్మదీయుడిలా దుస్తులు ధరించి వారిలా భోజనం చేస్తూ, వారిలాగానే నమాజు చేశారు. హిందూదేవత లందరినీ తన మనస్సులో నుండి చెరిపివేశాడు. దేవాలయాలకు వెళ్లాలంటే విముఖత కనబరిచారు. మూడు రోజుల సాధనలో ఆ మత సత్యాలను సాక్షాత్కరించుకున్నారు. మొదట్లో ఆయనకు ఒక గంభీర వదనంతో పొడవైన గడ్డం ఉన్న ఉజ్వలరూపుడు దర్శనం ఇచ్చాడు. అప్పుడు ఆయన మనస్సు సగుణబ్రహ్మ సాక్షాత్కారాన్ని పొంది తర్వాత నిర్గుణబ్రహ్మంతో విలీనమై పోయింది.

ఏడేళ్ల తరువాత శ్రీరామకృష్ణులు క్రైస్తవ మత సాధన చేశారు. శంభుమల్లిక్ అనే భక్తుని ఉద్యాన గృహానికి శ్రీరామకృష్ణులు తరచు వెళ్లేవారు. శంభు, సదాచార హిందువే ఐనప్పటికీ, శ్రీరామకృష్ణులకు బైబిల్ చదివి వినిపిస్తూ ఉండేవాడు. ఆ విధంగా ఆయనకు క్రైస్తవ మతంతోను, క్రైస్తవులతోను పరిచయం ఏర్పడింది. ఆ మార్గాన్ని అనుసరించాలనే ప్రగాఢ వాంఛ ఆయనలో కలిగింది. ఒక విచిత్రమైన విధానంలో ఆ కోరిక ఈడేరింది. ఒకరోజు భక్తుడైన యదుమల్లిక్ కచేరీ చావడిలో శ్రీరామకృష్ణులు కూర్చుని ఉన్నారు. ఆ గోడలకు అనేక పటాలు తగిలించ బడి ఉన్నాయి. ఆ పటాల్లో మేరీమాత ఒళ్లో పసివాడైన ఏసుక్రీస్తు పటం ఒకటి ఉంది. ఆకర్షణీయమైన ఆ పటంకేసి ఆయన అదే పనిగా చూస్తూ ఉండిపోయారు. చూస్తూండ గానే ఆ పటం కాంతివంతమై ఒక ఉజ్వలమైన చైతన్య రూపాన్ని దర్శింపచేసింది. తక్షణమే ఆ మూర్తి నుండి ఒక వెలుగు ప్రసరించి, ఆయనలో ప్రవేశించి ఆయన భావాల్లోను, దృక్పథంలోను

విప్లవాత్మకమైన మార్పులను కలిగించింది. ఇస్లాం మత సాధన చేసినప్పుడు ఉన్నట్లుగా ఆయన మనస్సు నుండి హైందవ భక్తిభావాలు చెల్లా చెదురుగా కొట్టుకుని పోయాయి. ఆలయానికి పోవటం మానివేశాడు. ఈ కొత్తభావాల్లో మునిగిపోయి రెండువేల ఏళ్ల నుండి వచ్చిన క్రైస్తవ భక్తి తత్త్వాన్ని మననం చేశారు. చివర్లో పంచవటి వద్ద నడిచి పోతూంటే, చక్కని వర్చస్సు, విశాలనేత్రాలు, చదునైన నాసికాగ్రం గల ఒక మనోహర దివ్యమూర్తి ఆయనకు దర్శనమిచ్చాడు. ఆ మూర్తి ఆయన్ను తదేకంగా చూసి దగ్గరకు వచ్చింది. వెంటనే శ్రీరామకృష్ణుల పవిత్రహృదయ అంతరాళాలలో నుండి గంటల సవ్వడితో ఈ మాటలు వెలువడ్డాయి – "మానవులను ఉద్ధరించటానికి యమ యాతనలు అనుభవించి, తన హృదయరక్తాన్ని చిందించి, తాను తన తండ్రీ ఒకటేనని చాటిచెప్పిన, దైవకుమారుడైన ప్రేమ మూర్తీ! మహాయోగీ! ఏసుక్రీస్తు!"

దివ్యపురుషుడైన ఆ జీసస్ శ్రీరామకృష్ణులను కౌగలించుకుని, ఆయన శరీరంలో ఐక్యం అయ్యాడు. శ్రీరామకృష్ణులు సమాధి స్థితిని పొంది సగుణ బ్రహ్మంతో తాదాత్మ్యం పొందారు.

ఇస్లాం, క్రైస్తవ మతాల మాదిరి ప్రపంచంలోని ఇతర మతాలను ఆయన ఆ రీతిలో సాధన చేసినట్లు కనిపించదు. కాని ఆ మతాలను గురించి ఆయనకు ప్రగాఢమైన ఆధ్యాత్మికావలోకనం వల్ల కలిగిన, అభిప్రాయాలున్నాయి. బుద్ధుణ్ణి అవతారపురుషుల్లో పరిగణించారు. బుద్ధుడి బోధలు ఉపనిషద్బోధలతో సమతుల్యాలని చెప్పారు. 'బుద్ధుని బోధకు నాస్తిక పోకడలు కానరావటం, ఆయన అనుయాయులు చేసిన అపవ్యాఖ్యానం కారణంగానే' అనేది శ్రీరామకృష్ణుల అభిప్రాయం. శ్రీరామకృష్ణులకు జైన తీర్థంకరుల పట్ల కూడా గొప్పగౌరవం ఉండేది. ఆయన గదిలో తీర్థంకరుల్లో ప్రథముడైన మహావీరుడు, ఏసుక్రీస్తు చిత్రపటాలున్నాయి. ప్రతిరోజు ఆయన వాటిముందు ధూపం వెలిగించేవారు. సిక్కు గురువులను, రాజర్షి జనకుడి అవతారంగా ఆయన పరిగణించారు.

శ్రీరామకృష్ణులు వివిధ మత సాధనలు గావించి 'యతో మత్ తతో పథ్ (మార్గాలు ఎన్ని ఉన్నాయో మతాలు అన్ని ఉన్నాయి) అనే సత్యాన్ని దర్శించటం మానవ జాతికే ఒక

మహత్తరమైన విషయం! మత బాహుళ్యం వల్ల ఉత్పన్న మయ్యే సమస్యలకు శ్రీరామకృష్ణులు దర్శించిన సత్యం, పరిష్కారాన్ని ఇస్తుంది. వివిధ మతానుయాయుల్లో, ప్రధానమైన మత బోధనల్లో సరైన అవగాహన లేకపోవటం వల్లా, వారిలో పరస్పర సంఘర్షణ ఉండటం వల్లా, మోసాల వల్లా, గడిచిపోయిన మతచరిత్ర పైశాచికం గావించ బడింది. మానవుడి లోభం వల్లా, ఆధిక్యత వల్లా ఈ సంఘర్షణలు సంభవించాయనటం నిజం. తాము ఫలానా మతానికి చెందినవారమని చెప్పుకోవటం అనేది – మోసగాళ్ళయిన రాజకీయ నాయకులు, సైనిక అధినేతలు – తమ తమ స్వప్రయోజనాలను కప్పిపుచ్చుకోటానికి చేసే ప్రయత్నాలే! ఒక మతం ఇంకొక మతాన్ని దూషించటం, ఆ మతాన్ని అనుసరించే వాళ్లంతా నరకానికి పోతారనటం దోపిడీదార్లు జనం మద్దతు సంపాదించుకోటానికి; మతాన్ని అవకాశంగా వినియోగించుకోటంలోని వారి దుశ్చర్యలకు అది దోహదం చేసింది. 'అన్ని మతాలు ఒకే గమ్యాన్ని చేరుస్తాయి' అని శ్రీరామకృష్ణులకు కలిగిన సాక్షాత్కారం, నిజాయితీపరులైన మత పెద్దలందరినీ తమతమ పరిభాషల్లో నుండి జుగుప్సాకరమైన 'హీతెన్', 'కాఫిర్', 'మ్లేచ్ఛ' అనే పదాలను తొలగించేటట్లు చేస్తుంది. అంతేగాక అది ఒక మతాన్ని అనుసరించే వారు, తాము ఏ గమ్యానికి వెళుతున్నామో, ఆ గమ్యానికే అన్య మతస్తులు కూడా ఇతర మార్గాల గుండా పయనిస్తున్నారని భావించేట్లు చేస్తుంది.

శ్రీరామకృష్ణులు ఒక్కొక్క మతాన్ని, ఆ మతస్థుడు. చేసినట్లుగానే సాధన చేసి దాన్లో సిద్ధిపొందారు. అందువల్ల ఒక మతాన్ని మరో మతంతో పోలుస్తూ నేటివారు చేస్తున్న పరిశోధనల కంటే, శ్రీరామకృష్ణులు అనుసరించిన విధానం, తులనాత్మకమైన నేటి మతాధ్యయనం కంటే ఎన్నోరెట్లు పురోగామి అవుతోంది. కొన్ని దశాబ్దాలకు పూర్వం మతాలు విమర్శనాత్మకంగా అధ్యయనం చేయబడ్డాయి. ఆ అధ్యయనం యొక్క లక్ష్యం మతాల్లోని గుణదోషాలను బేరీజు వెయ్యటమే. కాని నేడు ఈ విధానం నిరుపయోగమని తీసివేసి, కొత్త పద్ధతి ప్రవేశించింది. దాని ప్రకారం మతాన్ని బైటివాడు అధ్యయనం చేసినట్లు చెయ్యటం మాత్రమే గాక, ఆ మతాన్ని విశ్వసించేవాడు ఎలా సాధిస్తాడో ఆ ప్రకారం సాధన చెయ్యటం

శ్రీరామకృష్ణుల విధానం. విచక్షణా దృష్టితో మతాలను అంగీకరించటమే గాక ఆధ్యాత్మికంగా కూడా అవి సమానమైనవేనని శ్రీరామకృష్ణులు నిరూపించటంతో, ఇది కొత్త పద్ధతిని కూడా అధిగమిస్తోంది.

శ్రీరామకృష్ణుల విధానం మత వైముఖ్యాన్ని తొలగించి వేస్తోంది. ఈ విషయాన్ని గురించి ప్రసంగించే వారి మనస్సులో కూడ ఇదే భావన ఉంది. మతం పట్ల వైముఖ్యం ఉన్నవారు, 'మతాన్ని అనుసరించినా లేక అసలు అనుసరించక పోయినా ఫరవాలేదు' అనే మాటను అంగీకరిస్తారు. కాని 'యతో మత్ తతో పథ్' (మార్గాలు ఎన్ని ఉన్నాయో మతాలు అన్ని ఉన్నాయి) అనే శ్రీరామకృష్ణుల వచనంలోని భావం, వీరి అభిప్రాయానికి పూర్తిగా విరుద్ధంగా ఉంది. హిందువైనా, క్రైస్తవుడైనా లేక మహమ్మదీయుడైనా తమతమ మతాలను అత్యంత శ్రద్ధతో అనుసరిస్తూ, ఇతర మతాలన్నీ సత్యమైనవి అని అంగీకరించాలి. ఇదే ఈ రెండు అభిప్రాయాలకు మధ్య ఉన్న వ్యత్యాసం! మత సహనం మాత్రమే గాక, తమ మతం ఎలాంటిదో ఇతర మతాలూ అలాంటివే అని భావించాలి. మత సహనమే కాక పరస్పర అంగీకారాన్ని శ్రీరామకృష్ణుల బోధ కోరుతుంది. మతాల అనేకత్వం కల్పించిన సమస్య శ్రీరామకృష్ణుల అనుభవాల ప్రాతిపదిక మీదనే పరిష్కరింప బడగలదు.

ఇక్కడ 'శ్రీరామకృష్ణులు ఈ మతాలనన్నింటినీ యథార్థంగానే సాధన చేశారా?' అనే ప్రశ్న తల ఎత్తుతుంది. అంతేగాక "మహమ్మదీయుడవటానికి, క్రైస్తవుడవటానికి జీవితాంతం అంకితం కావాలి గాని, మూడు రోజులు ఆ మతాలనను సాధన చేస్తే సరిపోతుందా? క్రైస్తవ మతాన్ని గాని, మహమ్మదీయ మతాన్ని గాని మూడు రోజుల్లో ఔపాశన పట్టి ఆ తర్వాత క్రైస్తవుడు, మహమ్మదీయుడు కాకుండా ఉండగలడా?" – ఇలాంటి విమర్శలు గురుదేవుల అసాధారణ మానసికశక్తిని గురించిన అజ్ఞానాన్ని ఆధారం చేసుకునే బైలుదేరుతున్నాయి. తనకు అవసరం లేని దాన్ని తొలగించటానికి, అవసరం ఉన్నదాన్ని రప్పించుకునే రీతిలో ఇచ్ఛామాత్రంగా తన ఆలోచనా సరళిని ఆయన నియంత్రించగలరు. 'భావముఖం' లో నెలకొని

ఉండటంతో, భూత భవిష్య ద్వర్తమానాలు ఒకదాని వెంట ఒకటి రావటమే గాక, ఎంతో విస్తృతమైన ఆయన విశ్వమానసం మీద ఆ మూడూ ఒకే కాలంలో గోచరిస్తాయి. కాబట్టి గతాన్ని జ్ఞప్తి తెచ్చుకోటం కాని, భవిష్యత్తును చూడగలగటం గాని, వర్తమానంలో ఏ మతంలోనైనా ఉండగలగటం గాని ఆయనకు ఇచ్ఛామాత్రంగానే సాధ్యమౌతుంది. అందుచేత ఇస్లాం, క్రైస్తవ మతాల్లోని విధానాలన్నింటిని అవగాహన చేసుకుని వాటిలోని పరతత్త్వాన్ని అనుభవంలోకి తెచ్చుకునే శక్తి ఆయనలో ఉంది. జీవిత పర్యంతం క్రైస్తవుడుగాను, మహమ్మదీయుడుగాను ఉండవలసిన అగత్యం ఆయనకు లేదు. అది మతమౌఢ్యంలో 'ఆచార వ్యవహారాలను పాటించటమే మతం' అనే వారికి ఉన్న భావన మాత్రమే. అలాంటివారు మతమంటే నిజానికి అనుభవమేనని ఏ మాత్రం తెలియనివారు. మతాల్లోని అనేకత్వ సమస్యను శ్రీరామకృష్ణులు ఏ రీతిలో పరిష్కరించారో తెలియడానికి ఆయన ఆరూఢ 'భావముఖం' స్థితి యొక్క పూర్తి అవగాహన అవసరం.

# తీర్థ యాత్రలు

శ్రీరామకృష్ణులు మథురనాథ్‌తో 1869 ప్రాంతంలో తీర్థయాత్రలు చేశారు. అప్పుడు సందర్శించిన వాటిలో కాశీ, బృందావనం ముఖ్యమైన క్షేత్రాలు. కాశీలో ఆయనకు ఒక అద్భుత దృశ్యం కనిపించింది. రాళ్లు, మట్టితో కాక ఆ పట్టణమంతా బంగారంతో నిర్మించబడినట్లు, అనంత కాలం నుండి అక్కడ నివసించి తపమాచరించిన అసంఖ్యాక భక్తుల నుండి ఉత్పన్నమైన ఆధ్యాత్మిక అనుభవాలతో, పొరలు పొరలుగా బంగారంతో ఆ పట్టణం నిర్మితమైనట్లు దర్శనమైంది. కాశీలో మరణించిన జీవులకు శివుడు తారకమంత్రాన్ని ఉపదేశిస్తున్నట్లు కనిపించింది. మరో అద్భుత దృశ్యం – మృతదేహాలను తగులబెడుతున్న మణికర్ణికాఘట్టం కేసి నడుస్తూన్నప్పుడు కలిగిన ఈ అనుభవాన్ని గురించి శ్రీరామకృష్ణులు ఇలా చెప్పారు "ఒక పొడవైన తెల్లని వ్యక్తి, జడలు కట్టిన ఎర్రని శిరోజాలతో, ఆ శ్మశానఘట్టంలోని ప్రతి చితి వద్దకు గంభీరంగా అడుగులు వేస్తూ, ప్రతి జీవిని నెమ్మదిగా లేవనెత్తి చెవిలో పరబ్రహ్మ మంత్రాన్ని ఉపదేశిస్తున్నట్లు నాకు కనిపించాడు. మరొకవైపు సర్వశక్తి సంపన్నురాలైన మహాకాళి, జీవుల పురాకృత స్థూలసూక్ష్మకారణ కర్మబంధాన్ని విప్పి తన చేతులతో ముక్తిమార్గాన్ని తెరిచి వారిని అనంతధామానికి పంపుతూన్నట్లు కనిపించింది." ఈ విధంగా విశ్వనాథుడు అనేక యుగాల తపోఫలంతో లభించే అనంత అద్వయ ఆనందాన్ని ప్రసాదించి జీవునికి సద్యోముక్తి కలిగించాడు. కాశీలోనే శ్రీరామకృష్ణులు సుప్రసిద్ధ అద్వైతసిద్ధుడైన త్రైలింగస్వామిని దర్శించారు.

బృందావనంలో కూడా అనేకసార్లు భావసమాధి కలిగి శ్రీకృష్ణుని జీవితంలోని అనేక ఘట్టాలను దర్శించారు. బంకు –బిహారీ విగ్రహం చూడగానే, భావసమాధిలో అటువైపు పరిగెత్తి, దాన్ని కౌగిలించుకున్నారు. ఆవుల మందలను ఇళ్లకు తోలుకు వచ్చే గోపబాలుర మధ్య నవనీల నీరద ఘనశ్యాముడు, కేకిపింఛధరుడైన కృష్ణుని దర్శనం ఆయనకు కలిగింది. శ్రీకృష్ణ స్మృతులతో నిండిపోయిన గోవర్ధనం, నిధువనం దర్శించి ఆ పుణ్యస్థలాల్లో భావసమాధి చెందారు. బృందావనంలో గంగామాయి అనే వృద్ధ వైష్ణవ సన్న్యాసినితో పరిచయం కలిగి

ఆయనకు అక్కడే స్థిరంగా ఉండిపోవా లనిపించింది. తిరుగు ప్రయాణంలో మరోమారు కాశీ దర్శించాక గయకు వెళ్లటానికి నిరాకరించారు. ఆ క్షేత్రనాథుడైన గదాధరుడి నుండే తాను ఉద్భవించటం వల్ల, ఆ దేవుని సన్నిధికి పోతే ఆయనలో తాను విలీనం కావచ్చు. మథుర్‌తో కూడ 1871 లో ఒక చిన్న తీర్థయాత్ర సాగించి వైష్ణవ క్షేత్రాలైన ఖీల్నా, నవద్వీపం దర్శించారు. ఇప్పటి వరకు తనకు రసద్దారుగా (సరఫరాదారునిగా) మెలిగిన మథుర్‌నాథ్ ఈ యాత్రానంతరం మరణించాడు.

# మాతృదేవి ఆగమనం, షోడశీపూజ

శ్రీరామకృష్ణుల జీవితంలో 1872 లో ఒక ముఖ్య సంఘటన జరిగింది. నేడు లోకమంతా మాతృదేవిగా పేరుగాంచిన ఆయన సతీమణి శ్రీశారదాదేవితో యథార్థ దృష్ట్యా కలిగిన మొదటి సమాగమం అది. శ్రీరామకృష్ణుల సాధనాకాలంలో శారదదేవి రెండు సార్లు ఆయన్ను కలుసుకుని సేవలు చేసినా, అప్పటికి ఆమె పిన్న వయస్కురాలు. ప్రస్తుతం ఆమె పద్దెనిమిద్ధేళ్ల యువతి. శారద భర్త పిచ్చివాడని ఊళ్లోని అమ్మలక్కలు చెప్పుకునే ఉబుసు పోక కబుర్లు ఆమె చెవిన పడ్డాయి. ఈ సమయంలో ఆయన వద్ద ఉండి సేవచెయ్యటం తన కర్తవ్యమని భావించి, శారదాదేవి 1872 లో తన తండ్రి వెంట కలకత్తాకు వెళ్లింది. సాధారణ పరిస్థితుల్లో అయితే సన్న్యాసియైన శ్రీరామకృష్ణుల వంటి వ్యక్తి భార్యను త్యజించటం, ఆమె తానుండే చోటుకు వస్తే తిరస్కరించటం వంటివి చేసి ఉండాలి. కాని శ్రీరామకృష్ణులు దీనికి విరుద్ధంగా ప్రవర్తించారు. ఆమెకు ఆప్యాయంగా స్వాగతం పలికారు. అంతేకాదు, ఆమె తన గ్రామం నుండి వచ్చేటప్పుడు జ్వరం బారిన పడడంతో ఆమెకు వసతి కల్పించి అన్నపానాదులిచ్చి చికిత్స చేయించాల్సి వచ్చింది. అందరికీ ఆశ్చర్యం కలిగించిన దేమిటంటే ఈ సన్న్యాసి భర్త నిస్సంకోచంగా వీటన్నింటిని నిర్వర్తించారు. ఆమెకు స్వస్థత చిక్కాక ఆమె దేవాలయ నహబత్తులో ఉంటూ శ్రీరామకృష్ణులను, దక్షిణేశ్వరంలోనే నివసిస్తున్న ఆయన ముసలి తల్లిని సేవించసాగింది.

శ్రీరామకృష్ణుల జీవితం ఆమె రాకతో మరింత ప్రాధాన్యతను సంతరించుకుంది. భార్యను దాపులకు రానివ్వకుండా, కేవలం సన్న్యాసిగా ఉండాల్సిన ఆయన జీవితం శారదాదేవి రాకతో ఆధ్యాత్మిక ఉత్కృష్టతను అందుకుని గృహ సంబంధమైన ప్రేమానురాగాలతో, ఎడారిలో ఒయాసిస్సు (నీరు ఉండే ప్రాంతం) మాదిరిగా మారింది. ఒకరోజు శ్రీరామకృష్ణులు యవ్వనవతియైన తన భార్యను ఇలా అడిగారు – "నువ్వు ఇక్కడికి ఎందుకు వచ్చావు? నన్ను లౌకిక జీవితంలోకి దింపటానికి వచ్చావా?" అంతర్దృష్టి, తెలివి గల శారద తక్షణమే ఇలా

జవాబిచ్చింది– "నేనెందుకు అలా చేస్తాను? మీకు సేవ చెయ్యటానికి, మీ నుండి నేర్చుకోటానికీ, మీ ఆధ్యాత్మిక జీవితంలో చేదోడు వాదోడుగా ఉండటానికి వచ్చాను." శారదాదేవి కూడా మరో సందర్భంలో తన భర్తను పరీక్షించటానికి ఇలా ప్రశ్నించింది – "మీరు నన్ను ఏ దృష్టితో చూస్తారు?" శ్రీరామకృష్ణులు తక్షణమే ఇచ్చిన జవాబు – "ఏ జగజ్జనని దేవాలయంలో పూజలందు కుంటోందో, ఏ తల్లి నా శరీరాన్ని కన్నదో, ఆమె ఇప్పుడు నాకు సేవచేస్తోంది."

ఈ దివ్యదంపతుల అసాధారణ బాంధవ్యాన్ని తెలుసు కోటానికి పాఠకుడు శ్రీశారదాదేవి చరిత్ర చదవవలసి ఉంటుంది. శ్రీశారదా శ్రీరామకృష్ణుల మధ్య నడచిన ప్రశ్నోత్తరాలు కేవలం అప్పటికి తగినట్లు మాట్లాడిన ఆషామాషీ మాటలు కావనీ, వారికి ఒండొరుల పట్ల గల అభిప్రాయాన్ని, భావనలను యథాతథంగా తెలిపే రెండు సంఘటనలను ఇక్కడ ముఖ్యంగా పేర్కొనవలసి ఉంది. అవి వారిద్దరికి సంబంధించిన మొదటిదశలో జరిగినట్టివి. స్త్రీలందరి పట్ల తన శిశుస్వభావం ఎంతదాకా నెలకొని ఉందో తెలుసుకోడానికి శ్రీరామకృష్ణులు తనను తాను పరీక్షించుకోదలచారు. శారదాదేవి దక్షిణేశ్వరంలో ఉండటాన్ని దానికి అవకాశంగా తీసుకున్నారు. ఆరు నెలల పాటు ఆమెను తన గదిలోనే పడుకోమన్నాడు. ఆ విధంగా తమ ఇద్దరిని అగ్నిపరీక్షకు గురిచేశారు. కాని వారిద్దరి మనస్సులూ శారీరకస్థితికి దిగజారలేదు. శ్రీరామకృష్ణులు మాత్రం రాత్రులు సమాధిలో గడిపారు. శ్రీరామకృష్ణులు శారదాదేవిని జగజ్జననిగా ఏవిధంగా ఆరాధించారో అనేది మరో ముఖ్యమైన విషయం. తన భార్యతో ఆయనకున్న సంబంధాన్ని అది స్పష్టంజేస్తుంది. ఒక ఫలహారిణీ కాళీపూజ రోజున, పూజ జరిగే సమయంలో శారదాదేవిని తన గదిలోకి రమ్మని శ్రీరామకృష్ణులు కబురంపారు. కాళీమాతకై అమర్చిన పీఠం మీద ఆమెను కూర్చోమన్నారు. ఆమెను సాక్షాత్తు దేవిగా భావిస్తూ శాస్త్రోక్తమైన సమస్త ఉపచారాలను చేశారు. చివరలో తనతో సహా తన సాధనా ఫలితాల నన్నింటినీ ఆమె పాదాల మ్రోల సమర్పించి సమాధి మగ్నుడు అయ్యారు. తన భార్య ద్వారా ఆయన జగజ్జననికి చేసిన ఆరాధన, సమస్త స్త్రీ జాతి పట్ల ఆయనకున్న గౌరవనాకీ, ఆయనలో శిశు స్వభావానికి నిదర్శనం. ప్రతీకాత్మకంగా తన సాధనల్లో ఆమెను పాల్గొనేలాగా చేసి, ఆమెలోని జగజ్జననిని

ఆవాహన చేశారు. ఆ విధంగా ఆమెను తన జీవితకాలంలోను, తదనంతరం తన ఉద్యమ సానుకూలతలో అర్హురాలైన సహకారిణిగా గావించారు.

శ్రీరామకృష్ణుల అనుయాయుల్లో శారదాదేవి ఇప్పటి నుండి మాతృదేవిగా వ్యవహరింపబడ్డారు. ప్రథమ అగ్రేసర శిష్యురాలుగా ఆయన మార్గదర్శకత్వంలో సాధనలు చేస్తూ, ఆయనకు సేవలందిస్తూ ఆమె దక్షిణేశ్వరంలోనే అధికకాలం గడిపారు. శ్రీరామకృష్ణులు ఆమె పట్ల ఎంతో శ్రద్ధ వహించారు. ఆమె భవిష్యత్తు గురించి యోచించారు. ఆమె ఇష్టత కనబరచిన నగలు కూడా కొన్ని చేయించిపెట్టారు. శ్రీరామకృష్ణులు తోతాపురి వద్ద సన్న్యాస దీక్ష తీసుకున్నారు. కాని, సన్న్యాస నియమాలకు విరుద్ధంగా భార్యను తన వద్దే ఉండటానికి, సేవ చెయ్యటానికి అంగీకరించారు. ఈ రీతుల్లో ఆయన్ను హైందవ ధర్మశాస్త్రాల్లో నిర్వచించినట్లు నాలుగు ఆశ్రమాలకు అతీతమైన 'అత్యాశ్రమి' అని పేర్కోవచ్చు. ఆయన విలక్షణమైన భగవదవతారం కాబట్టి గృహస్థులకు, సన్న్యాసులకు కూడా ఆయన ఆదర్శం చూపవలసివుంది. ఏకకాలంలో సన్న్యాసినిగాను, భార్యగాను రూపొందిన శారదాదేవి సాహచర్యంలో ఆయన దీన్ని సాధించారు.

మాతృదేవి పట్ల, సహజంగా స్త్రీల పట్ల శ్రీరామకృష్ణులకు ఉన్న గౌరవ భావనను మనస్సులో ఉంచుకుని – కామినీ కాంచనాల దుష్ట ప్రభావాన్ని గురించి రాజీపడని – ఆయన ఉపదేశాన్ని తర్కించవలసి ఉంది. ఈ 'కామినీ కాంచనాల' పద ప్రయోగానికి ఆయన భావన – కామం, లోభం. మానవుడి ఆధ్యాత్మిక పురోగతికి ఇవి అడ్డంకులు. స్త్రీని జగజ్జననికి ప్రతీకగా చూడాలని, ఆమెను కామదృష్టితో చూడటం ఆమె పట్ల అపచారం చెయ్యటమేనని ఆయన భావం. సామాన్య తాంత్రిక సాధకుల మాదిరికాక ఆయన ఆ సాధనలు చేసిన కాలమంతా స్త్రీల పట్ల తాను శిశు స్వభావాన్ని కనబరచారు. తన భార్యను జగజ్జననికి ప్రతీకగా ఆరాధించటమే కాకుండా, తన జీవితాంతం తన వద్ద ఉండనిచ్చారు. ఆయన 'కామినీ కాంచనాల' పట్ల చూపే విముఖత్వాన్ని స్త్రీ ద్వేషంగా పరిగణించకూడదు. స్త్రీ పురుషుల్లోని కాముకతనే ఆయన

విమర్శించారు. 'కాంచనం' లోభానికి ప్రతీక. మాతృదేవి శ్రీరామకృష్ణుల జీవితంలో ప్రవేశించి, అందులో అంతర్భాగం కాకపోయినట్లైతే, ఈ విషయంలో శ్రీరామకృష్ణుల ఉపదేశాలు ఆచరణయోగ్యం అని అనిపించక, కేవలం పండిత వాక్యాలని భావించబడేవి.

# గురువు పాత్రలో

షోడశీపూజ శ్రీరామకృష్ణుల జీవితంలో సాధక అధ్యాయానికి సమాప్తం పలుకుతూ ఆయన్ను గురువు పాత్రలోకి ప్రవేశపెడుతోంది. ఈ రెంటికీ హద్దు స్థూలంగా కనిపించినా గురుదేవుల వ్యక్తిత్వంలో చిన్నతనం నుండి గురువు లక్షణం ఉండనే ఉంది. ఒకే వ్యక్తిలో దివ్యత్వ మానవత్వాల అద్భుత సమీప వర్తిత్వమే అవతారం. కొన్ని సమాయాల్లో ఈ రెండింటిలో ఏదో ఒకటి అధికంగా కనిపిస్తుంది. చిన్నతనంలో అప్పుడప్పుడు కనిపించిన స్థితి పరిణతి చెందే కొద్దీ మరింత అధికంగా గోచరిస్తూ వచ్చింది. పురాణాల్లో వర్ణించినట్లు అవతారమనేది దేవత కాదు. పురాణాల్లో మానవాతీత కృత్యాలు, ప్రదర్శనలు అవతారం యొక్క దివ్యత్వానికి గీటురాళ్లుగా చిత్రించబడ్డాయి. అవతారం అనే అవగాహనను మరుగుపరచే కవుల అసహజ వర్ణనల నేపథ్యంలోని సత్యస్వరూపాన్ని అర్థం చేసుకోటానికి శ్రీరామకృష్ణుల జీవితం ఉపకరిస్తుంది. దివ్యత్వ అభి వ్యక్తీకరణ క్రమంగా వచ్చేదని శ్రీరామకృష్ణుల జీవితం ద్వారా మనకు తెలుస్తుంది. కామార్పుకూర్‌లో శ్రీనివాస్ అనే వ్యక్తికి బాల్యంలో తన దివ్యత్వాన్ని వ్యక్తం చేసిన సందర్భం, శ్రీరామకృష్ణుల జీవితంలో మొట్ట మొదటిది. శ్రీనివాస్ పేదవాడు. ఆలి చిప్పలతో చేతికంకణాలు తయారుచేసి జీవనం సాగించేవాడు. గదాధరుడిలో అతడు దివ్యత్వాన్ని గాంచాడు. ఒకరోజు అతడు గదాధరుణ్ణి ఒక ఏకాంత ప్రదేశానికి తీసుకెళ్లి, పువ్వులతో పూజించి, అనేక మిఠాయిలు సమర్పించి, కంటతడి పెట్టి ఇలా ప్రార్థించాడు– "నేను వృద్ధుడనయ్యాను, కాలం దగ్గరపడింది. ఈ లోకంలో నువ్వు చూపబోయే అద్భుతాలను చూసే భాగ్యం నాకు లేదు. ఈ నిరర్థక సేవకుడి మీద కరుణాదృష్టిని చూపమని మాత్రం వేడుకొంటున్నాను".

శ్రీరామకృష్ణుల సాధన వృద్ధి అయ్యే కొద్దీ భావసమాధి కలుగుతూన్నట్లు, ఈ విధమైన దివ్యత్వ ప్రకటన కూడా అంతకంతకూ అధికం కాసాగింది. మధురనాథ్‌కి తాను ఒకసారి కాళిగా, శివుడుగా ఎలా దర్శనమిచ్చింది, గురుత్వ వైఖరి వహించి రాణి రాస్మణిని ఎలా సరిదిద్దిందీ, లోగడే వివరించాం. శ్రీరామకృష్ణులలో వ్యక్తమవుతున్న ఈ దివ్యశక్తి వల్లే

పండితుడైన వైష్ణవచరుణ్, ఇందేష్‌కు చెందిన గౌరి పండితుడు, పద్మలోచన్, నారాయణశాస్త్రి ప్రభృతులంతా ఆయన్ను అవతార పురుషుడిగా అంగీకరించారు. అదే విధంగా తన గురువులైన భైరవీ బ్రాహ్మణి, జటాధారి, తోతాపురి విషయాల్లోనూ, ఆయన వారి లోపాలను సరిదిద్ది, వారి అనుభవాలకు పరిపూర్ణత సంతరించుకోటంలో తోడ్పడ్డారు.

# కేశవ్‌తో సమావేశం, భక్తుల రాక

షోడశీపూజతో ఆయన జీవితంలో ప్రారంభమైన కొత్త దశతో ఆయనలోని గురుత్వ లక్షణం వికసించసాగింది. వినమ్రుడైన భక్తుడుగా ఉండటం ఆయన సహజ మనో భావం. కాని తాను ఒక ఉద్యమాన్ని నిర్వహించాలని, లోకానికి జగజ్జనని ఉపకరణంగా కొంత మేలు చెయ్యాలని రాను రాను ఆయన భావించసాగారు. ఆయనలో భక్తులను అనుగ్రహించే శక్తి వృద్ధి చెంది ఇచ్ఛామాత్రంగానే వారి ఆధ్యాత్మిక చైతన్యాన్ని జాగృతం చేసేవారు. ఆయన జీవితంలో ఈ స్థితి రావటానికి ముందే ఆయన దృక్పథంలో మార్పు రావటం మనకు కనిపిస్తుంది. భగవంతుడికై కలిగిన తీవ్ర వ్యాకులత ప్రస్తుతం భక్తులతో తన అనుభవాలను పంచుకోవాలనే తీవ్ర ఆకాంక్షగా రూపొందింది. ఏకాంతం కావాలని కోరే ఆయన, ఇప్పుడు భక్తుల, సత్యాన్వేషకుల సాంగత్యం కోసం పరితపించసాగారు. శ్రీరామకృష్ణుల మాటల్లోనే చెప్పాలంటే – “పొద్దుగూకి సాయంత్రం కాగానే, ఎంత ఓర్చుకున్నా, ఆ ఆరాటాన్ని అణచుకోలేక పోయేవాణ్ణి. మరో రోజు గడిచిపోయిందే, రావలసిన భక్తులు ఇంకా రాలేదే అనే భావన కలిగేది. ప్రదోషకాలంలో దేవాలయంలో గంటల మోత, శంఖారావం వినవస్తూ అర్చన జరిగేటప్పుడు, దేవాలయ యజమానుల కుఠి మేడ మీదికి ఎక్కి హృదయావేదనతో ఎలుగెత్తి, కన్నీరు గారుస్తూ, ‘ఓ బిడ్డలారా! మీరెక్కడున్నారు? రండి, అందరూ రండి, మిమ్మల్ని చూడకుండా ఉండలేను’ అని దిక్కులు పిక్కటిల్లేట్లుగా కేకలు పెట్టేవాణ్ణి. నేను పడ్డంత ఆరాటం తల్లి పిల్లల కోసంగాని, ప్రేమికులు ప్రియుల కోసంగాని, స్నేహితులు తమ మిత్రుల కోసంగాని పడ్డారా అంటే సందేహాస్పదమే.”

ఇలా జరిగిన కొద్దిరోజులకు భక్తులు ఒక్కొక్కరు రావటం ప్రారంభించారు. శ్రీరామకృష్ణుల వద్దకు ఎవరు వచ్చేదీ, ఎవరిని తాను గుర్తుపట్ట గలిగేదీ ఆయన ముందుగానే కాంచగలిగేవాడు.

సాధనా కాలంలోనే శ్రీరామకృష్ణులకు అనేక భక్తులున్న మాట నిజమే. రాణి రాస్మణి, మథురనాథ్‌తోనే కాక ఆయనకు అనేకమంది పండితులతోను, సాధకులతోను పరిచయం ఏర్పడింది. దేవాలయ నిర్వహణాధికారుల పుణ్యమా అని అనేక సంప్రదాయాలకు చెందిన సాధువులు కూడ దక్షిణేశ్వరం వస్తూండేవారు. వారు అక్కడ బస చెయ్యటంతో శ్రీరామకృష్ణులకు వారితోను, వారి వెంట వచ్చిన సాధకులతోను కలిసి మెలసి ఉండే అవకాశం కలిగింది. కాని మథురనాథ్ తప్ప తక్కిన వారంతా పాత కాలపు వాళ్ళు. కళాశాలల్లోను, విశ్వవిద్యాలయాల్లోను పాశ్చాత్య విధానాల్లో బోధింపబడే కొత్త ధోరణులతో ఏ మాత్రం సంబంధం వారికి లేదు. వారి మనస్తత్వం ప్రాచీన భారతీయ విద్య, సంప్రదాయాలకు మారురూపు. సాటిలేని తన ఆధ్యాత్మికానుభవాలను స్వీకరించడానికి విభిన్న మానసిక ధోరణులున్న వ్యక్తులు అవసరం అయ్యారు. ఈ ఆధ్యాత్మికానుభవాలు సమస్త మానవాళికి, అందునా రాబోయే తరాలవారికి ఉపయోగపడేవి. 1874 లో కేశవచంద్రసేన్‌ను కలిశాక, శ్రీరామకృష్ణుల వద్దకు ఆధునిక విద్యను అభ్యసించిన యువకబృందం రాసాగింది. వీరిచే ఈ కార్యం నిర్వర్తించబడింది.

బ్రహ్మసమాజ నేతల్లో ఒకరైన కేశవచంద్రసేన్ ఆనాటి బెంగాలీ యువతకు ఆరాధ్యుడు. కేశవ్ ఆలోచనా ధోరణుల్లో పూర్తిగా పాశ్చాత్యుడు; హైందవసమాజ వ్యవస్థను, ఆరాధనా విధానాలను నిశితంగా విమర్శించేవాడు. ఆ విషయాల్లో శ్రీరామకృష్ణులకు, కేశవ్‌కి పొంతన ఎక్కడా లేదు. కాని ఈ విభేదాలన్నింటిని అతిక్రమించి అత్యంతమైన భగవద్భక్తి విషయంలో వారిద్దరూ కలుస్తారు. అందువల్ల మొదటిసారి కలిసినప్పటి నుండి కేశవ్ శ్రీరామకృష్ణులను ఎంతగానో గౌరవించసాగాడు. అంతేగాక శ్రీరామకృష్ణుల సిద్ధాంతాలు, వ్యక్తిత్వం చేత ప్రభావితుడయ్యాడు. పర్యవసానంగా పాశ్చాత్య, క్రైస్తవ భావనల మీద ఆధారపడ్డ అతడి భావాలు మారిపోయాయి. శ్రీరామకృష్ణుల గురించి బ్రహ్మసమాజ వేదికల్లో తరచు ఆయన ప్రస్థావన తీసుకొచ్చేవాడు; తన పత్రికల్లో ఆయన్ను గురించి రాసేవాడు. ఆ రోజుల్లో కేశవ్ ఏం రాసినా, ఏం మాట్లాడినా ఆధునిక విద్యావంతులకు వేదవాక్కు అయ్యేది. ఇలా కేశవ్ ప్రసంగాలు, రచనలు విద్యాసంపన్నులైన కలకత్తా ప్రజానీకానికి దక్షిణేశ్వరంలోని అనుపమాన వ్యక్తి,

శ్రీరామకృష్ణుల ఉనికిని తెలియ పరచాయి. తదనంతరకాలంలో శ్రీరామకృష్ణుల శిష్యులైన గృహస్థులు, సన్న్యాసులు ఈ రీతిలో ఆకర్షితులైనవారే! శ్రీరామకృష్ణులను దర్శించి, ఆయన శిష్యులు కాకుండా, అభిమానులైన ఆనాటి ప్రముఖులు : జతీరంద మోహన్, ఠాగూర్, క్రిస్టోదాస్ పాల్, ప్రతాపచంద్ర మజుందార్, శివనాథశాస్త్రి, విజయకృష్ణ గోస్వామి, దేవేంద్రనాథ్ టాగూర్, ఈశ్వరచంద్ర విద్యాసాగర్, బంకించంద్రఛటర్జీ, మైకేల్ మధుసూదన దత్త, విశ్వనాథ ఉపాధ్యాయ, అశ్వనీకుమార్ దత్త మొదలైనవారు.

# గృహస్థ శిష్యులు

ఈ ప్రముఖులంతా శ్రీరామకృష్ణులను గౌరవించినా, కొందరు ఆయన నుండి ఉపదేశాలను పొందినా, వారెవ్వరూ ఆయన జీవితంలోను, ఆయన సందేశాన్ని ప్రచారం చెయ్యటంలోను ప్రాధాన్యత వహించలేదు. ఈ అంశంలో ప్రముఖపాత్ర వహించిన బృందం ఆయనకు అతి సన్నిహితు లైన భక్తులు, శిష్యులు మాత్రమే! వీరిని రెండు వర్గాలుగా వర్గీకరించవచ్చు – వివాహమై జీవితంలో స్థిరపడ్డ స్త్రీ పురుషులైన పెద్దలు ఒక వర్గం. జీవిత బరువుబాధ్యతలేవీ నెత్తిమీద పడని పాఠశాల, కళాశాల విద్యార్థులు రెండవ వర్గం. రామచంద్రదత్త, మన్‌మోహన్ మిత్ర, సురేంద్రనాథ మిత్ర, కేదారనాథ్ ఛటర్జీ, సురేష్‌చంద్ర దత్త, గిరీష్‌చంద్ర ఘోష్, నాగమహాశయ, మహేంద్రనాథ్ గుప్త ప్రభృతులు మొదటి వర్గమైన గృహస్థ శిష్యులు.

శ్రీరామకృష్ణుల గృహస్థ శిష్యులలో ప్రాధాన్యత వహించిన విశిష్ట వ్యక్తులు ఇద్దరున్నారు.

ఒకరు దుర్గాచరణ్ నాగ్; ఆయన్నే నాగమహాశయ అని పిలుస్తారు. అనేక విషయాల్లో ఆయన ఆ మహాగురువుకు ప్రతిరూపమే! నాగమహాశయకు వివాహమైనా భార్యను జగజ్జననిగా పరిగణించేవాడు. అలా అయినప్పటికీ ఆమెను తన దగ్గరే నివసించనిచ్చాడు. ఆయనకు ఒక ఇల్లు ఉంది. ఆ విధంగా ఆయన నిజమైన గృహస్థు. ఆయన ఆ విధంగా ఉన్నది అనురక్తి ఉండి కాదు. శ్రీరామకృష్ణులు ఆయన్ను ఇంటి వద్దనే ఉండమనటం వల్లా, దాని వల్ల ఆయనకు ఉన్నత ఆధ్యాత్మికానుభవాలు కలుగుతాయని ఆదేశించటం వల్లా, అలా ఉన్నాడు. వైరాగ్యం విషయంలో గాని, అనాసక్తతలో గాని ఆయనతో సముడైన సన్న్యాసి లేడేమో! వృత్తి రీత్యా ఆయన హోమియో వైద్యుడు. ఆ వైద్యవృత్తి మానే వరకు ఆయన వద్దకు అత్యధిక సంఖ్యలో రోగులు వచ్చేవారు. వారు, తనకు అడగకుండా ఇచ్చే పారితోషికం కంటె ఆయన వారికి మందులు వగైరాల రీత్యా ఇచ్చేదే ఎక్కువ. తరచూ రోగులకు మందులు, ఆహారం ఉచితంగా ఇచ్చేవాడు. తన స్వంతానికి

వాడుకొనే వస్తువులను సైతం వారికి ఇచ్చేసేవాడు. ఎవరైనా సంపన్నుడైన రోగి అధిక మొత్తం ఇస్తే మందులఖర్చు పోను, తక్కినది వాపసు తీసుకునే వరకు ఒప్పుకొనేవాడు కాదు. కొంత కాలమైనాక వైద్యవృత్తి విరమించాడు. ఉప్పు ఎగుమతి చేసే వ్యాపారంలో సేవలందించటం వల్ల వచ్చే కొద్ది రాబడితోనే జీవనం సాగించాల్సి వచ్చింది. అతిథులూ, భక్తుల తాకిడి ఎక్కువ కాబట్టి ఆయన సహజంగా అప్పుల్లో పడేవాడు. ఆయన పట్ల గల గౌరవంతోను, ఆయనకు సహాయం చేస్తే, ఆయనకు ఊరికే ఇచ్చినదాని కంటె తమకు వచ్చే లాభం అధికమౌతుందని భావించటంతోను, ఆ ఊరి వర్తకులు ఆయనకు కావలసిన సరకులు వితరణతో ఇచ్చేవారు. తన అతిథులను భగవత్స్వరూపులుగా భావించి వారిని అన్ని విధాల సేవించేవాడు. తాను స్వయంగా వారికి విసురుతూ, వారి అవసరాలను శ్రద్ధగా గమనించేవాడు. ఆయన చాల జబ్బుపడ్డ రోజుల్లో కూడా వారికి భోజనం పెట్టడానికి బజారుకెళ్లి కిరాణా సరుకుల మూటలు నెత్తినమోసుకుని వచ్చేవాడు. ఒకసారి వానాకాలంలో అతిథులకు వంట చెయ్యటానికి ఎండుకట్టెలు నిండుకున్నాయి. కాని వంట చెరకుగా వాడటానికి ఇంటివాసాలు కొన్నిటిని పీకటానికి కూడా ఆయన వెనుకాడలేదు. ఎవరైనా అతిథి విపరీతంగా వాన కురిసే సమయంలో వస్తే, అతనికి వాన కురవకుండా ఉండే ఒక్క గదిని అతిథికి కేటాయించి, తాను గాలికి వానకు ఎరగా వసారాలో రాత్రి కాలక్షేపం చేసేవాడు.

ఆయన ప్రేమ క్రిమికీటకాల పర్యంతం వ్యాపించింది. అందుచేత తన ఇంటి స్తంభాలకు పట్టిన చెదలను కూడా ఎవ్వరినీ దులపనిచ్చేవాడు కాదు. నడిచేటప్పుడు ఏ ప్రాణినైనా, అది ఎంత చిన్నదైనప్పటికీ తొక్కుతానేమో అని అతి జాగ్రత్తగా అడుగులు వేసేవాడు. వస్తుత అణకువ, సాధుస్వభావం ఉన్నవాడైనా తన ఊళ్లో పిట్టలను కొట్టటానికి వచ్చిన ఇద్దరు యూరోపియన్లతో పోరాడి వాళ్ళ తుపాకీని లాక్కున్నాడు. తాను అందరికంటె కిందివాణ్ణని భావించటం వల్ల ఎవ్వరినీ తన సొంత పనిని చెయ్యనిచ్చేవాడు కాదు. ఒకసారి స్టీమరు కిరాయి ఎనిమిది రూపాయలు తీసుకుని కలకత్తాకు బయలుదేరాడు. కాని దార్లో ఒక బిచ్చగత్తె దురవస్థను చూసి, జాలిపడి ఆ డబ్బును ఆమెకు ఇచ్చేసి తాను కాలినడకన ఇరవై ఒక్కరోజులు ప్రయాణం చేసి

కలకత్తా చేరుకున్నాడు. ఉపవాసం చెయ్యటం ఆయనకు పరిపాటి. అనేక రాత్రుళ్ళు జపధ్యానాలలో గడిపి తరచూ సమాధిలో ఉండేవాడు. సర్వత్రా భగవంతుణ్ణి దర్శించే పరిణత ఆధ్యాత్మిక స్థితి ఆయనకు లభించింది. దీని వల్లే అందరిలో నెలకొన్న భగవంతుడికి నమస్కరిస్తూ సదా చేతులు జోడించే ఉండేవాడు. భాగవత పురాణంలో వర్ణించిన సర్వలక్షణ లక్షణోపేతుడైన భాగవతోత్తముడు ఈ నాగమహాశయుడు.

ప్రాధాన్యత వహించిన రెండవ గృహస్థ శిష్యుడు మహేంద్రనాథ్ గుప్త (మ) గా అతడు జగద్విఖ్యాతుడు. శ్రీరామకృష్ణుల వ్యక్తిత్వాన్నీ, ఆయన జీవన విధానాలనూ సన్నిహితంగా లోకానికి తెలియచెయ్యటానికి కారణమైన బెంగాలీ భాషలో రచించబడ్డ 'శ్రీరామకృష్ణ కథామృత' గ్రంథకర్త ఈయన. శ్రీరామకృష్ణులను తాను దర్శించటానికి వెళ్లిన రోజుల్లో, సంక్షిప్త లిపిలో అక్కడ చూసిన దృశ్యాలు, విన్న సంభాషణలు దినచర్య పుస్తకంలో పొందుపరచాడు. దాని ఆధారంతో, ప్రగాఢ ధ్యానంతో కలిగిన స్మృతులతో, శ్రీరామకృష్ణుల మహాసమాధి చెందిన చాలా కాలానికి ఈ అనర్ఘ సంపుటాలను 'మ' ప్రచురించాడు. శ్రీరామకృష్ణుల సందేశాల మీద వచ్చిన అనేక ప్రచురణలు 'మ' గ్రంథం నుండి సంకలనం చేసినవే! ఈ విధంగా కృష్ణుడికి వ్యాసుడు వలె, శ్రీరామకృష్ణులకు 'మ' అని చెప్పవచ్చు. పూర్వ అవతారపురుషుల చరిత్రలు, వారి ఉపదేశాలు కర్ణాకర్ణిగా, కవుల తత్త్వవేత్తల రచనల మూలాన మానవాళికి లభించాయి. శ్రీరామకృష్ణుల యథాతథమైన బోధనలు, విశద వ్యక్తిత్వ చిత్రణ, ఇతరులతో వ్యవహరించిన తీరు తెన్నులు, ఆయన దైనందిని జీవితం గురించి విస్పష్టమైన లేఖాచిత్రణను లోకానికి అందించిన 'మ' ధన్యుడు.

# సన్న్యాస శిష్యులు

మరో వర్గం సన్న్యాసశిష్యులు. ఆయన ఉద్యమానికి వారు వారసులు. వారితో మూలకేంద్రంగా ఏర్పడ్డ సంఘం నేడు సన్న్యాసుల చేత నిర్వహింపబడే రామకృష్ణ మఠం, రామకృష్ణ మిషన్ అనే సన్న్యాస సంప్రదాయంగా వృద్ధి చెందింది. ఇవి శాఖోపశాఖలుగా విస్తరించి శ్రీరామకృష్ణ మహావృక్షమై విరాజిల్లుతోంది. అవి ఆయన ఆధ్యాత్మిక ప్రజ్ఞ చేత నిర్మితమైనవి. ఈ సంస్థలు అనేక శాఖల ద్వారా ఆయన ఆధ్యాత్మిక శక్తితో మానవాళి అంతర్జీవితాల్ని సార్థకం చేశాయి. ఈ సన్న్యాస శిష్యులు పదహారు మంది. వారి ప్రతిభా వైవిధ్యం వ్యక్తిత్వ రూపాలు శ్రీరామకృష్ణుల ఆధ్యాత్మిక అసాధారణ ప్రతిభ దశలంత విస్తృతమైనవి. స్వామి వివేకానందలో (నరేంద్రనాథ్) ప్రపంచ మతచరిత్ర మీద ప్రభావం చూపిన ప్రవక్తను, జగద్గురువును; స్వామి బ్రహ్మానందలో (రాఖాల్) సదా ఆత్మచైతన్యంలో ఉన్నా సన్న్యాస సంఘ కార్యనిర్వహణలో ఎదురయ్యే క్లిష్ట సమస్యలను పరిష్కరించే బహుముఖ ప్రజ్ఞను; స్వామి ప్రేమానందలో (బాబూరాం) గొప్ప విశ్వాసం, ప్రేమ, సరళ వ్యక్తిత్వాన్ని; స్వామి యోగానందలో (యోగేన్) రూపు దాల్చిన వైరాగ్యం, అనాసక్తతను; స్వామి నిరంజనానందలో (నిరంజన్) అప్రతిహతమైన విశ్వాస సాహసాల్ని; స్వామి తురీయానందలో (హరి) నైష్టికత్వంచే శరీర స్వాధీనత, లోకవ్యహారాలకు దూరంగా వున్నా ప్రేమపూరితమైన తోటమానవుల పట్ల సమభావనలు గల గంభీర వేదాంత సన్న్యాసిని; స్వామి శివానందలో (తారక్) భక్తిజ్ఞాన పరిమళాలతో పరివేష్టించిన ఆధ్యాత్మికశక్తి, మానవ సంక్షేమం పట్ల ఆరాటాన్ని; స్వామి రామకృష్ణానందలో (శశిభూషణ్) గురుసేవే తన తపస్సుగా చేసుకున్న పండిత – భక్తుణ్ణి; స్వామి అభేదానందలో (కాళి) తన జీవితంలో శ్రేష్ఠభాగాన్ని పాశ్చాత్య దేశాల్లో వేదాంత ప్రచారం గావించిన పండిత సన్న్యాస ప్రచారకుణ్ణి; స్వామి త్రిగుణాతీతానందలో (శారద ప్రసన్న) మాతృదేవి సేవే జీవితపరమావధిగా ప్రతిన బూనిన ప్రేమమూర్తిని; స్వామి అద్వైతానంద (పెద్ద గోపాల్) గొప్ప వివేకం, ఆచరణాపరత్వాన్ని; స్వామి అఖండానందలో

(గంగాధర్) మానవుడిలో మాధవుణ్ణి సేవించే వ్యక్తిత్వం గల మనన శీలిని, నిర్భయ యాత్రికుణ్ణి; స్వామి శారదానందలో (శరత్) తొట్రుపాటు లేని స్వభావం, సంఘ బాధ్యతలను నిర్వహించే మహత్తర శక్తి గల విద్వత్సన్న్యాసిని; స్వామి అద్భుతానందలో (లాటూ) గ్రామీణ గొర్రెలకాపరి స్థాయి నుండి పూర్ణజ్ఞానిగా మారిన సన్న్యాసిని; స్వామి సుబోధానందలో (సుబోధ్) వివేకవంతుడైనా ఎప్పుడూ బాలక స్వభావం గలవాడిని; స్వామి విజ్ఞానానందలో (హరిప్రసన్న) విజ్ఞాన శిఖరాలను అధిరోహించిన విజ్ఞానియైనా, పసిబిడ్డ అమాయకత్వాన్ని పాటించిన వ్యక్తిని గాంచుతాం.

ఈ శిష్యుల్లో ముఖ్యంగా ఇద్దరిని గురించి ప్రత్యేకంగా ప్రస్తావించాలి. వారు స్వామి శారదానంద, స్వామి వివేకానంద. స్వామి శారదానంద 'శ్రీరామకృష్ణ లీలా ప్రసంగ' మనే బృహద్గ్రంథ (వంగభాషలో) రచయిత. శ్రీరామకృష్ణుల జీవితంలోని అన్ని వివరాలకు అది మూల గ్రంథం. మౌలిక పరిశోధనలూ, సమకాలీనుల సాధికారిక సాక్ష్యాల ఆధారంగా రచించబడటం వల్ల అది సప్రామాణిక గ్రంథమైంది. కాలక్రమానుసారంగా శ్రీరామకృష్ణుల జీవితంలోని ముఖ్య సంఘటనలన్నీ సవిస్తరంగా దాన్లో చోటుచేసుకున్నాయి. అది జీవిత చరిత్ర గ్రంథమే కాక, 'భావముఖ' మనే గురుదేవుడి మానసికస్థితిని సవిరంగా తెలియచేస్తూండటంతో అదొక మానసికశాస్త్ర అధ్యయన గ్రంథం కూడా. శ్రీరామకృష్ణ కథామృతం మాదిరి ఈ గ్రంథం కూడా రాబోయే తరాల వారికి శ్రీరామకృష్ణులను సజీవ సత్యంగా చూపిస్తుంది.

మరొకరు స్వామి వివేకానంద (నరేంద్రుడు), శ్రీరామకృష్ణ శిష్యవర్గంలో అత్యంత ప్రాధాన్యత వహించిన జగద్విఖ్యాతుడు. శ్రీరామకృష్ణుల జీవితంలో ఈయన ప్రాముఖ్యత అంచనా వేయలేనిది. శ్రీరామకృష్ణుల అనుభూతులకు ఒకరీతిలో స్వామి వివేకానంద గీటురాయి. అతడు హేతువాదిగా విజ్ఞాన, తత్త్వశాస్త్రాలను అధ్యయనం చేశాడు. హైందవ జీవన సరళిని, ఆరాధనలను వ్యతిరేకిం చాడు. అతడు శ్రీరామకృష్ణుల వద్దకు వెళ్ళి, "మీరు దేవుణ్ణి చూశారా?" అని ప్రశ్నిస్తూ వచ్చాడు. "నేను చూశాను. నిన్ను చూస్తున్న దాని కంటె విస్పష్టంగా

భగవంతుణ్ణి చూస్తున్నాను. నా ఆదేశాలను అనుసరిస్తే భగవంతుణ్ణి దర్శించటంలో నీకు కూడా తోడ్పగలను" అనే జవాబు అతడికి లభించింది.

సవాలు చేస్తున్న ప్రశ్నకు తిరుగులేనట్లు ఇచ్చిన ఈ జవాబు, ఉరకలు వేస్తున్న నరేంద్రుణ్ణి శ్రీరామకృష్ణుల పాదాక్రాంతుణ్ణి చేసింది. 'నిరసించటానికి వచ్చినవాడు, అర్చించటానికి నిలబడిపోయాడు' అనే దానికి ఇదొక సోదాహరణం. శక్తివంతమైన మేధ, మనోస్థైర్యం ఉన్న ఈ యువకుడు శ్రీరామకృష్ణుల దివ్యత్వానికి, ఆయన నిస్వార్థ ప్రేమకు లొంగిపోయాడు. నరేంద్రుడు తను నమ్మకుండా దేన్నీ అంగీకరింపని స్వభావియైనందు వల్ల, ఈ మార్పు నిదానంగా జరిగింది. గుడ్డిగా అతడు దేనినీ అంగీకరించడు. అందువల్ల నిరంతరం శ్రీరామకృష్ణులతో పోరాడుతూనే వచ్చాడు. వాదంతో కాక వికాసం చెందిన తన వ్యక్తిత్వ ప్రభావంతో, చెప్పనలవి గాని ప్రేమతో శ్రీరామకృష్ణులు అతణ్ణి జయించారు. ఆయన ఇచ్ఛామాత్రాన నరేంద్రుడి చిత్తవృత్తిని ఉన్నతస్థాయికి పెంచి, 'ఉన్న సర్వం ఒక్కటే' అనే ఎరుకను అతడిలో చొప్పించారు. ఆరంభంలో అద్వైతాన్ని నిరసించే నరేంద్రుడు, తదుపరి దాన్ని ప్రతిపాదించే ఆధునికుల్లో సుప్రసిద్ధుడైనాడు. అదే విధంగా కాళికాదేవితో సహా హైందవ దేవతలందరినీ తూలనాడే నైజం నరేంద్రుడికి ఉండేది. విగ్రహారాధనను గురించి తీవ్ర విమర్శలు చేసేవాడు, కాని తరువాత శ్రీరామకృష్ణుల సాంగత్యం వల్ల, పూర్తిగా హైందవ సంస్కృతి పరిరక్షకుడి పాత్రను చేపట్టాడు.

ప్రతి విషయంలోనూ విమర్శనాత్మక దృష్టి, పరిశీల నాత్మక ధోరణి కలిగిన నరేంద్రుడు, శ్రీరామకృష్ణులను తన గురువుగా, సర్వస్వంగా అంగీకరించడం అనే విషయాన్ని గ్రహిస్తే; తద్వారా శ్రీరామకృష్ణుల జీవితాన్ని కచ్చితంగా అర్థం చేసుకోటంలో మనకు విశేషంగా తోడ్పడుతుంది. శ్రీరామకృష్ణులకున్న శక్తి ఆయన పాండిత్యంలో గాని, సంపదలో గాని, సంస్థాపకశక్తిలో గాని లేదు. ఆయన నిరంహంకారి, శిశువు వంటి నిరాడంబరుడు. ఆయన శక్తి పూర్తిగా నిస్వార్థ ప్రేమలోను, అత్యున్నతమైన వివిధ ఆధ్యాత్మిక అనుభవాల్లోను ఉంది. నేడు ఆధ్యాత్మిక అనుభూతులనేవి వ్యక్తిపరమైన ఊహాజనితాలు గానో, లేక అవి మతిభ్రమణలే అని

విమర్శించేవారు కొందరు లేకపోలేదు. అలాంటి విమర్శకులు ఈ క్రింది ప్రశ్నకు సమాధానం చెప్పవలసి ఉంది –

"కుమ్మరివాడు మట్టితో కుండలు మలచినంత సులువుగా, దృఢచిత్తుడైన నరేంద్రుడి మనస్సును మలచి, అతడు ఏ విషయాలను గురించి తీవ్రంగా విమర్శించేవాడో తిరిగి ఆ విషయాలనే ధాటితో ప్రచారం చేసే వ్యక్తిగా శ్రీరామకృష్ణులు ఎలా మార్చ గలిగారు?" అనేదే ఆ ప్రశ్న.

"కుమ్మరివాడు మట్టితో కుండలు మలచినంత సులువుగా, దృఢచిత్తుడైన నరేంద్రుడి మనస్సును మలచి, అతడు ఏ విషయాలను గురించి తీవ్రంగా విమర్శించేవాడో తిరిగి ఆ విషయాలనే ధాటితో ప్రచారం చేసే వ్యక్తిగా శ్రీరామకృష్ణులు ఎలా మార్చ గలిగారు?" అనేదే ఆ ప్రశ్న.

# శిష్యురాళ్లు

శ్రీరామకృష్ణులకు అనేక శిష్యురాళ్ళు కూడా ఉన్నారు. ఆయన మాటిమాటికి కామినీ – కాంచన బంధాన్ని గురించి బోధించినప్పటికీ, స్త్రీల పట్ల ఆయనకు అమిత గౌరవభావం ఉంది. స్త్రీ లందరిని జగజ్జనని స్వరూపాలుగా భావించేవారు. శ్రీరామకృష్ణులు విగతకాములు కాబట్టి ఆయన సహచర్యంలో స్త్రీలు ఎలాంటి ఇబ్బందికీ లోనయ్యే వారుకారు. ఆయన స్త్రీ శిష్యులలో పండితురాలైన గౌరీమాని, మార్మికురాలైన యోగిన్ మా ని, నిర్భయురాలైన గోలాప్ మాని, గోపాలుని తల్లిగా ఖ్యాతి చెందిన అఘోరమణిని ముఖ్యంగా పేర్కొనవచ్చు. గృహస్థ శిష్యుల్లో నాగమహాశయుని మాదిరి, అఘోరమణిని గురించి ప్రత్యేకంగా ప్రస్తావన చెయ్యాలి. లౌకికస్థాయిలో ఆమె బాలవితంతువు. యావత్తు జీవితం బాలగోపాలుడి జపంలో గడిపింది. శ్రీరామకృష్ణుల సాహచర్యంలో ఆమె ఆధ్యాత్మిక జీవితం ఫలవంతమైంది. ఆమె శ్రీరామకృష్ణులను 'కృష్ణుడు' గా గాంచినప్పటి నుండి ఆయన్ను 'గోపాలా' అని పిలిచేది. ఆమె బాలగోపాలుడి సాక్షాత్కార కథ, భావసమాధిలో అతనితో గల ఆమె వాత్సల్య భావం, ఈ కలికాలంలో కట్టుకథలా తోస్తుంది.

శిష్యురాళ్ళలో ప్రముఖంగా కనిపించేది ఆయన సన్న్యాసిని – భార్యయైన శారదాదేవి. ఆమె మాతృదేవి అని పిలువబడేవారు. ఆమె దక్షిణేశ్వరానికి ఏతెంచినప్పటి నుండి జపధ్యానాలు చెయ్యటంతో పాటు, శ్రీరామకృష్ణులను సేవిస్తున్న వారికి వార్చి వడ్డించటంలో ఎక్కువ సమయం గడిపేవారు. శ్రీరామకృష్ణులకు, ఆయన శిష్యులకు అలుపు లేకుండా సేవచెయ్యటమే ఆమె పని. దక్షిణేశ్వరంలో ఆమె నివాసం స్త్రీ భక్తురాళ్లకు ఎంతో తోడ్పాటు అయ్యింది. శ్రీరామకృష్ణుల నిర్యాణానంతరం వారిలో అధికులు ఆధ్యాత్మిక సహాయం కోసం ఆమెతో సాంగత్యం చేసేవారు. ఆయన తదనంతరం గురుత్వ బాధ్యత ఆమె మీద పడింది. ఉపదేశాలు ఇవ్వటంలోను, శ్రీరామకృష్ణుల సన్న్యాసశిష్యుల మీద పడ్డ బాధ్యతాయుతమైన ఉద్యమ నిర్వహణలోను ఆమె కొండంత అండగా నిలిచారు.

# గురుదేవుల ఆధ్యాత్మిక భావప్రచారం

శ్రీరామకృష్ణుల జీవితం కేశవచంద్రసేన్ మూలంగా జనబాహుళ్యానికి పరిచయమైన విషయానికి వద్దాం. క్రమంగా ఆయన్ను సందర్శించేవారి సంఖ్య పెరుగుతూ వచ్చింది. అలా వచ్చిన వారిలో, పైన వివరించినట్లు, సన్నిహిత శిష్య, భక్త బృందం రూపొంది ఆయన్ను పరివేష్టించింది. అత్యున్నతమైన ఆధ్యాత్మికాదర్శం వైపుగా వారి జీవితాలను మలచటంలో ఆయన శేష జీవితం గడిచింది. ఆయన వారికి బోధించిన విధానం, వారితో ఆయనకు గల సంబంధం ఎన్నో విషయాల్లో అనుపమాన మైనవి. అహంకారభావంతో ఆయన వారికి బోధించలేదు. అహంకార గంధమే లేని వినమ్రుడై, తన సర్వస్వాన్ని ఆయన జగజ్జననికి అప్పగించారు. తన అహంకారాన్ని పూర్తిగా భగవంతుడికి సమర్పించటం చేతనే గురుశక్తి (భగవంతుడి పరిత్రాణశక్తి) అనేది, ఆయన మనో వాక్కాయాల ద్వారా ప్రకటితమై, తన ప్రభావంలోకి వచ్చిన వాటినన్నింటినీ పవిత్రీభూతం, వికాసవంతం చేసింది.

ఆయన మహోన్నత సందేశాలు వ్యక్తిగతంగా పరిచయ స్థులైనవారికి ఇవ్వబడ్డాయి. ఆలకించే వారి మీద ఆయన వాక్కు చెరగని ముద్రవేస్తుంది. ఇది ప్రసంగాలూ, ఉపన్యాసాల వల్లా, ధర్మశాస్త్ర వ్యాఖ్యానం వల్లా జరిగింది కాదు. సెలవు రోజుల్లో ఆయన సాహచర్య భాగ్యాన్ని కోరి భక్తులు గుంపులు గుంపులుగా ఆయన గదిలో గుమిగూడే వారు. అప్పుడు వారితో లాంఛనప్రాయంగా సంభాషిస్తూ, ఒక్కొక్కప్పుడు ప్రశ్నలకు జవాబులిస్తూ, కొన్నిసార్లు అప్పటి కప్పుడు తన అనుభవాలను, భావనలను సెలవిచ్చేవారు. లౌకిక సంభాషణలను, సామాజిక వార్తలను తన దరి చేరనిచ్చేవారు కాదు. ఆయన దివ్యసన్నిధిలో ఆ విషయాల ప్రసక్తి తేవటానికి ఎవరూ సాహసించే వారు కూడా కాదు. ఆయన నోటి నుండి వచ్చిన ప్రతి మాటా భగవంతుణ్ణి గురించినదే! భక్తికి చెందినదే! ఆ పలుకులు ఆయన అనుభవాల నుండి జాలువారినవి కాబట్టి, ఆలకించే వారి హృదయాలకు హత్తుకుపోయేవి. మధ్యమధ్యలో ఆయన ఆలాపించే మనోజ్ఞమైన పాటలు, భక్తితత్పరతలో చేసే నృత్యాలు, అప్పుడు కలిగే భావసమాధులు, ఆ సమాధి

సమయాల్లో అక్కడ చేరిన వారికి గోచరించే ఆయన తేజోవంతమైన ముఖం, అక్కడ వారిని ఆధ్యాత్మికానందంలో పులకాంకితులను చేసే శక్తిప్రసరణలు ఆయనలోని ప్రత్యేకతలు. ఆ రకమైన దృశ్యాలు దక్షిణేశ్వరంలోని ఆయన గదిలోనే కాక, ఆయనను కలకత్తాకు ఆహ్వానించిన భక్తుల ఇళ్లలో కూడ కానవచ్చేవి. ఆ సమయాల్లో అక్కడ చేరిన ప్రతి ఒక్కరూ యథార్థమైన ఆధ్యాత్మిక సంతర్పణలో పాల్గొనే వారు. శ్రీరామకృష్ణ కథామృత పుటల్లో ఆయన బోధనా పద్ధతిలోని ఈ విలక్షణత్వం కోకొల్లలుగా కనిపిస్తుంది. వ్యక్తులతోను, బృందాలతోను ఆధ్యాత్మిక జీవితానికీ సంబంధించిన విషయాల ప్రస్తావనలతోను ఆయన సమయం గడిచిపోయేది. భక్తుల ఇళ్లలో ఉత్సవాలు జరిగే సమయాల్లో తప్ప, ఆయన దక్షిణేశ్వరం నుండి కదల నప్పటికీ తన అమూల్యమైన ఆధ్యాత్మికానుభవాలను మాటల ద్వారాను, అనురాగపూరితమైన సాంగత్యం ద్వారాను పాలుపంచు కొనేవారు. కాబట్టి ప్రచారకులమని చెప్పుకునే అనేకుల కంటె, ఆయన గొప్ప ప్రచారకులు. మామూలు పద్ధతుల వంటిది కాకపోవటం, గంభీరత, చమత్కారం, ఉదాత్తత, సామాన్యత కలిసిపోవటం అనేవి ఆయన విధానంలోని మరో ప్రత్యేకత. ఆనందానికి, ఉత్సాహానికి ఆయన కేంద్రం. ఆయన మాటల్లోను, సాంగత్యంలోను విసుగు జనించే బోధలు, వేరే ప్రపంచానికి చెందిన దిగజారుడు మాటలు ఉండవు. ఆయన చుట్టూ నిత్యం అక్కడ చేరిన వారికి స్ఫూర్తి, వినోదం, ప్రబోధం ఊరట కలిగించే దృశ్యాలు ప్రదర్శితమయ్యేవి. తన్మయుడై భక్తి గీతాలు పాడుతూ భగవన్నామానందంలో నృత్యం చేసేవారు.

శిష్యులుగా అంగీకరించటానికి ముందు, వారిని అనేక సునిశిత పరీక్షలకు గురిచేసి వారి వ్యక్తిత్వాన్ని పూర్తిగా అవగాహన చేసుకొనేవారు. వారి భౌతిక లక్షణాలను పరిశీలించి వారి ప్రవృత్తిని సంశోధించేవారు. ఈ కళలో ఆయనది అందెవేసిన చెయ్యి. ఏమరుపాటులో వారు చేసే చిన్న చిన్న పనులను, బోధనలను గురించిన వారి కవళికలను గమనించేవాడు. వీటితోపాటు కొన్నిసార్లు మానవుల్లోని అంతర్యాన్ని గ్రహించటానికి, తన యోగ శక్తులను వినియోగించటం గాని, వారి మనోగత విషయాలను వారే వెల్లడించేటట్లు వారినొక రకమైన అచేతనావస్థలోకి తీసుకుపోవటంగాని చేసేవారు.

తాను శిష్యులుగా అంగీకరించిన వారిని, వారు తమ తలిదండ్రుల నుండి కూడా ఎన్నడూ పొందని ప్రేమాను రాగాలతో తనవారినిగా చేసుకొనేవారు. వారికి బోధించటం లోను, వారు తన బోధనలను ఎంతవరకు ఆచరణలో పెట్టారో చూడ్డంలోను, ఆయన ఎంతో శ్రమ తీసుకొనేవారు. వారిలో ఏదైనా దుష్టసంస్కారం కానవస్తే, ఇచ్ఛామాత్రంగానే దాన్ని తొలగించి, వారికి అత్యున్నతమైన ఆధ్యాత్మిక అనుభూతులు ప్రసాదించేవారు. దివ్యప్రేమ, పవిత్రత, జాజ్వల్యమైన తన వ్యక్తిత్వం చేత, శిష్యుల ఆధ్యాత్మిక జీవితానికి బలాన్ని, స్థైర్యాన్ని ప్రసాదించారు. ఆయన ఎన్నడూ వాదోపవాదాలకు దిగలేదు. శుష్క ప్రసంగాలు చెయ్యలేదు. ఆధ్యాత్మిక విషయాల మీద తన నిశ్చిత అభిప్రాయాలను వినమ్రతతో శ్రోతల ముందుంచి, వారి సమర్థత మేరకు అవగాహన చేసుకుని, ఇష్టం వచ్చిన దాన్ని సమ్మతించే విషయం వారికే విడిచి పెట్టేసేవారు. ఎవరి మీదా ఆయన తన అభిప్రాయాలను రుద్దలేదు. తన శిష్యుల్లో విమర్శనాత్మక మనస్కులైన కొందరికి తన బోధనలను విమర్శించటానికి పూర్తి స్వేచ్ఛనిచ్చి, ఆయన వారిని పరీక్షకు గురి చేసినట్లుగా, తానూ వారి పరీక్షలకు గురి అవటానికి అవకావం ఇచ్చారు. అలాంటి ఆయన స్వభావం శిష్యుల మన్ననలను పొందింది గాని, అసంతృప్తిని ఎన్నడూ కలిగించ లేదు.

వివిధ రకాలవారికి, విభిన్న మానసిక స్థితులున్న వారికి అందుబాటుగాను, ఆసక్తిదాయకుడుగాను ఉండే అద్భుతశక్తి ఆయనకుంది. తన విజ్ఞాన ఆధిక్యంచేత శశిధరపండితుడు, ఈశ్వరచంద్ర విద్యాసాగర్ వంటి సుప్రసిద్ధులను చకితులను చెయ్యగలిగారు. నిరక్షరాస్యులైన గ్రామీణ స్త్రీల హృదయ గాయాలు మాన్పటానికి, వారి సామాన్య సందేహాలను నివృత్తి చెయ్యగల బౌద్ధికస్థాయికి ఆయన దిగగలరు. తాను శిష్టాచార హైందవ జీవన సంప్రదాయాల్లో ఉన్న వారైనా, ఆధునిక వైజ్ఞానిక సామాజిక ఆదర్శాలు ఏమాత్రం తెలియని వారైనా, సంస్కరణ హేతువాదాల్లో నిష్ణాతులైన వారి ఆశయాలను, ఆదర్శాలను మెచ్చుకుని సానుభూతి చూపించ గలిగారు. అందువల్ల ఆయన సాహచర్యంలో విశ్వనాథ ఉపాధ్యాయ–కేశవ చంద్రసేన్‌లు, నరేంద్రనాథ్–నాగ మహాశయులు, డా ॥ మహేంద్రలాల్ సర్కార్–గిరీశచంద్ర ఘోష్‌లు సౌహార్ధతతో ఉండగలిగారు. పరస్పర విరుద్ధ మత సంప్రదాయాలను

సాధన చేయడం వల్ల, భావముఖ స్థితిలో నెలకొని ఉండటం చేత, అద్వితీయ సామరస్య స్థితిలోని ఆయన మనస్సు సువిశాలమైన ఆయన సహానుభూతి; విభిన్న దృక్పథాలు, మానసిక స్థితులు ఉన్న మానవులకు గురువుగా ఉండటానికి తగి ఉంది. నిజానికి ఆయన విశ్వజనీనులు. మానవుల్లో అత్యంత విశిష్ట వ్యక్తిత్వం గలవారు కూడా!

గురుశిష్యుల నడుమ ఉండే ఆనవాయితీ లక్షణాలేవీ ఆయన వద్ద లేవు. తన బోధనలనందుకున్న వారి నుండి అధిక గౌరవాన్ని కూడా ఆయన ఆశించలేదు. అన్యోన్యమైన కుటుంబంలోని సభ్యుల్లాగా, శిష్యులు ఆయనతో మెలగే వారు. స్వంత తలిదండ్రుల కంటే ఆయన వారికి ప్రీతి పాత్రుడుగా ఉండేవారు. ఏ ప్రత్యేకమైన పద్ధతిని గాని, సంప్రదాయాన్ని గాని వారికి బోధించలేదు. మానవులకు మానవ వ్యక్తిత్వం, ప్రపంచతత్వం ఏమిటో తెలుసుకునే దృష్టిని ప్రసాదించటమే ఆయన చేసిన పని. అలా చెయ్యటానికి ఆయన మామూలు బోధల మీద, ప్రసంగాల మీద కాక; ప్రియమైన పరిచయాల మీద, ప్రకృతి నుండి గ్రహించిన ఉదాహరణల మీద, నిగ్రహమైన పవిత్రజీవితం మీద, అన్నిటి కంటె ప్రధానంగా జపధ్యానాల మీద ఆధారపడ్డాడు. ఆధ్యాత్మిక లక్ష్యాలు సాధించటానికి సత్య వాక్య పరిపాలనం, బ్రహ్మచర్యం అత్యంతావశ్యకాలని ఆయన నొక్కివక్కాణించారు.

అవతారమంటే మానవత్వ దివ్యత్వాల కూడలి స్థానం అనీ; ఒకసారి ఒక లక్షణం, మరొకసారి రెండవ లక్షణం వ్యక్తమాతుంటుందని లోగడే తెలుసుకున్నాం. విశ్వ గురువైన శ్రీరామకృష్ణుల జీవిత ప్రారంభదశలో దివ్యత్వం కంటే మానవత్వ లక్షణం ప్రస్ఫుటంగా గోచరించినదని కూడా లోగడే తెలుసుకున్నాం. గురుభావం ప్రారంభం నుండి భక్తులతోను, శిష్యులతోను గల ఆయన సంబంధంలో దైవత్వ లక్షణం ప్రస్ఫుటం కాసాగింది. ఇతరులు సాధించటానికి అనేక జన్మలు పట్టే అనుభవాలను, ఆయన స్పర్శతోను, ఒక్క సంకల్పంతోను ఆయన ప్రధాన శిష్యులు సాధించారు. ఇచ్ఛామాత్రంగానే వివేకానందుడిలో సంశయ మేఘాలను పారదోలి, చైతన్యం యొక్క ఏకత్వాన్ని అతడికి అనుభూతం చేశారు.

ప్రతిభాశాలియైనా విచ్చలవిడిగా తిరిగే గిరీశచంద్ర ఘోష్‌ను పరిపూర్ణంగా పవిత్రుణ్ణి చేశారు. మన్మథనాథుడనే దుండగుడికి ఒక్కక్షణంలో జ్ఞానోదయం కలిగించారు. అతగాడు తన చరమ జీవితాన్ని 'ప్రియనాథ' నామస్మరణలో గడిపాడు. శ్రీరామకృష్ణుల శిష్యుల్లో అనేకులకు ఎప్పుడో ఒకప్పుడు వారి స్వభావంలో పతనావస్థలు ఎదురైనప్పుడు, ఆయన శుభాశీస్సులు వాటిని తుడిచివేసి, వారు ఆధ్యాత్మిక శిఖరాలను అధిరోహించటానికి తోడ్పడ్డాయి. ఆయన తన ఆత్మ విభూతిని ప్రదర్శించిన రెండు ముఖ్యసంఘటనలు ఉన్నాయి. ఆయన దివ్యసన్నిధానంలో ఆయన నుండి ఉత్పన్నమైన శక్తి ప్రభావంతో అనేకులకు ఒకేసారి ఉన్నత ఆధ్యాత్మికానుభవాలు కలగటం వాటిలో ఒకటి. ఈ విషయం మరొక చోట సవివరంగా వర్ణించబడింది. మరొకటి ఆయన సాధారణ స్థితిలో ఉన్నప్పుడు వినమ్రులకు వినమ్రునిగా ఉన్నప్పటికీ దివ్యస్వభావం ఆవహించినప్పుడు ఆయన పూర్తిగా కొత్తవారయ్యే వారు. అప్పుడు ఒక మహత్తరశక్తి ఆయన నుండి ఉత్పన్నమై ప్రపంచదృష్టిలో గొప్పవారుగా పరిగణింపబడేవారు, ఆయన ముందు అల్పులై కనబడే వారు. అంతకంటె గొప్ప ఏమంటే, ఒక్కక్షణంలో ఆయన భక్తుల చైతన్యాన్ని జాగృతం చేసి వారి ఇష్టదేవతా దర్శనం గాని, లేక వారి వారి ఆధ్యాత్మిక ప్రయత్నంలో సాఫల్యతను గాని కలిగించేవారు.

ఆయన విధానాల్లోని మరో ప్రత్యేక లక్షణం – అసాంప్రదాయికత, గంభీర చమత్కారాలు; ఉదాత్త సామాన్యతలు కలబోసినట్టిది. ఆయన బహుముఖ ప్రతిభా వంతుడవటంతో, సమయానుకూలంగా తన స్వభావాన్ని మార్చుకుని, దగ్గరకు వచ్చినవారిని ఉత్తేజపరిచి, ఆనందింప చేసి, బోధించి ఊరడించ గలరు. తన్మయులై భక్తిగీతాలు పాడి, దేవీనామాన్ని ఉచ్చరిస్తూ నృత్యం చేసేవారు. ఆ పిమ్మట క్లిష్టమైన తత్త్వరహస్యాలను, భగవంతుడి సగుణ నిర్గుణాల మధ్య సంబంధాన్ని గురించి గాని, భగవంతుడి సృష్టిలో మంచితో పాటు చెడు ఉండటం ఎలా సాధ్యమో మొదలైన నైతిక విషయాలను గురించి గాని, అతిసులువుగా వివరించేవారు. పరతత్త్వ విజ్ఞాన భావాల నుండి సులభంగా దిగి వచ్చి లౌకిక విషయాచరణంలో చక్కని సలహాలను ఇచ్చేవారు. సరళ స్వభావుడైన యోగేన్‌కు బజారులో వస్తువులు ఎలా బేరం

చెయ్యాలో కూడా బోధించారు. ఉరకలేత్తే ఉద్రేక స్వభావం గల నిరంజనుణ్ణి అదుపులో ఉంచారు. స్త్రీల పట్ల ద్వేషం వహించే వారికి (స్వామి తురీయానంద) స్త్రీల పట్ల ఎలా దయతో మెలగాలో తెలిపారు. ఏకైక కుమారుణ్ణి కోల్పోయిన మణిమల్లిక్‌ను ఓదార్చారు. తన భార్యాపిల్లలను నిర్లక్ష్యం చేస్తూన్నందుకు ఒక భక్తుణ్ణి తీవ్రంగా మందలించారు. ఆయన తన బోధనలను, వేదాంత విషయాల్లోగాని, భక్తి విషయాల్లోగాని, నడవడిక విషయాల్లోగాని హాస్యవచనాలతో హృదయానికి హత్తుకునేట్లు గ్రామీణ బెంగాలీ భాషలో నీతిబోధలతో పొదిగి, మధురస్వరంతో, ఆహ్లాదకరంగా మధ్యమధ్య వచ్చే నత్తితో ప్రవచించేవారు. దాసానుదాసులయ్యే విధానాలు, మరెన్నో ప్రాపంచిక విషయాలు, వ్యంగ్య చిత్రణలు వినిపిస్తూంటే వినేవాళ్లు పొట్టలు చెక్కలయ్యేట్లు నవ్వేవాళ్లు. ఈ విషయాలు ఆయనకున్న పరిశీలనాశక్తిని, ఆరోగ్య వంతమైన విమర్శనా శక్తిని తెలుపుతాయి. [ఈ ఆట పాటల మధ్యలో ఏ స్వల్ప సూచన మేరకు కూడా ఆయన మనస్సు ఉన్నత ఆధ్యాత్మిక స్థితుల కెగిసి, భక్తితో తన్మయుడవటం కాని, గాఢ సమాధిలో మునిగిపోవటం గాని జరిగేది.] అప్పుడక్కడ గుమిగూడిన వారి మీద ఆ ఉదాత్త భావాల ప్రభావం సోకేది.

తన్మయత్వం, భక్తితత్పరతల మధ్యలో జీవన సునిశిత విషయాల పట్ల ఆయనకున్నంత జాగ్రత్త ఏ కొద్ది మందికో గాని ఉండదు. శరీర పారిశుద్ధ్య విషయంలో గాని, ఆయన గదిలో వస్తువుల క్రమమైన అమరికలో గాని, ఆయనెంతో కచ్చితంగా ఉండేవారు. చిరిగిన దుస్తులతో గాని, చెప్పులతో గాని రావటం, ఇంట్లో సరిగ్గా దీపాలు పెట్టక పోవటం ఆయనకు ఇష్టం ఉండేది కాదు. ఎవరి వద్దకైనా వెళ్లేటప్పుడు తనకు అవసరమైన వస్తువులను వెంటగొని పోయేవారు. మనం ఎక్కడికైనా వెళ్లేటప్పుడు ఆ ఇంటివారికి అసౌకర్యం కలిగించే విధంగా గాని, ఇబ్బంది కలిగించే సమయాల్లో గాని వెళ్లరాదని ఆయన శిష్యులకు సలహా ఇచ్చేవారు. ఆయన జీవితంలో, ఎక్కడికెళ్ళినా అక్కడాయన గొడుగు, చెప్పులు, దుస్తులు మొదలైన తన వస్తువులను మరచిపోయి వదలివెయ్యటం అనేది ఉండకపోవటం గమనించ దగ్గ విషయం! సమాధి స్థితి కలుగుతున్నా, తన్మయత్వంలో ఉన్నా, ఆయన ఒక గదిలో ప్రవేశిస్తే పరిశీలాత్మకమైన ఒక్క చూపుతో, తనతో

వచ్చిన వారెవరూ గ్రహించలేనంత జాగ్రత్తగా, అక్కడి వస్తువులను, వ్యక్తులను పరికించగలిగేవారు. ఆయన ఇంద్రియాలకంత చురుకైన శక్తి ఉండేది.

# గొంతులో వ్యాధి

1885 వ సంవత్సరం వేసవి ప్రాంతంలో ఆయనకు గొంతులో మంట పుట్టటంతో పాటు నొప్పి కూడా ఉండటంతో, ఉపశాంతికి తరచు మంచుగడ్డలు తీసుకో వలిసి వచ్చింది. వైద్యులు దాన్ని ప్రచారకులకు వచ్చే గొంతు నొప్పిగా నిర్ణయించి, ఎక్కువగా మాట్లాడటం, పాడటం, భావసమాధుల వల్ల కలిగిందన్నారు. కాని ఆ పనులు మానటం అనేది ఆయన వల్ల అయ్యే పని కాదు. బోధ చెయ్యటం, ఆధ్యాత్మిక రుగ్మతలను నివారించటమే ఆయన జీవిత ప్రయోజనం. అందుచేత అనారోగ్యం గాని, మృత్యువు గాని ఆయన్ను తన ఆధ్మాత్మిక ఉద్యమం నుండి విరమింప చెయ్యలేవు. తన హృదయంలో నుండి పెల్లుబుకుతూన్న బోధిసత్త్వుడి ప్రేమ, “అజ్ఞానంలో కొట్టుమిట్టాడుతున్న ఒక్క జీవుణ్ణి తాను ఉద్ధరించగలిగితే అనేక జన్మల పర్యంతమైనా బాధపడటానికి సంసిద్ధంగా ఉన్నా” నని ఆయన చేత బహిరంగంగా ప్రకటింపచేసింది. అందుచేత వైద్యుల హెచ్చరికలు పెడచెవినపడ్డాయి.

ఆ వేసవిలోనే ‘పానిహాటి’ లో జరిగే ఉత్సవంలో పాల్గొని ప్రజాసమూహం మధ్య పాడుతూ తన్మయంతో నృత్యం చేశారు. దానితో వ్యాధి ఉధృతమై అప్పుడప్పుడు గొంతులో నుండి రక్తం రావటం కూడా మొదలైంది. అది క్యాన్సర్‌గా నిర్ధారించబడింది. దక్షిణేశ్వరంలో సరైన వైద్య సదుపాయాలు లేనందున, భక్తులు శ్రద్ధతో 1885 అక్టోబర్‌లో కలకత్తాలోని శ్యాంపుకూర్ అనే పేటలో ఒక అద్దె ఇంట్లో ఆయన్ను ఉంచి, సుప్రసిద్ధ వైద్యుడైన మహేంద్రలాల్ సర్కార్ వద్ద హోమియోపతి వైద్యం చేయించ సాగారు. ఆ ఇల్లు జనసమ్మర్దమైన చోట ఉంటటం, ఇరుకుగా ఉండటం వల్ల విశాలమైన ప్రదేశంలో రోగిని ఉంచమని వైద్యుడు సలహా ఇచ్చాడు. ఆ మేరకు భక్తులు 1885 డిసెంబర్‌లో కాశీపూర్‌లోని ఒక ఉద్యానగృహానికి శ్రీరామకృష్ణులను తరలించి, చికిత్సకు అన్ని ఏర్పాట్లూ చేశారు. దక్షిణేశ్వరం నుండి శారదాదేవి వచ్చి ఆయన పత్యపానాల బాధ్యత స్వీకరించారు. గృహస్థ శిష్యులు, అందులో ముఖ్యంగా సురేంద్రనాథ్ మిత్ర చాలా ఖర్చులను భరించాడు. తదనంతరకాలంలో సన్న్యాసం పుచ్చుకున్న యువ శిష్యులు

మొదట్లో వంతు వారీగా, శ్రీరామకృష్ణులకు పరిచర్యలు చేసారు. తరువాత స్థిరంగా వారు అక్కడే ఉండి పోయారు. వారిలో చాలామంది కళాశాల విద్యార్థులు, కొందరు స్వతంత్రులు. కాని తమ వ్యక్తిగత విషయాలు, తలిదండ్రుల ఆక్షేపణలను ఏ మాత్రం పట్టించుకోకుండా వారు శ్రీరామకృష్ణులకు పరిచర్యలు చేసారు.

మొదట్లో వాళ్లు పన్నెండుమంది : నరేంద్రుడు, రాఖాల్, బాబూరాం, నిరంజన్, యోగేన్, లాటు, పెద్ద గోపాల్, కాళి, తారక్, శశి, శరత్ – వీరంతా తదుపరి సన్న్యాసం పుచ్చుకున్నారు. అప్పుడున్న వారిలో చిన్న గోపాల్ కూడా ఉన్నాడు. నరేంద్రనాథ్ (స్వామి వివేకానంద) ఆ బృందానికి నాయకుడు. కావలసిన ఏర్పాట్ల పర్యవేక్షణ చెయ్యటమే కాకుండా, ఆ యువకుల నందరినీ ఒక సోదర బృందంగా సంఘటిత పరచి, స్వకీయ విషయాల కంటె గురుసేవ చెయ్యటం అత్యంత ముఖ్యమని వారికి నచ్చ చెప్పాడు. శ్రీరామకృష్ణులు దక్షిణేశ్వరంలో ఉన్నప్పుడు వారు తమ సెలవు రోజుల్లో స్నేహితులు వస్తున్నట్లు వచ్చి పోతూండే వారు. కాని ఆయన వ్యాధి కారణంగా వారొక ప్రయోజనానికి అంకితమైన బృందంగా సంఘటితమైనారు. ఆ విధంగా శ్రీరామకృష్ణుల రోగశయ్య వద్దనే –త్యాగం, సేవ, సాక్షాత్కారం అనే ఆయన ఆదర్శాల చేత – శ్రీరామకృష్ణ సంప్రదాయమనే సోదర బృందానికి పునాది వెయ్యబడింది. భగవంతుడే అవతరించి ఇలా ఉద్భవించా డనే వారి ప్రేమ, ఆయనకు చేసే సేవే జీవిత ప్రయోజనమనే విధంగా వారిని సంఘటితపరిచింది.

'శ్రీరామకృష్ణుల వంటి అవతార పురుషుడికి అలాంటి భయంకరమైన వ్యాధి ఎందుకు వచ్చింది?' అనే ప్రశ్నను సామాన్యంగా చాలామంది వేస్తూంటారు. శ్రీరామకృష్ణుల వల్ల పునీతులై ఉద్ధరింపబడ్డ వారి పాపాలను ఆయన స్వీకరించటం వల్లే ఆయనకు ఈ విధమైన వ్యాధి వచ్చిందని వారి శిష్యుల నమ్మకం. ఈ నమ్మకాన్ని ధ్రువపరిచేటట్లుగా శ్యాంపుకూర్‌లో ఒక దర్శనం కలిగింది. ఒకరోజు శ్రీరామకృష్ణుల శరీరంలో నుండి ఆయన లాంటి వ్యక్తే మరొకరు బైటికి వచ్చినట్లు, బక్కచిక్కిన ఆ రెండవ వ్యక్తి వీపు పుళ్లతో నిండి ఉన్నట్లు, పుళ్లన్నీ తాను

అనుగ్రహించిన వారి పాపఫలితాలనీ ఆయనకు అనుభూతి కలిగింది. ఆ వ్యాధి శ్రీరామకృష్ణ సంఘ స్థాపనకు కారణమైనదనటం మరో ముఖ్యకారణం. ఆ సంఘమే కాలక్రమేణా శ్రీరామకృష్ణ ఉద్యమానికి నాందియైంది. శ్రీరామకృష్ణులు దక్షిణేశ్వరంలోనే ఉన్న ట్లయితే, ఇది సాధ్యమయ్యేది కాదు. అందువల్లే జగజ్జనని ఇచ్ఛ మేరకే శ్రీరామకృష్ణులకు ఈ వ్యాధి వచ్చిందని మనం భావించవచ్చు.

ఆయన ఆధ్యాత్మిక శక్తులు తారాస్థాయిని అందు కొన్నప్పుడే, తీవ్రవ్యాధి మూలంగా ఆయన భౌతిక శరీరం శిథిలావస్థకు రావటం గమనార్హమైన విషయం. మనుషుల్లో సాధారణంగా శారీరక రుగ్మతలు పెరిగేకొద్దీ, మానసికశక్తి క్షీణిస్తుంది. కాని శ్రీరామకృష్ణులు శారీరకంగా బాధ ననుభవించినా భావోద్రేకంలో తన్మయత్వం, సమాధి యథాతథంగా కలుగుతూనే ఉండేవి. అంతేకాక ఆయన అన్నట్లుగా ఇదివరలో స్పర్శచేతనే, ఇతరుల్లోని ఆధ్యాత్మిక శక్తి ప్రబోధం చెందుతూండగా, ఇప్పుడు సంకల్ప మాత్రానే ఆ పని జరుగుతోంది. ఆయన చుట్టూ చేరిన శిష్యుల్లో తీవ్రమైన సాధన చెయ్యాలనే స్ఫూర్తి కలిగింది. స్వామి వివేకానందకి కాశీపూర్ రోజుల్లోనే మొదటిసారి నిర్వికల్ప సమాధి కలిగింది. అనేకులకు అవకాశం లేకపోయినప్పటికీ భజన, సంకీర్తనలు యథాతథంగానే ఆయన సన్నిధిలో సాగిపోతూనేఉన్నాయి. శ్రీరామకృష్ణుల వ్యాధిగ్రస్థ గది నిరుత్సాహ వాతావరణంతో కాక, తపోభూమిలో నెలకొన్న ఆధ్యాత్మిక తరంగాలతో నిండిపోయింది. శ్రీరామకృష్ణుల శక్తి ఏ మాత్రం తగ్గక పోవటమే, ఆయన అనుభవాలు వాస్తవమైనవే అని అనటానికి నిదర్శనం. వాగ్ధాటి ఉన్న వారు, శరీరదార్ఢ్యంలో ఉన్నప్పుడు భగవత్ప్రసంగాలు చెయ్య గలరు; గొప్పగొప్ప వేదాంత వాక్యాలు వల్లించగలరు. కాని ప్రమాదంలో చిక్కుకొని వున్నా, బాధాకరమైన వ్యాధి గ్రస్థుడైనా ఆ మిడిమిడిజ్ఞానం ఆవిరైపోయి వారి మనస్సు శారీరక ఎరుకలో స్థితమైపోతుంది. శ్రీరామకృష్ణులు చెప్పినట్లు పిల్లి కనపించనంత వరకు చిలుక "రామ రామ" అంటుంది. కాని పిల్లి కంట బడగానే, అది రామనామం మరచిపోయి కిచకిచలాడుతుంది. ఏసుక్రీస్తు కూడా శిలువ వెయ్యబడ్డప్పుడు "నా దేవా! నా దేవా! నన్నెందుకు వదలి వేశావు?" అని వాపోయాడు. కాని

నయంగాని వ్యాధి అనే శిలువ మీద శ్రీరామకృష్ణులు అలా అనలేదు. నిస్సందేహ మైన నిరూపణలో భగవంతుడి పట్ల ప్రగాఢమైన విశ్వాసాన్ని కలిగించటమే శ్రీరామకృష్ణుల ఉద్యమం. భగవంతుణ్ణి ఈ జన్మలోనే సాక్షాత్కరించుకోవచ్చుననే విషయాన్ని ఆయన తన అనుభవం ద్వారా నిరూపించారు. కాని ప్రతివారికీ తప్పకుండా సాక్షాత్కారం కలగుతుంది అనే నమ్మకంతో వారు ప్రారంభించాలి. ఆ నమ్మకం కలుగటానికి విశ్వస నీయమైన సాక్ష్యం అవసరం. ఆ వ్యక్తే ఆ సాక్ష్యమైతే ఆయన అనుభవాలు వాస్తవమైనవని నిరూపించబడి ఉండాలి. శ్రీరామకృష్ణుల అనుభవాలు ఆయన జీవితంలో నిరూపితాలై ఉండకపోతే అవి కేవలం వ్యక్తిగతమైన భ్రాంతులని ఏ మానసిక శాస్త్రవేత్తయైనా వాదించవచ్చును. మన ఎదుటే నిరహంకారుడైన ఒక వ్యక్తి ఉన్నాడు. ఆయనకున్న శక్తి ఆయన అనుభవాలే గాని మరొకటి కాదు. ఆయన శరీరం తీవ్రమైన వ్యాధికి గురైనా సంశయ మేఘమేదీ, ఆయన మనస్సులో లేశమైనా ఆవరించి ఉండలేదు. మానవ సమూహాలను సంకల్ప మాత్రాన్నే మార్చివేసేటంత శక్తివంతంగా ఆయన మనస్సు సమాహిత మైంది. మంచి ఆరోగ్య పరిస్థితుల్లో ఉన్నప్పటి కంటె, శక్తిమంతంగా ఆయన మనస్సు వ్యాధి స్థితుల్లో ఎలా సమాహితమైంది? ఆధ్యాత్మికానుభవాలను, మతి చలించిన వ్యక్తిగత భ్రాంతుల కింద జమకట్టే మానసిక శాస్త్రవేత్తల వాదాల్లోని బండారాలను బైటపెట్టడానికి జబ్బులో ఉన్న శ్రీరామకృష్ణుల మానసికస్థితిని ఉదహరించటం కంటె మరో నిదర్శనం అవసరం లేదు. వ్యాధిని తగ్గించమని జగజ్జనని ప్రార్థించమని శిష్యులు వేడుకున్నప్పుడు ఒక్క క్షణమైనా ఆయన చలించలేదు. తన మనస్సు, శరీరం ఎప్పుడో జగజ్జననికి అర్పించటం చేత తానలాంటి ప్రార్థన గావించ లేనని ఆయన సమాధానం చెప్పారు. ప్రీతిపాత్రుడైన నరేంద్రుడు పట్టుపట్టినప్పుడు ప్రయత్నిస్తానని చెప్పి, ఆ ప్రార్థనా ఫలితాన్ని ఇలా చెప్పారు : "అమ్మా! ఆహారం ఏమీ తీసుకో లేకపోతున్నాను. కాస్త తిననిచ్చేట్లు చెయ్యి అని అమ్మను ప్రార్థించాను. అందుకు ఆమె నాకీ జవాబు ఇచ్చింది– ఈ అన్ని నోళ్ల ద్వారా నువ్వు తినటం లేదా? ఈ ఒక్కనోటితోనే తినాలని ఎందుకు తలుస్తున్నావు?"

సర్వాత్మ భావంతో నెలకొన్న అలాంటి మరో నిదర్శనం లోకంలో మరొకటి కానరాదు!

ఏమాత్రం బుద్ధి ఉన్నవాడైనా, అలాంటి మహనీయుడి అనుభవాలు వ్యక్తిగత భ్రాంతుల కింద కొట్టివెయ్యడు. ఆ అనుభవాలు అలాంటి భ్రాంతులే కనుక ఐతే, ఆ వ్యక్తి ఛిన్నాభిన్నమౌతాడు కాని అత్యద్భుత శక్తి గల పరిపూర్ణుడు కాబోడు.

# కొన్ని అసాధారణ ఆత్మ విభూతులు

ఆ అనారోగ్య సమయంలో కొన్ని అసాధారణ సంఘటనలు సంభవించాయి. ఆ సంఘటనల వల్ల అనేక మంది భక్తులు శ్రీరామకృష్ణుల వ్యాధి సహజమైనది కాదని, అది ఆయన తెచ్చిపెటుకున్నదే అనే భావనలో పడ్డారు. అందులో సుప్రసిద్ధ బ్రహ్మసమాజ ప్రచారకుడైన విజయకృష్ణ గోస్వామి ఒకరు. ఒకరోజు విజయ్ ఢాకాలో ప్రార్థన చేసు కుంటున్నాడు. అదే సమయంలో కలకత్తాలో జబ్బుతో మంచం పట్టిన శ్రీరామకృష్ణులు విజయ్‌కి అతడి ప్రార్థనా మందిరంలో దర్శనమిచ్చారు.

మాతృదేవి స్వయంగా చూసిన అద్భుత సంఘటన మరొకటి కాశీపూర్‌లో జరిగింది. శ్రీరామకృష్ణులు జబ్బులో ఉన్న సమయంలో, ఆయన త్వరత్వరగా గదిలో నుండి బైటకు పోవటాన్ని ఆమె చూశారు. అది నిజమో కాదో తెలుసుకోవాలని ఆమె ఆయన గదిలోకి పోయి చూస్తే ఆయన అక్కడ లేరు. కాస్సేపు ఆగి మళ్లా గదిలోకి పోయి చూస్తే, ఆయన అదే పక్క మీద పడుకొని ఉన్నారు. అంతకు క్రితం ఆయన ఎక్కడికి వెళ్లారో ఆమె తెలుసుకోగోరారు. మొదట్లో ఆయన ఆ విషయాన్ని దాటవేస్తూ ఆమె బుర్ర వేడెక్కటంతో అలా అనిపించి ఉంటుందేమో నన్నారు. కాని ఆమె నిలదీసి అడిగేసరికి నిరంజన్ ఈతచెట్టు నుండి తీపిరసం తియ్యటానికి వెళ్లాడని, ఆ చెట్టుమీద పాముందని, ఆ పామును పారదోలి నిరంజన్‌ను రక్షించటానికి తాను వెళ్లానని చెప్పారు. శ్రీరామకృష్ణులు ఉన్న అలాంటి జబ్బు స్థితిలో ఏ వ్యక్తీ అలా చెయ్యలేడు. అలాంటి సంఘటనలు అద్భుతాలుగా అనిపించవచ్చు గాని, అది ఎంతో నమ్మకస్తులైన వారి నుండి వచ్చిన ప్రమాణవాక్యాలు. ఈ సంఘటనలు శ్రీరామకృష్ణులు దుర్బల శరీరి గాక ఎంతో అధికులని అనేకమంది భక్తులకు విశ్వాసాన్ని కలిగించాయి.

శ్యాంపుకూర్‌లోను, కాశీపూర్‌లోను జబ్బులో ఉన్నప్పుడు మరో రెండు ముఖ్య సంఘటనలు జరిగాయి. ఒకసారి కాళీ పూజా సమయంలో శ్రీరామకృష్ణుల గదిలో కాళీ పూజకు

సన్నాహాలు జరిగాయి. ఏర్పాట్లన్నీ పూర్తయి పూజా సమయమయింది. కాని పూజ ఎవరు చెయ్యాలో, ఎప్పుడు ప్రారంభించాలి అనే సంగతి ఆయన సూచించలేదు. దానికి మారుగా నిశ్చలంగా ఉండిపోయారు. భక్తులకు దిక్కుతోచ లేదు. చివరికి గిరీషుకు ఒక ఆలోచన తట్టింది. తననే కాళీరూపంగా అర్చించాలని శ్రీరామకృష్ణుల అభిప్రాయమని అతడు ఊహించాడు. వెంటనే 'మహా మాయీకీ జై' అంటూ కేక వేస్తూ, గంధపుష్పాదులు శ్రీరామకృష్ణుల పాదాల మీద సమర్పించాడు. తక్షణమే ఆయన శరీరం పులకరించి సమాధి కలిగింది. ఆయన హస్తాలు అభయ, వరద ముద్రలతో పైకి లేచాయి. భక్తులంతా వరుసగా పుష్పాంజలి సమర్పించారు. ఇంతలో శ్రీరామకృష్ణుల రూపంలో అద్భుతమైన మార్పు కలిగింది. ముఖం ప్రకాశవంతమైంది. పెదవుల మీద దివ్యమైన దరహాసం వెల్లివిరిసింది. ఆ అద్భుతదృశ్యంలో అక్కడున్న ప్రతి వారికి ఆయనలో జగజ్జనని అభివ్యక్తమవడం గోచరించింది. భక్తుల జయజయ ధ్వానాలతో గది మారు మ్రోగింది. వారంతా తన్మయ స్థితిలో ఉండిపోయారు. సమాధి నుండి సాధారణ స్థితికి వచ్చాక శ్రీరామకృష్ణులు కాస్త ప్రసాదాన్ని స్వీకరించి తక్కిన దాన్ని భక్తులకు పంచమన్నారు. భక్తులంతా శ్రీరామకృష్ణులను, జగజ్జననిని ఒక్కటిగా దర్శించి తమకు ఆయన సంరక్షణలో భద్రత వుందని తలపోశారు. ఆ రోగి గదిలో అనూహ్యమైన దృశ్యాల మధ్య వారు భక్తిగీతాలు పాడుతూ రాత్రి చాలా సేపు గడిపారు.

# శ్రీరామకృష్ణులు : కల్పతరువు

శ్రీరామకృష్ణుల ఆత్మవిభూతి ప్రకటితమైన మరో సంఘటన ఆయన కాశీపూర్‌లో చికిత్స పొందుతున్నప్పుడు జరిగింది. ఆ దినాన్ని ప్రస్తుతం 'కల్పతరువు' దినోత్సవంగా భక్తులు జరుపుకుంటున్నారు. ఆ రోజు అక్కడ చేరిన భక్తుల్లోని ఆధ్యాత్మిక వాంఛలను శ్రీరామకృష్ణులు, స్వర్గంలోని కల్పతరువు మాదిరి నెరవేర్చారు. అది 1886 జనవరి ఒకటవ తేదీ. కాస్త స్వస్థతగా ఉండటం చేత శ్రీరామకృష్ణులు నెమ్మదిగా తోటలోకి వాహ్యాళికి వచ్చారు. ఆ రోజు ఆదివారమవటంతో చాలా మంది భక్తులు అక్కడ సమావేశమైనారు. శ్రీరామకృష్ణులు వారి మధ్యకు వెళ్లి హఠాత్తుగా గిరీష్‌ను ఉద్దేశిస్తూ ఇలా అడిగారు: "ఓ గిరీష్! నాలో ఏం చూసి, నేను అవతారమని ప్రతిచోట ప్రకటిస్తున్నావు?" గిరీష్ తడబడకుండా అమిత భక్తి గౌరవాలతో ఇలా జవాబిచ్చాడు– "వ్యాస వాల్మీకాదులకే అంతుపట్టని మీ వైభవాన్ని నేనేమని కొనియాడగలను?" ఆ జవాబు శ్రీరామకృష్ణులలో తన దివ్యతాదాత్మ్యాన్ని మేలుకొలిపి అర్ధ బాహ్యదశలో ఆయన ఇలా అన్నారు "నేనింకేం చెప్పగలను? మిమ్మల్నందరినీ దీవిస్తున్నాను. మీ అందరిలో ఆధ్యాత్మిక చైతన్యం జాగృతమవు గాక!" భక్తులంతా వెంటనే సాష్టాంగపడ్డారు. శ్రీరామకృష్ణులు అనేకులను స్పృశించారు. ఆ కారణంగా ప్రతివారి మీదా అద్భుతప్రభావం పడింది. ఒక ప్రగాఢ ఆధ్యాత్మిక ఆనంద శక్తి ప్రతివారి అంతరంగం నుండి పెల్లుబికి దాన్లో వారిని ముంచి వేసింది. వారందరి మనస్సుల్లో విపరీతమైన మార్పు వచ్చింది. కొందరు ఎంతో కాలం నుండి ఎంతో కష్టపడి యత్నిస్తూన్న వారి ఇష్టదేవత దర్శనమివ్వటం చైతన్య రూపంలో గోచరించింది. తన హృదయం మీద శ్రీరామకృష్ణుల స్పర్శ తగలగానే తనను తానే మరచిపోయి కొన్ని రోజుల పాటు శ్రీరామకృష్ణుల దివ్యరూపాన్ని చూస్తూనే వున్నానని వైకుంఠనాథ్ వర్ణించాడు. ఆ దర్శనం అదే ప్రకారం కలుగుతూండటం చేత తన నిత్య కృత్యాలు చేసుకోటానికై, అతడు శ్రీరామకృష్ణులను ప్రార్థించాక అది ఆగిపోయింది.

ఆ రోజుల్లో ఆయన ఆత్మవిభూతి ప్రకటితమైన మరో ముఖ్య ఉపాఖ్యానం ఉంది. అది

నరేంద్రుడి ద్వారా యావత్తు ప్రపంచానికి సంశయ నివృత్తిని గావించింది. వ్యాధి కారణంగా శ్రీరామకృష్ణులు దుర్భర బాధను అనుభవిస్తు న్నప్పుడు నరేంద్రుడు మంచం వద్ద కూర్చుని తనలో తాను ఇలా అనుకోసాగాడు– "ఈ బాధలో కూడ ఆయన తన దివ్యత్వాన్ని ప్రకటించగలిగితే (ఆయన సాధారణంగా చెప్పుకునేట్లు) నేను దాన్ని అంగీకరస్తాను." నరేంద్రుడిలో ఈ సంశయం తలెత్తిన క్షణంలోనే శ్రీరామకృష్ణులు తన శక్తినంతా కూడదీసుకుని విస్పష్టంగా ఇలా అన్నారు "ఎవరు రాముడో, ఎవరు కృష్ణుడో అతడే ఇప్పుడు ఈ శరీరంలో రామకృష్ణుడుగా ఉన్నాడు. కాని నీ వేదాంత దృష్టిలో మాత్రం కాదు."

స్పష్టంగా ఉన్నా ఈ జటిల వచనాల్ని వ్యాఖ్యానించటం చాలా కష్టం. దీని భావం ఇలా ఉండవచ్చు– ప్రతివ్యక్తిలోను దివ్యత్వం గర్భితమై ఉందని వేదాంతం ప్రకటిస్తోంది. శ్రీరామకృష్ణులు తాను దివ్యత్వస్వరూపమే అనే విషయం ఆ దృష్టిలో కాదు, సృష్టికర్తయైన భగవంతుడు, పరిత్రాణుడు కూడా. ఆ అనుగ్రహశక్తి వివిధ యుగాల్లో మానవులను ఉద్ధరించటానికి రామ, కృష్ణ తదితర రూపాలలో అవతరిస్తాడు. వస్తుతః ఈ అవతారాలన్నీ ఒక్కటే. అతడే శ్రీరామకృష్ణులుగా ఇలా ఆవిర్భవించాడు.

# సన్న్యాససంఘ వ్యవస్థాపన

శ్రీరామకృష్ణులు తాను ప్రారంభించిన ఆధ్యాత్మిక పునరుజ్జీవన ఉద్యమాన్ని కొనసాగించటానికి నరేంద్రుడికి ప్రత్యేకంగా తర్ఫీదు ఇచ్చారు. తన మంచం పక్కన తరచూ గంటల తరబడి అతడితో బహుశా ఈ విషయాలను గురించే ముచ్చటించేవారేమో! ఒకరోజు నరేంద్రుణ్ణి తన పక్కన కూర్చో బెట్టుకుని తదేకదృష్టితో అతడికేసి చూస్తూ శ్రీరామకృష్ణులు సమాధిమగ్నులయ్యారు. ఒక సూక్ష్మశక్తి తనలో ప్రవేశిస్తున్నట్లు నరేంద్రుడికి తోచి, అతడూ బాహ్య స్మృతి కోల్పోయాడు, కొంత సేపయ్యాక శ్రీరామకృష్ణులకు బాహ్యస్మృతి కలిగి, భావపారవశ్యంలో నరేంద్రుణ్ణి ఉద్దేశించి, "నా సర్వస్వాన్ని నీకు సంక్రమింపచేశాను" అన్నారు. ఈ శక్తితో నరేంద్రుడు భవిష్యత్తులో ప్రపంచానికి ఎంతో మేలు ఒనగూర్చాడు.

నీ జీవితాశయం ఏమిటని శ్రీరామకృష్ణులు ఒకరోజు నరేంద్రుణ్ణి అడిగారు. సమాధి నిమగ్నుడనై ఉండటమే తన ఆశయం అని అతడు జవాబిచ్చాడు. 'సమాధి అనేది అతడికి చాలా స్వల్పమని, అసంఖ్యాకులైన మానవులకు అతడు మహావటవృక్షం మాదిరి నీడనిచ్చి, రక్షణ నివ్వవలసి ఉందని' అప్పుడు శ్రీరామకృష్ణులు చెప్పారు. కాశీపుర్ ఉద్యానవనంలో గడిపిన రోజుల్లో శ్రీరామకృష్ణుల అను గ్రహంతో నరేంద్రుడు నిర్వికల్పసమాధిని అనుభవించాడు. పిమ్మట నరేంద్రుడు శ్రీరామకృష్ణుల వద్దకు రాగా, "ఇప్పుడు అమ్మ నీకు సమస్తం దర్శింపచేసింది. కానీ నీకిప్పుడు కలిగిన అనుభవం తాళం వేయబడుతోంది. దాని తాళం చెవి నా వద్ద ఉంటుంది. అమ్మ కార్యాన్ని నువ్వు పూర్తిగా నిర్వర్తించాక ఈ నిధి మళ్లా నీకు లభిస్తుంది" అన్నారు.

వ్యాధి అనే మిషతో తనకు సేవచేస్తున్న ఈ యువ భక్తులను శ్రీరామకృష్ణులు సన్న్యాస జీవితానికి సన్నద్ధులగా గావిస్తున్నారు. ఒకరోజు పెద్దగోపాల్ కొన్ని కాషాయ వస్త్రాలను, రుద్రాక్ష మాలలను సన్న్యాసులకు పంచిపెట్టాలనే తన కోరికను శ్రీరామకృష్ణులకు విన్నవించాడు. ఆయన

అతడికి ఈ యువకులను చూపిస్తూ, వారికంటె గొప్ప సన్న్యాసులు అతడికి లభించరని చెప్పారు. వస్త్రాల మూట శ్రీరామకృష్ణుల ముందుపెట్టగా, ఆయన వాటిని ఆ యువకులకు అందించారు. ఒక సాయంకాలం ఈ యువకుల చేత కర్మకలాప మొకటి నిర్వర్తింప చేసి, వర్ణవ్యవస్థను పాటించక, వీథుల్లోకి వెళ్లి వారిని భిక్ష తెమ్మని ఆదేశించారు. ఒకరోజు వాళ్లు భిక్షాపాత్రలను తీసుకుని వీథుల్లోకి వెళ్లి భిక్ష తెచ్చారు. ఆ విధంగా ఆయన వ్యాధి మంచం పక్కనే రామకృష్ణ సంఘం ఏర్పడింది. నరేంద్రుణ్ణి వారికి నాయకుణ్ణి గావించి ఇలా అన్నారు– "వీరిని నీ అధీనంలో ఉంచుతున్నాను. వారు ఇంటికి మరలిపోకుండా ఆధ్యాత్మిక సాధనలు చేస్తూండేటట్లు చూసుకో."

శ్రీరామకృష్ణుల ద్వారా జగజ్జనని తన సంకల్పాన్ని ఈ వ్యాధి ద్వారా అభివ్యక్తం గావించకపోతే విస్తృత ప్రాముఖ్యం కలిగిన సంఘటనలు వ్యాధిగ్రస్థుడైన వ్యక్తి సమక్షంలో జరుగుతాయా?

# రోగశయ్య వద్ద జరిగిన కొన్ని సంభాషణలు

దుర్భరబాధ ననుభవించే సమయంలో చేసిన సంభాషణ లెలాంటివి? అవి మరణావస్థలో ఉన్నవారి వద్ద వినబడేటు వంటి మాటలు మాత్రం కావు. 'మ' రచించిన శ్రీరామకృష్ణ కథామృతంలోని కొన్ని సందర్భసహిత సంభాషణల్లోని భాగాలను కింద పొందుపరుస్తున్నాం

శ్రీరామకృష్ణులు : "బాధలు శరీరానికి చెందినవి. అవి ఆ రీతిలో జరగవలసిందే. శరీరం పంచభూతాలతో రూపొందించబడింది. జడపదార్థం నుండి అది వస్తోంది."

గిరీష్ వైపు తిరిగి ఇలా అన్నారు "ఈ స్థితిలోనే ఎల్లప్పుడూ నేను దేనిని తలపోస్తున్నానని నువ్వు భావిస్తున్నావు? భగవంతుడి దివ్యరూపాలను గురించే, ఈ రూపాలు ఎన్నో రకాలు. వాటిలో ఈ రూపాన్ని (తనను చూపిస్తూ) కూడా చూస్తున్నాను. దీన్లో కూడా భగవంతుడు ఆవిర్భవించి ఉన్నాడు. ('మ' తో) నేనేం చూస్తున్నానో నీకు తెలియదా? భగవంతుణ్ణి స్వయంగా దర్శిస్తున్నాను. మనుషులు, ఇతర ప్రాణులు లోపల భగవంతుడుండి తోలుతో కప్పబడ్డ కాళ్ళు, చేతులు, తల కదిలిస్తున్న బొమ్మల మాదిరి కనిపిస్తున్నారు. నాకొకసారి ఒక దృశ్యం కంటబడింది. లక్కతో చేసిన ఇల్లు, తోటలు, బాటలు, మనుషులు, ఆవులు మొదలైనవన్నీ లక్క తప్ప మరోపదార్థం దేనితోనూ చేయబడనట్లు, ఒకే పదార్థం సమస్త జీవరాశులతో కూడిన జగద్రూపం దాల్చినట్లు నాకు అనుభూతమైంది.

యజ్ఞపశువు, వధ్యశిల, వధించేవాడు, ముగ్గురూ ఒకే పదార్థంలో నుండి వచ్చినట్లు నాకు కనిపించారు. ఆహా! ఆహా! ఏం దృశ్యం!"

మరోసారి భావావస్థలో శ్రీరామకృష్ణులు ఇంద్రియ ప్రపంచానికి అతీతంగా ఎగసిపోయారు. బాహ్యస్మృతి వచ్చాక ఇలా అన్నాడు – "నాకిప్పుడు ఏ బాధా లేదు, మామూలుగా ఉన్నాను." ఆయన సుఖదుఃఖాలకు, ఆనంద విషాదాలకు అతీతమైన స్థితిలోకి

పోయారు. "ఈ శరీరం ఇంకా కొన్ని రోజులు ఈ ప్రపంచంలో నిలిస్తే అనేక జీవులు ఉద్ధరింపబడతారు. కాని మరోవిధంగా జరగాల్సి ఉంది."

అక్కడ ఉన్న భక్తులంతా తదుపరి ఏం చెబుతారా అని వేచి వున్నారు. శ్రీరామకృష్ణులు తిరిగి ఇలా అన్నారు "అవును. భగవంతుడి ఇచ్ఛ ఆ విధంగా లేదు. కల్లాకపటం ఎరుగని, చదువురాని వ్యక్తి ఇక్కడున్నాడు. జనం దాన్ని ఆసరాగా తీసుకోవచ్చు. భోగలాలసులై ధనాన్నే ఆరాధించే ఈయుగంలో భక్తిసాధనలంటే ఏమిటో తెలియని అనర్హులైన వారికి అతడు భగవంతుడి గొప్ప కానుకలను ఇచ్చివెయ్య వచ్చు".

భగవదవతారం రూపుదాల్చిన మానవజాతిలోని ప్రేమ అని, మానవులంతా అవతార పురుషుడి ద్వారా భగవంతుణ్ణి సాక్షాత్కరించుకుంటే, సృష్టి ఆగిపోతుందని దేవుడి అభిప్రాయమా!

"నేను నా జగజ్జనని ప్రస్తుతం ఒక్కటే అయిపోయాం." ('మ' తనలో) 'జగజ్జననితో ఒకటా! అద్వితీయంతో ఒకటా! ఇప్పుడు ప్రత్యేక వ్యక్తిత్వంతో వేరుగా ఉండటం అంత కష్టం. శిశువు తల్లితో ఐక్యం అయిపోయాడు. శ్రీరామకృష్ణుల మాటల్లోని అంతరార్థం ఇదేనా?'

శ్రీరామకృష్ణులు : "ఇక్కడ (తనలో) ఇద్దరు వ్యక్తులు ఉన్నారు. ఒకరు జగజ్జనని, రెండవ వ్యక్తి ఆమె భక్తుడు. ఈ రెండవ వ్యక్తికే ఇప్పుడు జబ్బు చేసింది. ఇది నీకు అర్థమైయ్యిందా? నన్ను అర్థంచేసుకునేవారు ఎవరున్నారు?

శరీరధారికి బాధ తప్పదు. ఒక్కొక్కప్పుడు నాలో నేనిలా అనుకుంటాను. భగవంతుడు నన్ను మళ్లా ఈ ప్రపంచంలోకి పంపకుంటాడు గాక! కాని మరో విషయాన్ని గణనలోకి తీసుకోవాలి. భగవంతుడి విందుకు పిలువబడ్డ వ్యక్తికి ఇంట్లోని పప్పు, బియ్యం రుచించవు."

('మ' తనలో) 'భగవత్ప్రేమ స్వరూపుడు అయిన అవతార పురుషుడికి, భగవంతుణ్ణి

మాత్రమే ప్రేమించిన సజ్జనుల సాంగత్యం ఇష్టమా?'

శ్రీరామకృష్ణులు : "భగవంతుణ్ణి మాత్రమే ప్రేమించే పవిత్రజీవుల కోసమే భగవంతుడు మానవ శరీరం దాలుస్తాడు."

తన హృదయం మీద చెయ్యి వేసుకుని ఆయన ఇలా అన్నారు : "ఊహకు అదే ప్రతి వస్తువు (సమస్త వస్తువులు) దీన్నుండే వచ్చినట్లు నేను చూస్తున్నాను, నేను అనుభూతి చెందుతున్నాను."

జబ్బులో ఉన్న వ్యక్తి వద్ద, అందునా ముఖ్యంగా ద్వంద్వ వ్యక్తిత్వంతో బలహీనమైన సంకల్పం, ఆంతరంగికమైన భ్రాంతులున్న వ్యక్తి వద్ద ఈ విధమైన సన్నివేశాలు, సంభాషణలు కొనసాగుతాయా? కాబట్టి శ్రీరామకృష్ణుల వ్యాధి జగజ్జనని కల్పించినదేనని, ఈ వ్యాధి వల్ల భగవంతు డున్నాడనే సత్యాన్ని మానవాళిలో దృఢంగా నెలకొల్పాలని తలచిందని, కళ్లున్నవాళ్లు సులభంగా గ్రహించ గలరు. ఆధునిక విజ్ఞాన శాస్త్ర స్ఫూర్తిలోను, చారిత్రాత్మక సంప్రదాయాల్లోను శిక్షితులైన అనేకులకు, మతగ్రంథాల్లో పేర్కొనబడ్డ మహాపురుషుల జీవిత విశేషాలు, అంతగా రుచించవు. కారణం ఏమంటే, ఈ మహనీయులు చాలా కాలం క్రితం ఉండిన వారు. అంతేకాక, ఆ మహనీయుల చారిత్రకాంశాలు సరిగా నమోదు అయి ఉండలేదు. వారి జీవితవిశేషాలు, వారి ఉపదేశాలు కవుల చేతుల్లోను, తత్త్వవేత్తల చేతుల్లోను, సంకుచిత భావాలున్న వారి చేతుల్లోను పడి, వారి ఇచ్ఛ వచ్చినట్లుగా విపులీకరించబడ్డాక మనకు రావటంతో అవి ఆధునికులకు సరైన నమ్మకాన్ని కలిగించటంలేదు. అలాంటి ఆధునికులకు శ్రీరామకృష్ణుల జీవిత విశేషాలు, ఉపదేశాలు నమ్మదగిన రీతిలో లభిస్తు న్నాయి. అవి ఇటీవలి కాలానికి చెందినవి. వాటిని నమోదు చేసినవారు విద్యాధికులు. వీరు అవతార దివ్యత్వ వైభవాన్ని అధికతరం చెయ్యటానికి మానవ లోటుపాట్లను దాచేసే, ఆలంకారిక కవితలు గావించే ప్రయత్నాలు ఏమీ చెయ్యలేదు. స్వామి శారదానంద రచించిన 'శ్రీరామకృష్ణ లీలా ప్రసంగం' లో సవివరంగా, సప్రామాణికంగా ఆయన జీవిత విశేషాలు మనకు లభిస్తాయి. జగద్విఖ్యాతి

గాంచిన 'మ' రచించిన 'శ్రీరామకృష్ణ కథామృతంలో' కూడా శ్రీరామకృష్ణుల జీవనసరళి, వ్యక్తులతో మెలగే విధానం, భక్తులతోను, తదితరుతోను ఆయన గావించిన సంభాషణ లతో కూడిన 'లేఖనా చిత్రం' మనకు గోచరిస్తుంది. శ్రీరామకృష్ణుల జీవితంలో తన సాధనల ద్వారాను, అనుభవాల ద్వారాను అవతారమూర్తుల ఆధ్యాత్మికతను వ్యక్తీకరించడం వల్ల; అవతారాల్లోను, దేవతల్లోను ఆధునిక మానవుడు కోల్పోయిన విశ్వాసాన్ని తిరిగి పొందడానికి ఉపకరిస్తుంది. ప్రారంభంలో ఉదహరించిన మహాత్మా గాంధీ ప్రశంసా వాక్యాలు ఆధునికులకు శ్రీరామకృష్ణుల ఆవశ్య కతను సూచిస్తోంది.

కాశీపూర్‌లో తొమ్మిది నెలలు గడిపాక ఒక నూతన చైతన్యాన్ని ప్రపంచమంతటా వ్యాప్తి చెయ్యటానికి, ఆయన అడుగుజాడల్లో నడుచుకునే ఒక యువబృందం, ముఖ్యంగా సన్న్యాస బృందాన్ని తన వెనుక వదలిపెట్టి, శ్రీరామకృష్ణులు 1886 వ సం ॥ ఆగస్టు 16 వ తేదీన మహాసమాధి చెందారు.

కాలాంతరంలో ఒక మహావటవృక్షంగా విస్తరించిన ఆ శక్తి ఆ రోజుల్లో బీజప్రాయంగానే ఉండిపోయింది. చాలా మంది భక్తులు శ్రీరామకృష్ణుల నిర్యాణంతో, ఆయన వచ్చిన పని పూర్తయిందని విశ్వసించారు. వారివారి ఇళ్లకు తిరిగి పొమ్మని యువసన్న్యాసులకు సలహా ఇచ్చారు. కాని నరేంద్రుడి నాయకత్వంలో ఆ యువకులు, తమ గురువుదేవుల ఉపదేశాలకు ఒక ఉజ్వల భవిష్యత్తు ఉందని దృఢంగా విశ్వసించారు. ఆ చిన్ని సన్న్యాస బృందానికి, కార్యాచరణ కేంద్రంగా ఒక శిథిల భవనం లభించింది. స్వామి వివేకానంద శ్రీరామకృష్ణుల అస్తికలను ప్రతిష్ఠించి ఒక దేవాలయం నిర్మించడానికి బేలూర్‌లో గంగాతీరంలో స్థలం కొన్నారు. ఐతే ఆయన మహాసమాధి పొందిన తరువాతే శ్రీరామకృష్ణుల దేవాలయం నిర్మించడం జరిగింది. విశ్వవిఖ్యాతులైన మాక్స్‌ముల్లర్, రోమారోలో, ఆల్డస్ హక్స్‌లీ మొదలైన వారి రచనలకు శ్రీరామకృష్ణుల జీవిత చరిత్ర, బోధనలు కథాంశాలైయ్యాయి. 'శ్రీరామకృష్ణ కథామృతం' భారతీయ భాషల్లోనే కాక అనేక ప్రపంచ భాషల్లోకి తర్జుమా చెయ్యబడింది. కొన్ని దశకాల్లోనే ఆ

గ్రంథప్రతులు లక్షల్లో చెల్లిపోయాయి. మహావిష్ణువు దాల్చిన మొదటి అవతారం అయిన మత్స్యావతారం, ఒక చిన్న చేపగా అంకురించి క్రమంగా దాన్ని భరించగలిగేది సముద్రమే అనేంతగా ఎదిగిపోయింది. అలాగే వామనా వతారం బాల వటువుగా బైలుదేరి భూనభోంతరాళా లన్నింటిని విస్తరించి విశ్వాన్నంతా తన మూడడుగులతో కొలిచి వేసింది. ఈ కోవకు చెందిన శ్రీరామకృష్ణావతారం కూడా, నిరహంకారి అయిన ఒక సామాన్య భక్తుడిగా ప్రారంభించి, విశ్వవ్యాప్తమైన దివ్యపరిధుల నందుకొంది.

# ఆయన ఉపదేశాలు – సంక్షిప్త సమీక్ష

శ్రీరామకృష్ణులు అవిచ్ఛిన్న తత్వమైన వేదాంతాన్ని ఒక వర్గ సిద్ధాంతంగా బోధించకుండా, ఆచరణాత్మక వేదాంతం లోనే ఆయన జీవించారు. అంటే మాటల్లో ఆయన ఏమీ బోధించ లేదని కాదు. ఆయన వచనాలు పండిత రచనలు, ప్రసంగాలు, ప్రవచనాలు కావు. అవి గుంపులుగా దరిచేరిన భక్తులను ఉద్దేశించి చేసిన సాధారణ సంభాషణలే. 'మ' రాసి ఉంచుకున్న దినచర్య నుండి రూపొందిన 'శ్రీరామకృష్ణ కథామృతం' అనే గ్రంథం వెలుగుచూడకపోతే ఈ సంభాషణ లన్నీ మానవాళికి దక్కేవి కావు. అవి కూడా 'మ' గురుదేవుల వద్దకు వెళ్లిన సమయంలో జరిగిన సంభాషణలు మాత్రమే అయి ఉండటంతో వాటిని సమగ్రమైనవని చెప్పటానికి వీలు లేదు. ఈ గ్రంథంతో పాటు స్వామి శారదానంద రచించిన శ్రీరామకృష్ణ జీవిత చరిత్ర ఉంది. అంతేగాక ప్రపంచ వేదికల మీద స్వామి వివేకానంద గావించిన ప్రసంగాలున్నాయి. వాటిలో మంచి, ఉపయుక్తమైనది ఏదైనా ఉంటే ఆదంతా తాను తన గురువైన శ్రీరామకృష్ణుల వద్ద నేర్చినదేనని స్వామి వివేకానంద వక్కాణించి ఉన్నారు.

ఐతే శ్రీరామకృష్ణులు ఉపదేశించినదేమిటి? నిజానికి ఆయన తన మాటలతో కంటె, తన జీవితం ద్వారానే అధికంగా ఉపదేశించారు. పాఠకులు దిగువ ఉదహరించిన ఈ సంక్షిప్త సారాంశాన్ని ఒక సాంప్రదాయక వచనంగా తీసుకోరాదు! శ్రీరామకృష్ణులు ఒక ప్రత్యేక సంప్రదాయాన్ని గాని, సిద్ధాంతాన్ని గాని బోధించలేదు. ఈ సంక్షిప్తసారాంశం ఆయన ఉపదేశాల విస్తృత వివరణ కూడా కానేకాదు. ఆ ఉపదేశాలను అధ్యయనం చెయ్యటానికి ఉపయుక్తమయ్యే మార్గదర్శిని మాత్రమే.

'సత్యం' సారాంశంలో ఒక చైతన్య సిద్ధాంతం. ఒకే చైతన్యం 'గాడ్' అని, 'అల్లా' అని, 'బుద్ధుడు' అని, 'శివుడు' అని, 'విష్ణువు' అని వివిధ మతాల్లో పేర్కొనబడుతోంది. అది సాకారం – నిరాకారం, సగుణం – నిర్గుణం. సాకారం నిరాకరానికి తీసిపోదు. కాని సాకారానికున్న

పరిమితులు దానికి లేవు. సత్యం తన సహజస్థితిలో అన్నింటికీ అతీతంగా ఉన్నా, తన అనంతస్థితిలో అది చేతన, అచేతన పదార్థా లన్నింటికి నిమిత్త ఉపాదాన కారణంగా ఉండి సన్నిహిత సంబంధం కలిగి వుంది. ఈ దృష్టిలో పరతత్వం 'అతడు' లేక 'ఆమె' – 'జగత్పిత' లేక 'జగన్మాత' అని వ్యవహరింప బడుతోంది. జీవజగత్తులు రెండూ మాతా–పిత దివ్యత్వ విభూతులే! ప్రకృతిలోని సౌమ్యభీకరత్వాల రెంటికి ఆ చైతన్యమే మూలకందం.

భక్తుడికి ఆయన ప్రేమ స్వరూపుడైన దైవం. శ్రద్ధా విహీనులై తనను మరచిన తన పిల్లలను తన పాదాల చెంతకు చేర్చటానికి ఆయన ఉపయోగించే విధానాలే జీవితంలో వాటిల్లే కష్టనష్టాలు. అతడు ప్రతి వ్యక్తిలోను ఉన్నాడు. కాని భక్తిగల హృదయాలకు అతిసన్నిహితుడు. హృదయపూర్వకమైన ప్రార్థనలను ఆయన ఆలకించి, తన అపార కరుణతో అనుగ్రహిస్తాడు.

జ్ఞానం ద్వారా ఆయన నిర్గుణాన్ని, భక్తి ద్వారా ఆయన సగుణాన్ని పొందవచ్చు. కాని భక్తిమార్గం, లేదా శరణాగతి అనేది సహజమైనది, సరళమైనది. ఆ మార్గాన్ని అనుసరించే వారికి ఆయన తాను అఖండత్వమే అనే జ్ఞానాన్ని కూడా కలిగిస్తాడు. భక్తిమార్గంలో ఆయన్ను తల్లిగా, తండ్రిగా, సఖుడుగా, బిడ్డగా, ప్రేమికుడుగా లేక మరే విధమైన మానవ సంబంధంతోనైనా చూడవచ్చు. భక్తుడి స్వభావం, నిర్మలదృష్టి ననుసరించి ఆయన తన సుందరమైన, పవిత్రమైన వివిధ రూపాల్లో అతడికి దర్శనమిస్తాడు. అవతారమనేది 'దివ్య కరుణ' యొక్క ప్రత్యేకరూపం. మానవాళికి ధర్మమార్గాన్ని చూపించటానికి భగవంతుడు అప్పుడప్పుడు అతిపవిత్రత, ఆధ్యాత్మికత గల మానవరూపంలో అవతరిస్తాడు. వివిధ కాలాల్లో మానవులకు నూతన ఆధ్యాత్మిక మార్గాలు చూపించిన గొప్ప మతప్రవక్తలందరూ అలాంటి దివ్య విభూతులే. వారు భగవంతుడి చేత ప్రత్యేకంగా ఆదేశించబడ్డ వారు. వారిని ఆరాధించి, వారి జీవిత విశేషాలను, వారొనర్చిన కార్యక్రమాలను ధ్యానించటం అనేది ఆధ్యాత్మి కోన్నతిని పొందటానికి గల ఉత్తమ మార్గాల్లో ఒకటి.

భౌతిక పరిమితులున్నప్పటికీ, మానవవ్యక్తిత్వం విరాట్ చైతన్యంతో సన్నిహిత సంబంధం

కలిగి ఉంది. అందుచేత ప్రతిజీవి వస్తుత దివ్యమే. అంతర్గతమైన ఈ దివ్యత్వాన్ని – బాహ్యప్రకృతిని, అంతఃప్రకృతిని నిగ్రహించి – అభివ్యక్తం చేసుకోవటమే జీవిత లక్ష్యం. సరైన మానసిక స్థితి ఉంటే అన్నిరకాలైన మంచిపనులు ఈ లక్ష్యసాధనకు ఉపయోగ పడతాయి. మానవజీవిత లక్ష్యసాధనకు ఏర్పరచిన ఈ విధానాలు మతంలో ఇమిడి ఉన్నాయి. అంతేగాని కొన్ని సంప్రదాయాలను, సిద్ధాంతాలను అంగీకరించటం గాని, కొన్ని కర్మకలాపాలను మాత్రమే పాటించటం గాని మతం అనిపించుకోదు. మతమనేది అనుభవం లేక ఉన్నత ఆధ్యాత్మిక సత్యాలను మన నిత్యకృత్యాల్లోను, ఆలోచన లన్నింటిలోను కనబరచటం. మనం దీన్ని కర్మ, భక్తి, జ్ఞాన యోగాల్లో ఏ ఒక్క మార్గం ద్వారా గాని, అన్నింటి ద్వారా గాని సాధించవలసి ఉంటుంది.

ఆధ్యాత్మిక జీవనానికి ఆవశ్యకమైన వాటిలో బలం ఒకటి. బలమే పుణ్యం, బలహీనతే పాపం. విశ్వాసం బలం, భగవంతుడిపైనా, తనపైనా నమ్మకం ఉండటం విశ్వాసానికి మూలం. ఆత్మవంచన, స్తబ్దత, తన పాపాలను గురించే తలపోయటం అనే వాటిని అవశ్యం విడనాడాలి. పాప తలంపులతో పాపాన్ని అతిక్రమించలేం. స్వాభావికమైన దివ్యత్వాన్ని గురించి మననం చెయ్యటం చేతనే దాన్ని అధిగమించగలం. మానవుడు పాపి కాడు. అమృతపుత్రుడు. ఈ విశ్వాసమే బలానికి మూలం. అందువల్ల దివ్యత్వం సుగుణాలన్నింటికి మూలం.

స్థిరమైన నైతికత లేకుండా ఆధ్యాత్మిక జీవితం దుర్లభం. నిస్వార్థపరత్వం నైతిక జీవనానికి ప్రధాన లక్షణం. త్యాగ భావం లేకుంటే మానవుడు నిస్వార్థపరుడు కాలేడు. కామ కాంచన విసర్జనమే త్యాగం. తోటి మానవులకు శ్రద్ధతో చేసే సేవగాను, బలిష్ఠమైన, స్థిరమైన భక్తి తత్పరతగాను త్యాగబుద్ధి ప్రకటితమౌతుంది. త్యాగబుద్ధి, తీవ్రమైన ఆకాంక్ష పరిపక్వత చెందిన హృదయంలోనే భగవద్దర్శనం కలుగుతుంది. మానవుడు ఈ లక్ష్యాన్ని చేరుకోకపోయినా, దాని సాధనలో ఎంతో కొంత పురోగతి సాధించకపోయినా ఈ లోకంలో అతడి జీవితం నిజానికి నిరర్థకమే!

ఓం తత్సత్

# భగవాన్ శ్రీరామకృష్ణ
# (ఉపదేశాలు)

## శ్రీరామకృష్ణుల ప్రధానమైన సూక్తులు

1. ఆకాశంలో రాత్రిపూట నీకు అనేక నక్షత్రాలు కనిపిస్తాయి. సూర్యోదయం కాగానే అవి కనిపించవు. అందుచేత పగటిపూట ఆకాశంలో నక్షత్రాలు లేవని చెప్పటం సబబా? ఓ మానవుడా! నీ అజ్ఞానస్థితిలో భగవంతుణ్ణి చూడలేక పోయినంత మాత్రాన భగవంతుడు లేడని చెప్పవద్దు.

2. దుర్లభమైన మానవజన్మను ఎత్తి, ఈ జన్మలోనే భగవత్సాక్షాత్కారానికి పాటుపడని వ్యక్తి జన్మ నిరర్థకం.

3. దేన్ని తెలుసుకుంటే అన్నీ తెలిసివస్తాయో ఆ 'ఒకటి' తెలుసుకో. ఒకటి సంఖ్య వేసాక సున్నలు చేరిస్తే వందలు, వేలు అవుతాయి. కాని ఒకటి సంఖ్యను చెరిపేస్తే ఆ సున్నలకు విలువ లేదు. ఒకటి ఉండటం వల్లనే సున్నలకు విలువ వచ్చింది. మొదట ఒకటి, తరువాత అనేకం. మొదట దైవం, తరువాత జీవులు, జగత్తు.

4. చిన్న పిల్లలు గదిలో వాళ్ళ ఇష్టం వచ్చినట్లు భయభక్తులు లేకుండా బొమ్మలతో ఆడుకుంటారు. కాని తల్లికనబడగానే వాటిని అటూ, ఇటూ విసరివేసి, "అమ్మా, అమ్మా" అంటూ ఏడుస్తూ పోతారు. ఓ మానవుల్లారా! మీరు కూడ భయం గాని, ఆరాటం గాని లేకుండా సంపద, గౌరవం, కీర్తి అనే వాటితో మదించి ఈ ప్రాపంచిక జగత్తులో ఆడుకుంటున్నారు.

ఒక్కసారి దివ్యజనని చూచారా, వీటన్నింటిలో మీకు ఆసక్తి ఉండదు.

5. సముద్రగర్భంలో ముత్యాలున్నాయి. కాని అవి కావాలంటే ఎన్నో ప్రమాదాలను ఎదుర్కోవాలి. ఒకసారి మునగటంలో అవి నీకు లభించకపోతే, సముద్రంలో ముత్యాలే లేవని నిర్ణయానికి రాకు. మళ్ళీ, మళ్ళీ మునిగావా, చివరకు నీకు ఫలితం దక్కి తీరుతుంది. అదే విధంగా భగవదన్వేషణలో నీ ప్రథమ ప్రయత్నాలు నిష్ఫలమైతే, నిరుత్సాహపడ వద్దు. ప్రయత్నం చేస్తూనే ఉంటే, చివరకు భగవంతుణ్ణి దర్శించి తీరుతావు.

6. భగవంతుడు అనంతుడు. జీవుడు పరిమితుడు. అందువల్ల పరిమితమైన జీవుడు అఖండాన్ని ఎలా అర్థం చేసుకుంటాడు? అది ఉప్పుబొమ్మ సముద్రపు లోతు కొలవడానికి యత్నించినట్లుంటుంది. ఆ ప్రయత్నంలో ఉప్పు బొమ్మ సముద్రంలో కరిగి మటుమాయం అవుతుంది. అదేవిధంగా జీవుడు భగవంతుణ్ణి అంచనా వేసి తెలుసుకోవాలని ప్రయత్నిస్తూ తన వ్యక్తిత్వాన్ని కోల్పోయి అతనిలో తాదాత్మ్యాన్ని చెందుతాడు.

7. మానవరూపంలో భగవంతుడు క్రీడిస్తున్నాడు. అతడొక గొప్ప గారడీవాడు. జగత్తులనేవి అతని అద్భుతమైన గారడీ. గారడీవాడొక్కడే నిత్యం. గారడీ అసత్యం.

8. మానవ శరీరం కుండవంటిది. మనస్సు, బుద్ధి, ఇంద్రియాలు అనేవి నీళ్ళు, బియ్యం, బంగాళాదుంపలు మొదలైనటువంటివి. బియ్యం, బంగాళదుంపలు నీళ్ళ కుండలో పోసి మంట మీద పెడితే, అవి కూడా వేడెక్కి తాకితే చేతిని కాలుస్తాయి. వాస్తవానికి వేడి అనేది కుండకు గాని, నీటికి గాని, బంగాళా దుంపలకు గాని చెందదు. అదే విధంగా మానవుడిలోని బ్రహ్మశక్తి మాత్రమే మనస్సును, బుద్ధిని, ఇంద్రియాలను వాటివాటి పనులు చేసేట్లు చేస్తుంది. ఆ శక్తి ఆగిపోతే ఇవన్నీ ఆగిపోతాయి.

9. కుబుసానికంటే పాము ఎలా వేరై ఉందో అదే విధంగా శరీరానికి ఆత్మ భిన్నంగా ఉంది.

10. మూడు రకాల బొమ్మలున్నాయి. ఉప్పుతో చేసింది. గుడ్డతో చేసింది, రాతితో చేసింది. వీటిని నీళ్ళలో ముంచితే మొదటిది కరిగిపోయి తన రూపాన్నే కోల్పోతుంది. రెండవది చాలా నీళ్ళను పీల్చుకున్నా అదే ఆకారాన్ని సంతరించుకుని ఉంటుంది. మూడవ దానిలోకి నీరు పోనేపోదు. మొదటి బొమ్మ తన వ్యక్తిత్వాన్ని సర్వవ్యాప్తమైన అనంతాత్మలో లీనం చేసుకుని దాన్లో తాదాత్మ్యాన్ని చెందిన వ్యక్తిని సూచిస్తుంది. రెండవది దివ్యానందంతోను, జ్ఞానంతోను నిండిపోయిన, భక్తుణ్ణి సూచిస్తుంది. మూడవది, భక్తిజ్ఞానాలు అణుమాత్రమైనా లోనికి చొరనివ్వని ప్రాపంచిక వ్యక్తిని సూచిస్తుంది.

# మృత్యువు, పునర్జన్మ

11. భగవద్భక్తి లేకపోవటం వల్ల, మానవుడు అంతగా బాధపడుతున్నాడు. చివరి ఘడియల్లో భగవద్భావన కలగటానికి సాయపడే విధానాలన్నీ అతడు అవలం బించాలి. భక్తిసాధనే ఆ విధానం. జీవితమంతా దీన్ని అవలంబిస్తే చివరి ఘడియల్లో తప్పక భగవంతుని తలంపు వచ్చి తీరుతుంది.

12. పచ్చికుండ పగిలిపోతే కుమ్మరివాడు ఆ మట్టిని మళ్ళీ కొత్త కుండను చెయ్యటానికి వినియోగిస్తాడు. కాల్చిన కుండ పగిలిపోతే దాన్ని ఇక ఉపయోగించడు. అదేవిధంగా అజ్ఞానంలో మరణించినవాడు మళ్ళీ జన్మిస్తాడు. కాని జ్ఞానాగ్నిలో బాగా కాలినవాడు సిద్ధుడుగా మరణించి, మళ్ళీ జన్మించడు.

## బంధించేది, విముక్తి నిచ్చేది మాయే

13. భగవంతునిలో విద్యామాయ, అవిద్యామాయా రెండూ ఉన్నాయి. విద్యామాయ భగవదున్ముఖం చేస్తుంది. అవిద్యా మాయ పక్కదారి తొక్కిస్తుంది. జ్ఞానం, భక్తి, వివేకం, దయ ఇవన్నీ విద్యామాయ లక్షణాలు. వాటి సహాయం వల్లే మానవుడు మాధవుణ్ణి చేరుకోగలడు.

14. మాయ అంటే ఏమిటి? అది ఆధ్యాత్మిక పురోగతికి అడ్డం వచ్చే కామమే.

15. భగవంతుణ్ణి కోరేవాళ్ళు, ఆధ్యాత్మిక సాధనల్లో పురోభివృద్ధి కోరేవాళ్ళు కామినీకాంచనాల పాశాల నుంచి జాగ్రత్తపడాలి. లేకపోతే వాళ్లు విముక్తి పొందలేరు.

16. 'కామినీ – కాంచనాలు' ప్రపంచాన్నంతా పాపంలో ముంచివేసాయి. స్త్రీని జగజ్జననీ స్వరూపమనే దృష్టితో చూస్తే ఆ పాశాలు నశిస్తాయి. 'కామినీ – కాంచన' తృష్ణ అంతరించే వరకు భగవంతుణ్ణి దర్శించలేం.

17. ధనం ఎవరికి బానిసో అతడే నిజమైన మానవుడు. కాని ధనాన్ని సరిగా ఉపయోగించటం తెలియని వారు మానవులని పిలవటానికే అనర్హులు.

# అహంకారం

18. విశ్వానికంతా సూర్యుడు వేడి, వెలుగు నివ్వగలడు. కాని కిరణాలకు మేఘం అడ్డం వస్తే, అలా చెయ్యలేడు. అదేవిధంగా అహంకారం హృదయాన్ని కప్పితే భగవంతుడు దాని మీద ప్రకాశించడు.

19. వాననీరు మెరకపై నిలవదు. పల్లానికి పారుతుంది. అదేవిధంగా, భగవంతుని కరుణ సరళ హృదయాల్లో నిలుస్తుంది. డాంబికులు, గర్వితుల నుండి కిందికి ప్రవహిస్తుంది.

20. అహంభావం ఎంత ప్రమాదకరమంటే, అది నిర్మూలమైతే కాని మానవుడికి విముక్తి లేదు. కోడె దూడను చూడు; అహంకారం వల్ల దాని కెన్ని కష్టాలు వస్తున్నాయో, పుట్టీ పుట్టటంతోనే 'హంహై – హంహై' 'నేనున్నాను. నేనున్నాను' అంటూ అరుస్తుంది. ఈ అహంభావం వల్ల అది పెద్దదై, ఎద్దుగా ఎదగగానే నాగలికి కడతారు లేక బళ్ళకు కట్టి బరువులు లాగిస్తారు. ఆవులు అయితే గుంజకు కట్టి ఉంచుతారు. లేకపోతే నరికి తింటారు. కాని ఈ శిక్షలు వేసినా, అది దాని అహంకారాన్ని వదలదు. ఎందుకంటే, దాని తోలుతో చేసిన డోళ్ళు కూడా 'హం' – 'నేను' అనే ధ్వనిస్తాయి. దాని పేగులతో దూదేకుల వాడు తాడుగా ఏకుతుండే వరకు అది వినమ్రతను అలవర్చుకోదు. అప్పుడు దానిపేగులు 'తూ హై' 'నువ్వున్నావు' అని కీర్తిస్తాయి. 'నేను' తొలగిపోయి, 'నువ్వు' అనేదానికి చోటు ఇవ్వాలి. మానవుడికి ఆధ్యాత్మిక ప్రబోధం కలిగే వరకు ఇది సాధ్యం కాదు.

21. అహంకారం రెండు రకాలు– మొదటిది పక్వాహంకారం. రెండవది అపక్వాహంకారం. నా దనేదేదీ లేదు. నేను చూసేది, వినేది, భావించేది, చివరకు శరీరం కూడా నాది కాదు. నేను శుద్ధుణ్ణి, బుద్ధుణ్ణి, ముక్తుణ్ణి అనే భావాలు 'పక్వాహంకారం' వల్ల కలుగుతాయి. 'ఇది నా ఇల్లు', 'ఇది నా బిడ్డ', 'ఈమె నా భార్య' అనేటటువంటి భావాలు అపక్వాహంకారం వల్ల వస్తాయి.

22. సమాధిస్థితి పొందిన తరువాత కూడా కొంత మంది 'దాస్య' భావాన్ని (నేను భగవంతుని భక్తుణ్ణి లేక దాసుణ్ణి) నిలుపుకుంటారు. శంకరాచార్యుల వారు ఇతరు లకు బోధించటానికై విద్యాహంకారాన్ని నిలుపు కున్నారు.

23. హనుమంతుడికి భగవంతుని సాకార, నిరాకార దర్శనమైంది. అయినా ఆయన 'దాస్య' భావాన్ని నిలుపుకుని ఉన్నాడు. నారదుడు, సనక, సనందన, సనత్కుమార, సనత్సుజాతుల విషయం కూడ అటువంటిదే.

# విద్య : పర, అపర

24. శాస్త్ర పాండిత్యంతో భగవంతుణ్ణి వర్ణించటం అనేది చిత్రపటాన్ని మాత్రమే చూసి కాశీక్షేత్రాన్ని వర్ణించటం వంటిది.

25. గ్రంథం అంటే పుణ్యగ్రంథం మాత్రమే కాదు. అది సాధారణంగా 'గ్రంథి' (ముడి) కూడా అవుతుంది. సత్యాన్ని దర్శించాలనే ఆకాంక్షతో గర్వాన్ని విడిచిపెట్టి అధ్యయనం చెయ్యకపోతే కేవల గ్రంథపఠనం అనేది పాండిత్యానికి, అహంకారానికి చోటిచ్చి, మనస్సుకు భారమౌతుంది. అది అనేకమైన ముడులతో సమానం.

26. దేనివల్ల భగవంతుని తెలుసుకుంటామో అది పరావిద్య లేక ఉత్తమ జ్ఞానం. మిగిలినదంతా మనస్సును కలవరపరచి భారహేతువులౌతాయి. గ్రంథాలు కొన్ని సమయాల్లో 'గ్రంథులు' (ముడులు). ఉత్తమజ్ఞానాన్ని కల్గించినప్పుడే అవి మంచివి.

# ప్రపంచంలో ఎలా జీవించాలి?

27. చేతికి నూనె రాచుకొని పనసపండు ఒలిస్తే, దాని పాలజిగురు నీ చేతులకు అంటుకొని, ఇబ్బంది కల్గించదు. పరమాత్మ జ్ఞానంలో రక్షణ కలిగించుకుని, భోగభాగ్యాల మధ్య నివసిస్తే అవి నిన్నే విధంగాను బాధించవు.

సూదంటురాయి సూది ఉత్తరదిశనే సూచిస్తుంది. అందువల్ల ప్రయాణం చేసే పడవలు దారి తప్పవు. హృదయం భగవంతుని వైపు తిరిగి ఉన్నంత వరకు సంసారసాగరంలో కొట్టుకుని పోదు.

## ఆధ్యాత్మిక జీవనానికి సహాయకారులు

28. కర్రతో అంచెలు కట్టకుండా భవన నిర్మాణం చెయ్యడం అసాధ్యం. పని పూర్తయిన తర్వాత దాని అవసరాన్ని ఎవరూ పట్టించుకోరు. అదేవిధంగా ప్రారంభదశలో విగ్రహారాధన అవసరంగాని తదుపరి కాదు.

29. ఆవు శరీరంలో రక్తంద్వారా పాలు, దాని శరీరమంతా వ్యాపించి ఉన్నాయి. కాని దాని చెవులను గాని, కొమ్ములను గాని పితకటం వల్ల పాలు లభించవు. దాని పొదుగులో నుండే పాలు వస్తాయి. అదేవిధంగా భగవంతుడు సర్వత్రా వ్యాపించి ఉన్నాడు. కాని నువ్వు భగవంతుణ్ణి అన్నిచోట్ల చూడలేవు. ప్రాచీనకాలం నుండి భక్తుల ఆధ్యాత్మిక సాధనల వల్ల, వారి జీవితాల వల్ల నిండిన పుణ్యతీర్థాల్లో భగవంతుడు అధికంగా ప్రస్ఫుటమౌతాడు.

30. కొలిమి ఊదుతూ కమ్మరివాడు నిప్పును ప్రజ్వలింపజేస్తున్నట్లు, సజ్జన సాంగత్యంతో మనస్సును పవిత్రంగాను, ప్రకాశవంతంగాను ఉంచాలి.

31. 'నామం' అంటే తక్కువ అనుకున్నావా? సత్యభామ తన నగలన్నింటి తోనూ భగవంతుణ్ణి తూచ లేకపోయింది. కాని రుక్మిణి కృష్ణనామంతో, తులసి దళాన్ని త్రాసు రెండవవైపు వేసి తూచగలిగింది.

32. భగవంతుణ్ణి దర్శించాలంటే, భగవన్నామ జపంలో పూర్తి విశ్వాసముంచు. నిత్యానిత్య విచారణ కూడా చెయ్యి.

33. భక్తితో భగవన్నామాన్ని కీర్తించు. కొండంత దూది మీద పడే ఒక్క నిప్పురవ్వ దాన్ని భస్మం చేసినట్లు, భగవన్నామం వల్ల పాపపర్వతం మటుమాయం అవుతుంది.

# మతాలన్నీ ఒకే దేవుణ్ణి చేరుస్తాయి

34. ఒకేనీరు, అనేకుల చేత అనేక పేర్లతో 'అక్వా', 'వాటర్', పానీ', 'వారీ' అని పిలువబడినట్లు ఒకే సచ్చిదానంద పరబ్రహ్మం కొంతమంది చేత 'గాడ్' గాను, కొందరిచేత 'అల్లా' గాను, కొందరిచేత 'హరి' గాను, మరికొందరి చేత 'బ్రహ్మం' గాను ఆరాధింపబడుతున్నది.

35. వివిధ సంప్రదాయాలు ఒకే దైవాన్ని చేర్చే వివిధ మార్గాలు. కలకత్తాలోని కాళీఘాట్ లో ఉన్న కాళీ దేవాలయా నికి పోవటానికి అనేక మార్గాలున్నాయి. ప్రతిమతం ఈ మార్గాల్లో ఏదో ఒకటి మాత్రమే.

# భగవంతుని పట్ల శరణాగతి

36. కోతి పరుగెత్తుతున్నప్పుడు కోతిపిల్ల దాన్ని గట్టిగా పట్టుకుంటుంది. కాని పిల్లిపిల్ల అలా చెయ్యదు. దీనంగా "మ్యావ్ మ్యావ్" మంటుంది. తల్లిని పట్టుకోవడంలో కోతి పిల్ల తన పట్టు వదిలితే కిందపడిపోయి దెబ్బ తింటుంది. ఎందుకంటే అది తన శక్తి మీద ఆధారపడుతుంది. కాని పిల్లి తన కూనను పట్టుకుని పరుగెత్తుతుంది. కాబట్టి పిల్లికూనకు ఆ ప్రమాదం లేదు. స్వశక్తి మీద ఆధార పటడంలోను, భగవంతుని పట్ల పూర్తిగా శరణుజొచ్చడం లోనూ అటువంటి తారతమ్యముంది.

37. భగవంతుణ్ణి పూర్తిగా శరణుజొచ్చడమంటే ఏమిటి? పగలంతా కష్టించి పనిచేసి అలసిన కార్మికుడు దిండుపై తలపెట్టుకుని చుట్ట పీలుస్తూ హాయిగా విశ్రాంతి తీసుకోవడం వంటిది. అన్ని బంధాలు, అన్ని చికాకులు సమసిపోవటమే అది.

# ధారణ, ధ్యానం

38. పొట్లం పగిలి అన్ని వైపులకు పడిపోయిన ఆవాలను పోగుచేయడం మాదిరి అనేక ప్రాపంచిక విషయాల మీదికి చెదిరిపోయిన మనస్సును కుదుటపరచి ఏకాగ్రం చేయడం అంత సులభమైన పనిగాదు.

39. భగవంతుణ్ణి ఒక మూలనో, ఏకాంతమైన అరణ్య ప్రదేశంలోనో, నీ ప్రశాంత హృదయ మందిరంలోనో ధ్యానించు.

40. తీవ్రమైన ధ్యానం, ధ్యేయ వస్తువు యొక్క యథార్థతత్వాన్ని బయల్పరచి ఆ తత్వంతో ధ్యాని (ధ్యానం చేసేవాడు) యొక్క హృదయాన్ని నింపుతుంది.

# భగవంతునికోసం వ్యాకులత

41. నువ్వు పిచ్చివాడివి కావలసి ఉంటే ప్రాపంచిక వస్తువులకై పిచ్చివాడివి కావద్దు. భక్తితో పిచ్చివాడివవు.

42. పిల్లలు పుట్టలేదని కొందరు కన్నీళ్ళు కారుస్తారు. సంపద కలుగలేదని కొందరు దహించుకొనిపోతారు. ఆహా! భగవంతుణ్ణి దర్శించలేదని కన్నీళ్ళు కార్చేవాళ్ళు ఎంత మంది ఉన్నారు? ఏ కొద్దిమందో కదా! నిజంగా భగవంతుణ్ణి ఎవరు అన్వేషిస్తారో, ఆయనకై ఎవరు ఆర్తి చెందుతారో వాళ్ళే ఆయన్ను దర్శిస్తారు.

43. ఎవరి ఏకాగ్రత, వ్యాకులత తీవ్రతరమైనవో వారు భగవంతుణ్ణి శీఘ్రంగా దర్శిస్తారు.

44. ఈ కలికాలంలో భగవదనుగ్రహం పొందటానికి మూడు రోజుల పాటు తీవ్రమైన వ్యాకులత ఉంటే చాలు.

# భగవదనుగ్రహం

45. వేల సంవత్సరాలుగా గదిలో ఉన్న చీకటి, దీపం తేగానే మటుమాయం అవుతుంది. అనేక జన్మల పాపకర్మ ఒక్క దైవవీక్షణంతో నశిస్తుంది.

46. దైవానుగ్రహం అనే మలయమారుతం ఎల్లప్పుడు వీస్తూనే వుంది. జీవిత సముద్రంలో పయనించే సోమరి నావికులు ఆ అవకాశాన్ని వినియోగించుకోరు. కాని మెళకువతో ఉన్న దృఢగాత్రులు వారి మనస్సులనే తెర చాపలను ఎత్తి ఉంచి అనుకూలమైన గాలిని వినియోగించు కుంటారు.

47. నువ్వు ఎంత శ్రమపడ్డా దైవానుగ్రహం లేకుండా ఏ పనీ సాధ్యపడదు. దైవానుగ్రహం లేనిదే దైవదర్శనం కూడా కాదు.

# దివ్యావతారం

48. సీతారాములు, రాధాకృష్ణులు కేవలం కల్పిత పాత్రలుగాను, చారిత్రక వ్యక్తులు గాను తలంచవద్దు. అలాగే పవిత్ర గ్రంథాల్లోని అంతరార్థాలు మాత్రమే సత్యమనుకో వద్దు. నీలాగా, నాలాగా వారు రక్తమాంసాలతో ఉన్న మానవులు అయినప్పటికీ వారు దివ్యపురుషులు కాబట్టి వారి జీవితాలను చారిత్రాత్మకం గాను, కథల్లోని వ్యక్తులు గాను వివరించవచ్చు. సముద్రానికి అలెట్లాగో బ్రహ్మానికి అవతారాలు ఆ విధమైనవి.

49. అవతారం ఎప్పుడూ ఒకటే. జీవితసాగరంలో దూకి, ఒకే భగవంతుడు ఒకచోట లేచి కృష్ణుడుగా తెలియబడుతున్నాడు. మరొకసారి మునిగి ఇంకొక చోట లేచి క్రీస్తుగా తెలియబడుతున్నాడు.

50. యథార్థంగా భగవంతుడు అనంతుడు కాని ఆయన సర్వశక్తిమంతుడు. ఆయన దివ్యత్వమనేది శరీరంలో ప్రేమగా అభివ్యక్తమై, అవతార పురుషుడుగా మన మధ్య మసలగలడు. భగవదవతారం నుండి ప్రేమ మనవైపు ధారలుగా ప్రవహిస్తుంది.

# భక్తి జ్ఞానం

51. శుద్ధభక్తి, శుద్ధ జ్ఞానం రెండూ ఒకటే.

52. అద్వైతజ్ఞానం సర్వోత్కృష్టమైనదైనా (అన్నిటి కంటె గొప్పదైనా) నీ సాధనను, భక్తుడు, భగవానుడు అంటే భగవంతుడు ఆరాధింపబడేవాడు, నేను ఆయనను అర్చించేవాణ్ణి అనే భావనలో మొదలుపెట్టు. తర్వాత నీకు జ్ఞానం సులభంగా లభిస్తుంది.

53. నా జగజ్జనని (బ్రహ్మం యొక్క సాకార రూపిణి) తానే వేదాంతులు ప్రతిపాదించే బ్రహ్మన్నని చాటింది. అపక్వాహంకారాన్ని తొలగించి బ్రహ్మజ్ఞానాన్ని ప్రసాదించే శక్తి ఆమెకు ఉంది. అందువల్ల నువ్వు మొట్టమొదట ఆ తల్లి అనుగ్రహాన్ని పొందితే విచారణ మార్గం ద్వారా బ్రహ్మన్ని పొందవచ్చు. భక్తి ద్వారా కూడా దాన్ని పొంద వచ్చు. భక్తిలోని సారం భక్తి వివేకం కలగాలనే నిరంతర ప్రార్థనలలోను, ఆత్మార్పణ చెయ్యటంలోను ఇమిడి ఉంది. ఈ మార్గాల ద్వారానే ముందు నా తల్లి దగ్గరికి (సాకారదైవం) చేరుకో. నా మాట నమ్ము. నీ ప్రార్థన నిజంగా హృదయ పూర్వకమైనదైతే మా అమ్మ తప్పక నీకు సమాధానమిస్తుంది. ఆమె నిరాకారస్థితిని దర్శించాలని ఉంటే మళ్ళీ ఆమెనే ప్రార్థించు. ఆమె సర్వశక్తి సమన్వితు రాలైనప్పుడు ఆమె నీ ప్రార్థన వినకుండా ఉంటుందా? నువ్వు ఆమె నిరాకారస్థితిని సమాధిలో దర్శిస్తావు. ఇదే నిజంగా బ్రహ్మజ్ఞాన మంటే.

# కర్మయోగమంటే ఏమిటి?

54. కర్మ ద్వారా భగవంతునితో సంబంధం కల్పించు కోవటమే కర్మయోగం. నిష్కామంగా అభ్యసిస్తే అష్టాంగ యోగం లేక రాజయోగం కూడా కర్మయోగమే. ధ్యానం ద్వారాను, ధారణ ద్వారాను అది తాదాత్మ్యాన్ని చేకూరుస్తుంది. గృహస్థులు నిర్వహించే విధులు సాంఘిక రాజకీయాలకు సంబంధించినవైనా ఫలాపేక్ష లేకుండా భగవంతుని కీర్తించటమే లక్ష్యంగా పెటుకుని ఆచరిస్తే అది కూడా కర్మయోగమే అవుతుంది. భగవద్విభూతికై నిష్కామంగా నిర్వహించే శాస్త్రోక్తమైన పూజ, పురస్కారాలు, జపం మొదలైన కర్మలన్నీ కూడా కర్మయోగమే. ఇతర యోగాల లక్ష్యం ఏ విధంగా సగుణ నిర్గుణ భగవత్సా క్షాత్కారాన్ని పొందటమో, కర్మయోగ లక్ష్యం కూడ అంతే.

# నిర్గుణ పరబ్రహ్మం

55. వేదాలు, తంత్రాలు, పురాణాలు, ధర్మశాస్త్రాలు, మొదలైనవి నోటితో అనేక సార్లు ఉచ్ఛరించబడటం వల్ల ఉచ్ఛిష్టాలే. కాని అఖండ పరబ్రహ్మాన్ని వాక్కులో ఆ విధంగా ఎవ్వరూ దర్శించలేక పోవడం వల్ల అది ఉచ్ఛిష్టం కాలేదు.

56. బ్రహ్మం అవాఙ్మానస గోచరం, ధ్యాన ధారణలకు అతీతం. జ్ఞాన జ్ఞేయాలకు, సత్యాసత్యాలకు అతీతం. ఒక్క మాటలో చెప్పాటంలే ద్వంద్వాతీతం.

57. అద్వైత సిద్ధాంతమే సత్యమైనది హేతుబద్ధమైనది, శాశ్వతంగా నిలవగలిగినది అని, సాకార దైవంలో విశ్వాసం ఉన్నవారందరి విశ్వాసం సరియైనది కాదని అద్వైతి చెప్పకుండ ఉండనీ! భగవంతుని సాకార సాక్షాత్కారం ఎంత మాత్రం తక్కువ అయినది కాదు. అసత్యం కాదు. ఆ అనుభూతులు మనోవాక్కాయాలకు అతీతాలు.

58. అద్వైతాన్ని గూర్చి మాట్లాడినప్పుడల్లా నువ్వు ద్వైతాన్ని ప్రతిపాదిస్తున్నావు. అఖండాన్ని గూర్చి మాట్లాడి నప్పుడల్లా వ్యావహారిక సత్యాన్ని అంగీకరిస్తున్నావు. నువ్వు అనుకునే కేవలం(బ్రహ్మం) సమాధిలో సాక్షాత్కరించే వరకు అది వ్యవహారానికి సంబంధించినదే. లేకపోతే కేవలం అనేది మాత్రమే నిలిచిపోతుంది. ఉన్నదున్నట్లు నువ్వు దాన్ని గూర్చి చెప్పలేవు. ఎందుకంటే అలా చెయ్యటంలో, నువ్వు ఒకే అన్యపదార్థంతో, అంటే నీ వ్యక్తిత్వంతో దానికి పూతపూస్తున్నావు.

59. 'నేను' అనేది నాలో ఉన్నంత వరకు నాకు సాకార దైవమున్నాడు. ఆ సాకారదైవం అనేక విభూతులలో ప్రపంచం గాను, అందలి జీవరాసులు గాను సాక్షాత్కరి స్తున్నాడు.

60. పరబ్రహ్మం నిష్క్రియమని అంటే సృష్టి స్థితి లయాలనే చేయటం లేదని తలచినప్పుడల్లా నేను ఆయనను బ్రహ్మమని, పురుషుడని చెబుతాను. ఆయనను క్రియాత్మకుడు

– సృష్టి స్థితి సంహారాలు చేసేవాడు – అని తలచినప్పుడు నేను ఆయనను శక్తి లేక మాయ లేక ప్రకృతి అంటాను.

61. శక్తికి, బ్రహ్మానికి మధ్య గల తేడా అభేద్యమైన తారతమ్యమే. అగ్ని దాని దాహకశక్తి (కాల్చే స్వభావం), పాలు దాని తెల్లదనం ఒకటన్నట్లు బ్రహ్మం శక్తి అనేవి ఒక్కటే గాని భిన్నమైనవి కావు. ఒకదాన్ని తలుచుకోకుండా రెండవదాన్ని ఊహించలేవు.

62. ఒకటైన నా జగజ్జననియే అనేకంగా గోచరిస్తున్నది. ఆమె అనంతశక్తి సంపన్నురాలైనా, జీవజగత్తులుగా వివిధ శక్తులుగాను (శారీరక, మానసిక, నైతిక, ఆధ్యాత్మిక) రూపు దాల్చింది. అందువల్ల నా జగజ్జనని వేదాంత ప్రతిపాదిత మైన బ్రహ్మాని కంటే వేరుకాదు.

63. నీరు గడ్డకట్టినప్పుడు మంచు అయినట్లు సర్వవ్యాపకమైన నిరాకార పరబ్రహ్మం, భక్తుని భక్తి కారణంగా దృగ్గోచరమైన (కంటికి కనిపించే) సాకార రూపంగా అభివ్యక్తమవుతోంది. అది ఘనీభవించిన సచ్చిదానందం అని అనవచ్చు. నీటిలో భాగమైన మంచుగడ్డ నీటిలోనే ఉండి దానిలోనే కరిగిపోయినట్లు, నిరాకార బ్రహ్మంలో భాగమైన సాకార రూపం నిరాకారం నుండి ఉద్భవమై, దానిలోనే వుండి, దానిలోనే లీనమైపోతోంది.

# సమాధి తదనంతర విజ్ఞానం

64. దృశ్యమానమైన దాన్ని నిషేధించి ఆత్మను దర్శించటమే జ్ఞానం. వివేకం ద్వారా దృశ్యాన్ని నిషేధించటం వల్ల సమాధి కలిగి ఆత్మ సాక్షాత్కారం అవుతుంది.

పరిపూర్ణత్వాన్ని తెలుసుకోవటం విజ్ఞానం. కొంతమంది పాలను గూర్చి వింటారు. కొందరు చూస్తారు. మరికొందరు రుచి చూస్తారు. పాలను గూర్చి విన్నవాడు అజ్ఞాని. దాన్ని చూసినవాడు జ్ఞాని. రుచి చూసిన వాడు అంటే పరిపూర్ణంగా దాన్ని గూర్చి తెలుసుకున్నవాడు విజ్ఞాని. భగవంతుణ్ణి దర్శించి ఆయనతో ఆప్తబంధువు వలె సన్నిహితత్వం కలిగి ఉండటాన్ని విజ్ఞాన మంటారు.

మొదట 'నేతి' 'నేతి' 'ఇది కాదు, ఇది కాదు' అనే మార్గాన్ని అనుసరించాలి. (బ్రహ్మం) పంచభూతాలు కాదు, మనోబుధ్యహంకారాలు కాదు. అన్ని తత్వాలకు అతీతం. మేడ ఎక్కటానికి ఒక్కొక్క మెట్టే పైకి పోవాలి. మెట్లు మేడ కాదు. కాని మేడ ఎక్కిన తర్వాత మేడ కూడా, మెట్లలాగానే, అదే ఇటుక, అదే సున్నం, అదే ఇసుకతో కట్టబడిందని తెలుస్తుంది. ఏది పరబ్రహ్మమో అదే జీవజగత్తులు గాను, వేదాంతం, చతుర్వింశం (ఇరవై నాలుగు) తత్వాలు గాను రూపొందింది.

# Footnotes

★ అద్వైతాశ్రమం వారి 'శ్రీరామకృష్ణుల జీవిత చరిత్ర' పుస్తకానికి మహాత్మాగాంధీ వ్రాసిన ముందుమాట.